హైదరాబాద్
HYDERABAD
సంపుటి (Volume): 15
సంచిక (Issue): 101
వెల (Price) రూ.6.50
పేజీలు: 12+4
Pages: 12+4

మన రాష్ట్రం మన పత్రిక
నమస్తే తెలంగాణ
NAMASTE TELANGANA
PUBLISHED FROM HYDERABAD • KARIMNAGAR • WARANGAL • KHAMMAM • NALGONDA • MAHABUBNAGAR • NIZAMABAD
www.ntnews.com /ntdailyonline


సోమవారం
MONDAY
15.9.2025

సోమవారం, సూర్యోదయం: 6-04, సూర్యాస్తమయం: 6-18. శ్రీ విశ్వావసు నామ సంవత్సరం దక్షిణాయనం వర్ష రుతువు భాద్రపద మాసం కృష్ణ పక్షం తిథి: నవమి రాత్రి 1-31 వరకు. నక్షత్రం: మృగశిర ఉదయం 7-31 వరకు. వర్జ్యం: ఉదయం 7-36 నుంచి ఉదయం 9-08 వరకు. రాహుకాలం: ఉదయం 7-36 నుంచి ఉదయం 9-08 వరకు. దుర్ముహూర్తం: పగలు 12-35 నుంచి పగలు 1-24 వరకు, పునర్ దుర్ముహూర్తం పగలు 3-01 నుంచి పగలు 3-50 వరకు. అమృతకాలం: రాత్రి 9-04 నుంచి రాత్రి 10-37 వరకు.



రింగులు తిరిగిన అలైన్‌మెంట్!

ఇది రంగారెడ్డి జిల్లా మాడ్గుల గ్రామ పరిధిలో కేసీఆర్ హయాంలో ప్రతిపాదించిన ట్రిపుల్ ఆర్ అలైన్‌మెంట్. రేవంత్ సర్కారు వచ్చిన తర్వాత దీన్ని మార్చింది. ఈ భూమికి అవతల 2-3 కి.మీటర్ల దూరం నుంచి ఖరారు చేసింది. ఎందుకంటే గతంలో మార్కు చేసిన ఈ భూమి 'ముఖ్య'నేత అత్యంత సమీప బంధువుది. దాన్ని కాపాడేందుకు చంద్రాయణ్ పల్లి, కలకొండ గ్రామాల నుంచి అలైన్‌మెంట్ చేయడంతో సన్న, చిన్నకారు రైతులు తమ భూముల్ని కోల్పోవాల్సి వస్తున్నది.



పెద్దల కమాల్..
పేదల భూములు ఢమాల్!

రింగు రోడ్డు అలైన్‌మెంట్‌కు.. కాంగ్రెస్‌కు అవినాభావ సంబంధం ఉన్నట్టు చరిత్ర తిరగేస్తే అర్థమవుతుంది. ఇతర పార్టీలు అధికారంలో ఉన్నప్పుడు రింగు రోడ్లకు ఒక అలైన్‌మెంట్ ఖరారైతే.. కాంగ్రెస్ అధికారంలోకి రాగానే అది నాదస్వరం ఊదితే తాచుపాములా నాట్యమాడుతుంది. ఒకచోట కిలోమీటరు జరిగితే.. ఇంకోచోట ఐదారు కిలోమీటర్ల దూరం పాకుతుంది. పాత అలైన్‌మెంట్‌లో పెద్దోళ్ల భూముల్లోంచి సాగే రింగు రోడ్డును కాంగ్రెస్ సర్కారు కమాల్ చేసి.. సన్న, చిన్నకారు రైతుల భూముల్లోకి మలుపుతుంది. నెత్తీనోరు కొట్టుకొంటూ బక్క రైతు దిక్కుతోచక చూస్తుంటాడు. చివరికి కాంగ్రెస్ నేతలే రంగంలోకి దిగి రూపాయి బదులు రూపాయిన్నర పరిహారమిస్తామని నమ్మబలికి ఉన్న జాగను గుంజుకుంటారు. పేద రైతుల భూముల్లోంచి దూసుకుపోయే విశాలమైన రింగు రోడ్డు కాస్తా పెద్దల భూములకే వన్నె తెస్తుంది. భవిష్యత్తులో వాణిజ్య సముదాయాలు, విల్లాలు, అపార్ట్‌మెంట్లు ఇలా విశ్వ నగరాలను తలపించే ఆకాశహర్మ్యాలు ఆ భూముల్లో వెలుస్తుంటే రింగు రోడ్డుకు భూములిచ్చిన రైతులు అక్కడే ఉపాధి కోసం వెతుకులాడుకుంటారు.

గతంలో కాంగ్రెస్ హయాంలో ఔటర్ రింగురోడ్డు అలైన్‌మెంట్ నాట్యమాడినట్టుగానే ఇప్పుడు రీజినల్ రింగురోడ్డు ఉరఫ్ ట్రిపుల్‌ఆర్ అలైన్‌మెంట్ కూడా ఇదేరీతిన పెద్దోళ్ల భూముల్లోంచి మారి బక్క రైతుల భూములను చెరబట్టింది. ట్రిపుల్‌ఆర్ తాజా అలైన్‌మెంట్‌లో మార్పుల వెనుక.. 'ముఖ్య'నేత సహా పలువురు కాంగ్రెస్ నాయకులకు లబ్ధి చేకూర్చడమే అసలు మతలబు!!

ట్రిపుల్ ఆర్ కొత్త అలైన్‌మెంట్‌లో విచిత్రాలు.. 2-3 కి.మీ పక్కకు!

కాంగ్రెస్ నేతల కోసం మార్పులు.. 'బిగ్ బ్రదర్స్' భూ దందా!!

రంగారెడ్డి, వికారాబాద్ జిల్లాల్లో వేల ఎకరాల 'అసైన్డ్'కు ఎసరు

- మాడ్గులలో 'ముఖ్య'నేత బంధువుల పొలంలోంచి రింగ్ రోడ్డు
- దాన్ని తప్పించి, రైతుల భూములపైకి మళ్లిస్తూ కొత్త అలైన్‌మెంట్
- మరో రెండుచోట్ల కాంగ్రెస్ ఎమ్మెల్యేల కోసం మెలితిరిగిన 'రింగ్'
- వికారాబాద్ పరిధిలో ఏకంగా 7 కిలోమీటర్లు జరిగిన రహదారి
- గతంలో ఓ మాజీ ఎంపీకి చెందిన 200 ఎకరాలపై ప్రభావం
- ఆయన భూముల్ని కాపాడేందుకు రెండోసారి 5 కి.మీ పక్కకు
- ఈసారి ముగ్గురు కాంగ్రెస్ నేతల భూముల్లోంచి ట్రిపుల్ ఆర్
- వారినీ తప్పించేందుకు మరో 2 కి.మీ జరిగిన అలైన్‌మెంట్

హైదరాబాద్ సిటీబ్యూరో ప్రధాన ప్రతినిధి/ రంగారెడ్డి/వికారాబాద్, సెప్టెంబర్ 14 (నమస్తే తెలంగాణ): కేసీఆర్ ప్రభుత్వ హయాంలో రూపొందించిన ట్రిపుల్ ఆర్ దక్షిణ భాగం అలైన్‌మెంట్‌ను గతేడాదిలోనే కాంగ్రెస్ ప్రభుత్వం 'ముఖ్య'నేత బంధువులతో పాటు పలువురు అధికార పార్టీ నేతల భూములను తప్పించేందుకు అష్ట వంకరలు తిప్పడాన్ని 'నమస్తే తెలంగాణ' వరుస కథనాలతో వెలుగులోకి తెచ్చింది. రంగారెడ్డి జిల్లాలో 1-3 కిలోమీటర్ల మేర › 2వ పేజీలో



ఎమ్మెల్యే వెంచర్ సేఫ్.. రైతులు బలి

ఇది నల్లగొండ-రంగారెడ్డి జిల్లాల సరిహద్దులో ఉన్న ఓ కాంగ్రెస్ ఎమ్మెల్యే వెంచర్. గతంలో ఇక్కడి కొన్ని ప్లాట్ల మీదుగా అలైన్‌మెంట్ ఖరారు కాగా ఆ సమయంలో సదరు నేత బీఆర్‌ఎస్‌లోనే ఉన్నారు. రేవంత్ ప్రభుత్వం వచ్చాక అలైన్‌మెంట్‌ను కిలోమీటరు దూరానికి మార్చడంతో ఇప్పుడా వెంచర్ సేఫ్ కాగా, బక్క రైతుల భూములు పోతున్నాయి.



పేద రైతుల భూముల్లోకి జరిపి..

రంగారెడ్డి జిల్లా ఆమనగల్లు మండల పరిధిలోనూ ట్రిపుల్ ఆర్ పేద రైతుల భూముల్లోకి పాకింది. నాడు ఖానాపూర్ మీదుగా అలైన్‌మెంట్ చేయగా అప్పటి ఎమ్మెల్సీ భూములకు నష్టం కలుగుతున్నా బీఆర్‌ఎస్ ప్రభుత్వం నిష్పక్షపాతంగా వ్యవహరించింది. ఇప్పుడాయన కాంగ్రెస్ ఎమ్మెల్యే కావడంతో ఇక్కడి నుంచి అలైన్‌మెంట్ దూరం జరిగింది.



ఏకంగా ఏడు కిలోమీటర్ల దూరం

వికారాబాద్ జిల్లా వైపు ట్రిపుల్ ఆర్ అలైన్‌మెంట్ తీరు వింతగా మారింది. బీఆర్‌ఎస్ హయాంలో చేవెళ్ల మండల పరిధి నుంచి అలైన్‌మెంట్ ఖరారు చేస్తే కాంగ్రెస్ వచ్చాక దాన్ని వికారాబాద్ వైపు ఏకంగా ఏడు కిలోమీటర్లు జరిపింది. పలువురు కాంగ్రెస్ కీలక నేతల భూములను కాపాడేందుకే ఇంత దూరం అలైన్‌మెంట్‌ను మార్చినట్టు తెలుస్తున్నది.



బీఆర్‌ఎస్ రాష్ట్ర కార్యదర్శి
శ్రీహరి కన్నుమూత

- అనారోగ్య సమస్యలతో తుదిశ్వాస
- 4 దశాబ్దాలపాటు ప్రజాప్రతినిధిగా సేవలు
- కర్ర శ్రీహరితో తన అనుబంధాన్ని గుర్తుచేసుకున్న బీఆర్‌ఎస్ అధినేత కేసీఆర్
- సంతాపం తెలిపిన కేటీఆర్, ప్రముఖులు
- నివాళులర్పించిన మంత్రులు, మాజీ మంత్రులు

కోహెడ/హైదరాబాద్, సెప్టెంబర్ 14 (నమస్తే తెలంగాణ): బీఆర్‌ఎస్ రాష్ట్ర కార్యదర్శి కర్ర శ్రీహరి శనివారం రాత్రి కన్నుమూశారు. గుండె, శ్వాస సంబంధిత సమస్యలతో బాధపడుతున్న ఆయన హైదరాబాద్‌లోని ఏఐజీ దవాఖానలో చేరగా పరిస్థితి విషమించి తుదిశ్వాస విడిచారు. ఆయన భౌతికకాయాన్ని ఆదివారం › 3వ పేజీలో

కమీషన్ పనులకు పైసలుంటయ్
కాలేజీలకు ఇవ్వరా?

- ఫీజు రీయింబర్స్‌మెంట్‌పై రాష్ట్ర ప్రభుత్వ నిర్లక్ష్యం
- ప్రమాదంలో 13 లక్షల మంది విద్యార్థుల భవిష్యత్తు
- కాలేజీల బంద్‌కు పిలుపునిచ్చినా స్పందించని సర్కార్
- మూతపడే స్థితిలో ఇంజినీరింగ్, డిగ్రీ, పీజీ కాలేజీలు
- కాంగ్రెస్ సర్కారుపై మాజీ మంత్రి హరీశ్‌రావు ధ్వజం



హైదరాబాద్, సెప్టెంబర్ 14 (నమస్తే తెలంగాణ): ఫీజు రీయింబర్స్‌మెంట్ విషయంలో రాష్ట్ర ప్రభుత్వం నిర్లక్ష్య, మోసపూరిత వైఖరి అనుసరిస్తున్నదని, దీంతో 13 లక్షల మంది విద్యార్థుల భవిష్యత్తు అగమ్యగోచరంగా మారిందని మాజీ మంత్రి హరీశ్‌రావు ఆగ్రహం › 6వ పేజీలో

అతి తక్కువ కాలంలో విద్యావ్యవస్థను భ్రష్టు పట్టించిన విద్యాశాఖమంత్రిగా, ముఖ్యమంత్రిగా రేవంత్‌రెడ్డి చరిత్రలో నిలిచిపోతారు. ఇప్పటికైనా కండ్లు తెరిచి, 13 లక్షల మంది విద్యార్థుల భవితను దృష్టిలో పెట్టుకొని ఫీజు బకాయిలు వెంటనే విడుదలచేయాలి. -హరీశ్‌రావు

నేటి నుంచి కాలేజీల బంద్
- 23 లేదా 24న 'చలో హైదరాబాద్'.. లక్షలాది మందితో మార్చ్
- సర్కారు దిగొచ్చే వరకు తాళాలు తియ్యం, పరీక్షలు పెట్టం: ఫతి › 6



మాజీ మంత్రి సత్యవతిరాథోడ్‌కూ యూరియా కష్టాలు తప్పలేదు. తనకున్న ఐదున్నర ఎకరాల పొలానికి అవసరమైన యూరియా కోసం సత్యవతి ఆదివారం గుండ్రాతిమడుగు సొసైటీ వద్ద మహిళా రైతులతో కలిసి లైన్‌లో నిలబడ్డారు. గంటపాటు వేచిఉన్న తర్వాత అధికారులు ఒక బస్తాకు కూపన్ ఇచ్చారు.

ప్రాణాలను బలిగొన్న
యూరియా

- ఎరువుల కోసం వెళ్తూ మహబూబాబాద్ జిల్లాలో ఇద్దరు గిరిజన రైతుల దుర్మరణం › 5
- ఢీ కొట్టిన బొలెరో వాహనం.. అక్కడికక్కడే మృతి

లారీ లోడ్ పక్కదారి

- కాంగ్రెస్ ఎమ్మెల్యే గన్‌మన్ నిర్వాకం
- ఎమ్మెల్యే పీఏనంటూ అధికార్లకు ఫోన్
- నిజమేనని నమ్మి ఓ ఎన్డీసీఎస్‌కు యూరియా లారీ పంపిన అధికారులు › 5
- నల్లగొండ జిల్లా మిర్యాలగూడలో ఘటన

ధాన్యం కొనుగోళ్లలో కోత!

- ఎఫ్‌సీఐ వానకాలం టార్గెట్ 52 లక్షల టన్నులే!
- ఈ మేరకు సివిల్ సప్లయ్ అధికారులకు సమాచారం
- అంతకు మించితే.. ఆ తర్వాత ఆలోచిద్దామని జవాబు
- సుమారు 150 లక్షల టన్నుల దిగుబడి వచ్చే అవకాశం
- మిగిలిన కోటి టన్నుల పరిస్థితేమిటనేది ప్రశ్నార్థకం
- 500 బోనస్ ఎగ్గొట్టేందుకే కొనుగోళ్లలో కోతలా?

హైదరాబాద్, సెప్టెంబర్ 14(నమస్తే తెలంగాణ): వానకాలం ధాన్యం కొనుగోళ్లలో కోతలు తప్పవా? రైతులు పండించిన మొత్తం ధాన్యం ప్రభుత్వం కొనుగోలు చేయదా? అంటే ఔను అనే అంటున్నాయి సివిల్‌సప్లయ్ వర్గాలు. ఈ వానకాలం ధాన్యం కొనుగోళ్లలో భారీ కోత పెడుతున్నట్టు తెలిసింది. కేంద్ర ప్రభుత్వం 52 లక్షల టన్నుల ధాన్యం కొనుగోలుకు మాత్రమే అంగీకరించినట్టు విశ్వసనీయంగా › 5వ పేజీలో



కేసీఆర్ 'మార్కు' చెరిపేయడమంటే ఇదేనా?!

ఇది రంగారెడ్డి జిల్లా మాడ్గుల గ్రామ పరిధిలో కేసీఆర్ ప్రభుత్వ హయాంలో ప్రతిపాదించిన ట్రిపుల్ ఆర్ అలైన్‌మెంట్. ఈ మేరకు క్షేత్రస్థాయిలో అధికారులు సర్వే చేసి ఇలా గుర్తు కూడా చేశారు. ఇది పేదరైతు భూమా? భూస్వామిదా? అనేది చూడలేదు. కానీ రేవంత్‌రెడ్డి ప్రభుత్వం వచ్చిన తర్వాత ఇక్కడినుంచి వెళ్లాల్సిన ట్రిపుల్‌ఆర్ అలైన్‌మెంట్‌ను మార్చింది.

ఈ భూమికి అవతల 2-3 కిలోమీటర్ల దూరంలో నుంచి అలైన్‌మెంట్ ఖరారు చేసింది. ఇదేదో సాంకేతిక సమస్య కాదు. గతంలో మార్కు చేసిన ఈ భూమి 'ముఖ్య'నేత అత్యంత సమీప బంధువుది. మాడ్గుల పరిధిలో 'ముఖ్య'నేత బంధువులెవరో తెలంగాణ సమాజానికంతటికీ తెలుసు. ఈ భూములను కాపాడేందుకు చంద్రాయణ్‌పల్లి, కలకొండ తదితర గ్రామాల నుంచి అలైన్‌మెంట్‌ను ఖరారు చేయడంతో సన్న, చిన్నకారు రైతులు తమ భూముల్ని కోల్పోవాల్సి వస్తున్నది. ఉన్న ఒకట్రెండు ఎకరాల భూమిని ప్రభుత్వం ట్రిపుల్‌ఆర్ కోసం తీసుకోవడంతో ఆ ప్రాంత రైతులు గగ్గోలు పెడుతున్నారు. మారిన అలైన్‌మెంట్‌తో సదరు 'ముఖ్య' నేత బంధువుల భూములు లక్షణంగా ఉండటమే కాదు.. సమీపం నుంచే రింగు రోడ్డు వెళ్లడంతో ఈ భూముల ధర అనేక రెట్లు పెరిగింది. ఇది చాలదన్నట్టు గ్రీన్ ఫీల్డ్ హైవే సైతం ఈ భూములకు మరో మణిహారంగా మలిచారు.



కాంగ్రెస్ ఎమ్మెల్యే కోసం పేద రైతులకు పాట్లు

ఇది కూడా నల్లగొండ-రంగారెడ్డి జిల్లాల సరిహద్దులో ఉన్న ఓ కాంగ్రెస్ ఎమ్మెల్యే వెంచర్. సాంకేతికంగా ఇది నల్లగొండ జిల్లా కుర్మేడు గ్రామ పరిధిలోకి వస్తుంది. కేసీఆర్ ప్రభుత్వ హయాంలో దాదాపు 200 ఎకరాల మేర ఉన్న ఈ వెంచర్‌లోని కొన్ని ప్లాట్ల మీదుగానే ట్రిపుల్ ఆర్ అలైన్‌మెంట్ ఖరారు చేశారు. ఆ సమయంలో సదరు నేత బీఆర్‌ఎస్‌లోనే ఉన్నారు.

అయినా సాంకేతికంగా అలైన్‌మెంట్ అక్కడి నుంచే ఖరారు చేశారు. కానీ అసెంబ్లీ ఎన్నికల ముందు సదరు నేత కాంగ్రెస్ తీర్థం పుచ్చుకున్నారు. ఎమ్మెల్యే అయ్యారు. రేవంత్‌రెడ్డి ప్రభుత్వం వచ్చిన తర్వాత రింగు రోడ్డు అలైన్‌మెంట్ మారింది. ఇక్కడి నుంచి అలైన్‌మెంట్‌ను మార్చి సుమారు కిలోమీటరు దూరం అన్నెబోయినపల్లి వైపు మార్చారు. ఇంకేముంది వెంచర్ సేఫ్. కానీ బక్క రైతుల భూములు మాత్రం ఢమాల్. అసలు అలైన్‌మెంట్ ఎందుకు మారిందనేది ఎవరికీ అంతుచిక్కక రైతులు లబోదిబోమంటున్నారు.



బక్క రైతులపై ఎందుకీ 'కసి'

రంగారెడ్డి జిల్లా అమనగల్లు మండల పరిధిలో కూడా అలైన్‌మెంట్ తాచుపాములా పేద రైతుల భూముల్లోకి పాకింది. కేసీఆర్ ప్రభుత్వ హయాంలో ఖానాపూర్ మీదుగా ట్రిపుల్ ఆర్ అలైన్‌మెంట్ ఖరారు చేశారు. ఆ సమయంలో గ్రామానికి చెందిన అప్పటి ఎమ్మెల్సీ భూములకు నష్టం కలుగుతున్నా సాంకేతికంగా అలైన్‌మెంట్ ఖరారు కావడంతో కేసీఆర్ ప్రభుత్వం నిష్పక్షపాతంగా వ్యవహరించింది.

కానీ రేవంత్‌రెడ్డి ప్రభుత్వం వచ్చిన తర్వాత ట్రిపుల్ ఆర్ అలైన్‌మెంట్ దాదాపు కిలోమీటరు దూరం అవతలకు జరిగింది. కారణం.. అప్పటి ఎమ్మెల్సీ ఇప్పుడు కాంగ్రెస్ ఎమ్మెల్యే. అంతేకాదు.. గ్రామానికి చెందిన పలువురు కాంగ్రెస్ నేతల భూములు కూడా గత అలైన్‌మెంట్ మేరకు రహదారిలో పోతున్నాయి. దీంతో అలైన్‌మెంట్‌ను మార్చినట్టు స్థానికంగా పెద్ద ఎత్తున ఆరోపణలు వినిపిస్తున్నాయి. మారిన అలైన్‌మెంట్‌తో పేద రైతులు తమ భూములను నష్టపోవడం ఒకవంతైతే.. గతంలో నష్టపోవాల్సిన సదరు ఎమ్మెల్యే, వారి బంధువులు, ఇతరులకు చెందిన వందల ఎకరాల భూములకు ఇప్పుడు రింగు రోడ్డు పక్కన భూముల పేరిట భారీ డిమాండ్ వచ్చింది.

..పేదల భూములు ఢమాల్!

మొదటిపేజీ తరువాయి...

పేదల భూముల్లోకి జరిగిన అలైన్‌మెంట్.. వికారాబాద్ జిల్లాకొచ్చే సరికి ఐదు కిలోమీటర్ల మేర జరగడం వెనక మతలబును బహిర్గతం చేసింది. దీంతో కమిటీలంటూ కాలయాపన చేసిన ప్రభుత్వ పెద్దలు చివరకు అదే అలైన్‌మెంట్‌లో కొన్ని మార్పులు చేస్తే క్యాబినెట్ ఆమోదం కూడా లభించింది. రెండో అలైన్‌మెంట్‌లోనూ వికారాబాద్ ప్రాంతంలో కొందరు కాంగ్రెస్ నేతల భూములపై ప్రభావం చూపుతుండటంతో ఐదు కిలోమీటర్లు జరిగిన అలైన్‌మెంట్‌ను మరో రెండు కిలోమీటర్లు అంటే ఏకంగా ఏడు కిలోమీటర్ల వరకు జరిపారు.

'నమస్తే' కథనాలతో కొంతకాలం కాలయాపన

కాంగ్రెస్ ప్రభుత్వం వచ్చిన తర్వాత ట్రిపుల్ ఆర్ దక్షిణ భాగం అలైన్‌మెంట్ అప్పటికే ఖరారై ఉన్నది. క్షేత్రస్థాయిలో అధికారులు మార్క్ కూడా చేశారు. కానీ గతేడాది ప్రభుత్వం గుట్టు చప్పుడు కాకుండా అలైన్‌మెంట్ మార్చింది. కేవలం 'ముఖ్య'నేత బంధువులు, ఇతర కాంగ్రెస్ ప్రజాప్రతినిధులు, నేతల భూములను కాపాడేందుకు ఈ మార్పు జరిగిందనేది బహిరంగ రహస్యం. ఈ మేరకు అప్పట్లోనే 'నమస్తే తెలంగాణ' ఈ మర్మాన్ని పలు కథనాలతో వెలుగులోకి తెచ్చింది. దీనిపై కిమ్మనని ప్రభుత్వం ఓ క్యాబినెట్ సమావేశంలో ట్రిపుల్ ఆర్ దక్షిణ భాగం అలైన్‌మెంట్ ఖరారుపై అధికారులతో కమిటీ ఏర్పాటు చేసినట్టు ప్రకటించింది. వాస్తవానికి మార్పు వెనక ఎలాంటి శాస్త్రీయ, సాంకేతిక కారణాలు లేవనేది అందరికీ తెలిసిందే. కాకపోతే అప్పట్లో రైతుల నుంచి వ్యతిరేకత వస్తుందనే భయంతో కాలయాపన చేసేందుకు ప్రభుత్వం కమిటీని తెరపైకి తెచ్చింది. క్షేత్రస్థాయిలో రాత్రివేళల్లో డ్రోన్ సర్వేలు చేయించి రైతుల్లో అయోమయం సృష్టించింది. కొన్ని చోట్ల ఏకంగా మూడు చోట్ల అలైన్‌మెంట్ మార్కులు చేసిన దాఖలాలు కూడా ఉన్నాయి. ఇలా కొంతకాలం అయోమయాన్ని కొనసాగించి చివరికి కొన్నిరోజుల కిందట ఓ క్యాబినెట్ భేటీలో అలైన్‌మెంట్ ఖరారు చేసినట్టు ప్రకటించింది. ఖరారైన అలైన్‌మెంట్ ప్రకారం ఔటర్ రింగు రోడ్డుకు ట్రిపుల్ ఆర్ ఒకచోట 40 కిలోమీటర్ల దూరం నుంచి వెళితే, మరికొన్నిచోట్ల 28 కిలోమీటర్లు ఇలా ఓ పద్ధతి లేకుండా తయారైంది.

'రింగు' మాటున 'బిగ్' పాగా

కేసీఆర్ హయాంలో రూపొందించిన ట్రిపుల్ ఆర్ అలైన్‌మెంట్‌ను మార్చే ప్రక్రియలో తెర వెనుక వేలాది ఎకరాల సమీకరణ జరిగినట్టుగా తెలుస్తున్నది. ముఖ్యంగా రంగారెడ్డి-వికారాబాద్ జిల్లాల పరిధిలో అలైన్‌మెంట్ మార్పు 'బిగ్ బ్రదర్స్' కనుసన్నల్లో జరిగిందనే ఆరోపణలున్నాయి. రంగారెడ్డి జిల్లా అమనగల్లు మొదలు వికారాబాద్ జిల్లా పూడూరు వరకు అలైన్‌మెంట్‌కు అనుగుణంగా తక్కువ ధరలకు భూములు కొనుగోలు చేయడంతో పాటు వేలాది ఎకరాల అసైన్డ్ భూములపై పెద్ద ఎత్తున అనధికారిక ఒప్పందాలు చేసుకున్నట్టు తెలిసింది. రంగారెడ్డి జిల్లా పరిధిలోని మాడ్గుల, వెల్దండ మండలాల పరిధిలోని అజలాపురం పరిధిలో ఉన్న కుందారం భూములను అనధికారిక ఒప్పందాలతో చెరబడుతున్న వైనాన్ని గతంలో 'నమస్తే తెలంగాణ' వెలుగులోకి తెచ్చింది. ఇదేరీతిన పేద ఎస్సీ, ఎస్టీలకు చెందిన అసైన్డ్ భూములను వేలాది ఎకరాల మేర అనధికారిక ఒప్పందాలతో తమ గుప్పిట్లో పెట్టుకున్నారనే ఆరోపణలున్నాయి. వికారాబాద్ జిల్లా పరిధిలో ట్రిపుల్ ఆర్ అలైన్‌మెంట్ మార్పు వెనక ఓ నియోజకవర్గ ఎమ్మెల్యే జిల్లా అభివృద్ధి కోసమే అలైన్‌మెంట్ మార్పు చేయించామని ప్రచారం చేసుకుంటున్నా అసలు విషయం మరొకటి ఉందనే చర్చ జరుగుతున్నది. కాంగ్రెస్ ప్రభుత్వం వచ్చిన వెంటనే భూములు కోల్పోతున్న కాంగ్రెస్ బడా లీడర్లు రీజినల్ రింగ్ రోడ్డు అలైన్‌మెంట్ మార్పు చేసేలా పావులు కదిపారనే ప్రచారం జరుగుతున్నది. ఒక్క పూడూరు మండలంలోనే 12 గ్రామాల మీదుగా రీజినల్ రింగ్‌రోడ్డు వెళ్లేలా కొత్త అలైన్‌మెంట్ ఖరారు చేశారు. ఇందులో అత్యధికంగా పేద రైతుల భూములే ఉండగా రియల్ ఎస్టేట్ వెంచర్లకు మాత్రం ఈ మార్పుతో భారీ డిమాండ్ వచ్చింది. పూడూరు మండలంలోని ఎన్కెపల్లి సమీపంలో 100 ఎకరాల్లో వెలసిన మైరాన్ హోం వెంచర్‌తోపాటు డెక్కన్ ట్రయల్స్ రిసార్ట్, ఊటీ గోల్ఫ్ కౌంటీకి చెందిన భూములకు నష్టం జరగకుండా అలైన్‌మెంట్ మార్పులు చేయడంపై అనుమానాలు వ్యక్తమవుతున్నాయి. పూడూరు గ్రామ పరిధిలోని జనప్రియ రియల్ ఎస్టేట్ వెంచర్, మంచన్‌పల్లి శివారులో వెలసిన గిరిధరి ప్రాజెక్ట్స్ రియల్ ఎస్టేట్ భూములు ఇంచు కూడా కోల్పోకుండా కొత్త అలైన్‌మెంట్ మార్చినట్టు ప్రచారం జరుగుతున్నది. అలైన్‌మెంట్ మార్పులో సదరు రియల్ ఎస్టేట్ వెంచర్ల నిర్వాహకుల నుంచి పెద్ద ఎత్తున కాంగ్రెస్ బడా నాయకులకు ముడుపులు ముట్టినట్టు విమర్శలు వెల్లువెత్తుతున్నాయి.

ముచ్చటగా మూడోసారి మార్పు

వికారాబాద్ జిల్లా వైపు ట్రిపుల్ ఆర్ అలైన్‌మెంట్ తీరు మరో వింతగా తయారైంది. కేసీఆర్ ప్రభుత్వ హయాంలో రంగారెడ్డి-వికారాబాద్ జిల్లాల సరిహద్దుల్లోని చేవెళ్ల మండల పరిధిలో నుంచి అలైన్‌మెంట్ ఖరారు చేశారు. దీని ద్వారా పలువురు నేతలు భూములు కోల్పోవాల్సి వచ్చింది. రేవంత్‌రెడ్డి ప్రభుత్వం వచ్చిన తర్వాత అలైన్‌మెంట్‌ను చేవెళ్ల మండల పరిధి నుంచి వికారాబాద్ వైపు ఏకంగా ఐదు కిలోమీటర్లు జరిపినట్టు తెలిసింది.

కొందరు నేతల భూములను కాపాడేందుకు ఈ అలైన్‌మెంట్ మార్పుగా మారిన అలైన్‌మెంట్ కూడా పలువురు కాంగ్రెస్ నేతల భూముల మీదుగా వెళ్లింది. బీఆర్‌ఎస్ నుంచి కాంగ్రెస్‌లో చేరిన సీనియర్ నేత ఒకరి భూములు ఉండగా ఆయనతో పాటు కాంగ్రెస్ 'పెద్ద' ఒకరి భూము లు, మాజీ ఎమ్మెల్యే భూములున్నాయి. మూ డోసారి అలైన్‌మెంట్‌ను వికారాబాద్ వైపు మరో రెండు కిలోమీటర్లు జరిపారు. దీంతో ఏకంగా ఏడు కిలోమీటర్లు పాకిన అలైన్‌మెంట్‌తో పలువురు అధికార పార్టీ నేతల భూములు సేఫ్‌గా మిగలడమే కాదు.. వారితో పాటు వికారాబాద్ జిల్లాకు చెందిన ఓ ఎమ్మెల్యే, ఓ కలెక్టర్ భూములకు కూడా డిమాండ్ పెరిగినట్టు తెలుస్తున్నది.

హామీపై ప్రశ్నిస్తే పోలీస్ 'ట్రీట్‌మెంట్'!

- ఆర్నెళ్లలో బస్సు ఏదని చొప్పదండి ఎమ్మెల్యేపై పోస్టు పెట్టినందుకు బండారి శ్రీనివాస్‌కు చిత్రహింసలు
- పోలీస్‌స్టేషన్‌లో నిర్బంధం
- అవమానభారంతో బాధితుడి ఆత్మహత్యాయత్నం
- కరీంనగర్ దవాఖానలో చికిత్స
- బాధితుడిపైనే అట్రాసిటీ కేసు
- ఎమ్మెల్యేపై మళ్లీ పోస్టు పెడితే రౌడీషీట్ తెరుస్తామని బెదిరించిన మల్యాల ఎస్‌ఐ



కరీంనగర్ ప్రభుత్వ జనరల్ హాస్పిటల్‌లో చికిత్స పొందుతున్న బండారి శ్రీనివాస్

కరీంనగర్, సెప్టెంబర్ 14 (నమస్తే తెలంగాణ): 'గెలిచిన ఆరు నెలల్లో మీ ఊరికి బస్సు వేయిస్తానన్న హామీ ఏమైంది' అంటూ సోషల్ మీడియాలో పోస్టు పెట్టిన ఓ సామాన్యుడిపై పోలీసులు దాష్టీకాన్ని ప్రదర్శించిన అమానుష ఘటన ఇది. 16 గంటలపాటు పోలీస్‌స్టేషన్‌లో ఉంచిన పోలీసులు చితకబాది నిర్బంధించారు. కరీంనగర్ జిల్లా గంగాధర మండలం హిమ్మత్‌నగర్‌కు చెందిన బండారి శ్రీనివాస్‌ను జగిత్యాల జిల్లా మల్యాల పోలీసులు దారుణంగా కొట్టగా, ఆ అవమానాన్ని భరించలేక ఎలుకల మందుతాగి ఆత్మహత్యాయత్నానికి పాల్పడి ప్రస్తుతం కరీంనగర్ ప్రభుత్వ దవాఖానలో చికిత్స పొందుతున్నాడు. బాధితుడు తెలిపిన వివరాలు ఇలా ఉన్నాయి. బండారి శ్రీనివాస్ ఈ నెల 12న చొప్పదండి ఎమ్మెల్యే మేడిపల్లి సత్యంను ప్రశ్నిస్తూ 'మా ఊరికి వేయిస్తానన్న బస్సు ఏది ఎమ్మెల్యే గారూ' అని సోషల్ మీడియాలో పోస్టు పెట్టారు. దీనిపై మల్యాల మండలం నాచుపల్లికి చెందిన కాంగ్రెస్ కార్యకర్త చెవులమద్ది శ్రీనివాస్.. బండారి శ్రీనివాస్‌కు ఫోన్ చేసి దుర్భాషలాడాడు. దీంతో ఫోన్‌లోనే ఇద్దరూ తిట్టుకున్నారు. తాను దళితున్నని, బండారి శ్రీనివాస్ తనను కులం పేరుతో దూషించాడని అదేరోజు మల్యాల పోలీస్ స్టేషన్‌లో బండారి శ్రీనివాస్‌పై చెవులమద్ది శ్రీనివాస్ ఫిర్యాదు చేశాడు. ఈ నెల 13న హిమ్మత్‌నగర్‌లో ఉన్న బండారి శ్రీనివాస్ ఇంటికి వచ్చిన మల్యాల పోలీసులు, స్టేషన్‌కు రమ్మని చెప్పడంతో వెళ్లాడు. అక్కడ ఎస్‌ఐ నరేశ్‌కుమార్ తనను తీవ్రంగా కొట్టడమే కాకుండా ఇష్టమున్నట్టు పిడిగుద్దులు గుద్దినట్టు బాధితుడు శ్రీనివాస్ తెలిపాడు. 12 గంటల పాటు సెల్‌లో నిర్బంధించినట్టు వాపోయాడు. తనపై ఫిర్యాదు చేసిన చెవులమద్ది శ్రీనివాస్ కూడా ఎస్‌ఐ ముందే తిట్టాడని బండారి శ్రీనివాస్ వాపోయాడు. రాత్రి 10.30 గంటల తర్వాత తన ఇంటికి ప్రైవేట్ వాహనంలో తీసుకొచ్చి వదిలి వెళ్లారని చెప్పారు.

ఎస్‌ఐ కొట్టాడని అవమానంతో..

ఎస్‌ఐ కొట్టిన దెబ్బలకు అవమాననంగా భావించి, కరీంనగర్ వన్‌టౌన్ ఏరియాలోని ఓ హోటల్ వద్ద ఎలుకల మందు తాగుతూ బాధితుడు బండారు శ్రీనివాస్ సెల్ఫీ వీడియో తీసుకున్నాడు. తన చావుకు మల్యాల ఎస్‌ఐ నరేశ్‌కుమార్, చొప్పదండి ఎమ్మెల్యే మేడిపల్లి సత్యం, శ్రీనివాస్ కారణమని రికార్డు చేశాడు. స్థానిక పోలీసులు ఆయనను కరీంనగర్ ప్రభుత్వ దవాఖానకు తరలించారు. ప్రస్తుతం ఆయన చికిత్స పొందుతున్నాడు. తనను మల్యాల ఎస్‌ఐ నరేశ్ కుమార్ కులం పేరు అడిగి మరీ తిట్టాడని, నీ కులంలో ఇలాంటి వారు పుట్టరురా? అని దుర్భాషలాడారని వాపోయాడు. మరోసారి ఇలాంటి పోస్టులు పెడితే రౌడీషీట్ ఓపెన్ చేస్తానని ఎస్‌ఐ బెదిరించారని శ్రీనివాస్ తెలిపాడు. ఎస్‌ఐపై చర్యలు తీసుకోవాలని బాధితుడు కోరారు. కాగా, తాను శ్రీనివాస్‌కు కేవలం కౌన్సెలింగ్ చేశానని, ఆయనను కొట్టలేదని మల్యాల ఎస్‌ఐ నరేశ్‌కుమార్‌ను వివరణ ఇచ్చారు. చెవులమద్ది శ్రీనివాస్‌ను కులం పేరుతో దూషించినట్టు ఫిర్యాదు రావడంతో బండారి శ్రీనివాస్‌పై ఎఫ్‌ఐఆర్ నమోదు చేసినట్టు ఎస్‌ఐ తెలిపారు.

యోగా ఆశ్రమ నిర్వాహకుడిపై హనీట్రాప్

- మహిళతో సన్నిహితంగా ఉన్న ఫొటోలు, వీడియోలు చూపించి బ్లాక్‌మెయిల్
- 50 లక్షలు ఇచ్చిన బాధితుడు
- మరింత డిమాండ్ చేసిన ముఠా
- ఐదుగురు నిందితుల అరెస్టు



పోలీసుల అదుపులో నిందితులు

చేవెళ్ల రూరల్, సెప్టెంబర్ 14 : యోగా ఆశ్రమ నిర్వాహకుడిని ఓ ముఠా హనీట్రాప్‌లో పడేసి భారీగా డబ్బు వసూలు చేసింది. బాధితుడు, గోల్కొండ పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. చేవెళ్ల వ్యవసాయ మార్కెట్ కమిటీ మాజీ చైర్మన్ మిట్ట వెంకట రంగారెడ్డి 'సీక్రెట్ ఆఫ్ నేచర్స్' పేరిట యోగా కేంద్రాన్ని నిర్వహిస్తున్నాడు. వెంకటరంగారెడ్డి వద్ద అధికంగా డబ్బు ఉన్నదని, ఎలాగైనా కొల్లగొట్టాలని ఇద్దరు మహిళలతో కలిసి అమర్ అనే వ్యక్తి ట్రాప్ చేసేందుకు ప్లాన్ వేశాడు. ఆగస్టు 6న ఉదయం హైదరాబాద్ నుంచి అమర్, మంజుల, రజిని యోగా కేంద్రానికి వచ్చారు. ఇద్దరు మహిళలకు ఆరోగ్యం బాగాలేదని వారిని అమర్ యోగా ఆశ్రమంలో చేర్పించాడు. తర్వాత వారు వెంకటరంగారెడ్డితో సన్నిహితంగా ఉన్నారు. రజిని వంట చేసి పెడుతూ దగ్గరైంది. రజినితో సన్నిహితంగా ఉన్నప్పుడు తెలియకుండా మత్తు పదార్థం కలిపిన జ్యూస్ ఇవ్వడంతో వెంకటరంగారెడ్డి మత్తులోకి వెళ్లేవాడు. దీంతో రజిని ఆయనతో దగ్గరగా ఉన్నట్టు ఫొటోలు, వీడియోలను స్పై కెమెరాతో తీసి వాటిని ముఠా సభ్యుడు అమర్‌కు పంపించేది. వాటిని వెంకటరంగారెడ్డికి చూపించి డబ్బులు ఇవ్వాలని అమర్ బ్లాక్‌మెయిల్ చేశాడు. డబ్బులు ఇవ్వకపోతే వాటిని సామాజిక మాధ్యమాల్లో పోస్ట్ చేసి పరువు తీస్తానని బెదిరించాడు. దీంతో బాధితుడు రూ.50 లక్షలు వారికి ఇచ్చి చేవెళ్లకు వచ్చాడు. మరిన్ని డబ్బులు కావాలంటూ అమర్ ఫోన్లు చేస్తూ వేధించడంతో వెంకటరంగారెడ్డి ఈ నెల 4న హైదరాబాద్ పోలీస్ కమిషనర్ ఆనంద్‌ను కలిసి జరిగింది చెప్పాడు. పోలీసులు ముఠా సభ్యులను పట్టుకునేందుకు పక్కాగా ప్లాన్ వేసి ఈ నెల 13న హైదరాబాద్‌లోని తారామతి బారామతి హోటల్‌కు రప్పించారు. అక్కడే మఫ్టీలో ఉన్న గోల్కొండ పోలీసులు ముఠా సభ్యులైన అమర్, మౌలాలి, రాజేశ్, మంజుల, రజినిని అరెస్ట్ చేసి రిమాండ్‌కు తరలించారు.



టీ న్యూస్ ఉమ్మడి ఖమ్మం జిల్లా ప్రతినిధిపై కేసు బనాయించడాన్ని నిరసిస్తూ భద్రాద్రి జిల్లా ఇల్లెందులో నల్లబ్యాడ్జీలతో నిరసన తెలుపుతున్న జర్నలిస్టులు

జర్నలిస్టులపై అక్రమ కేసులు ఎత్తివేయాలి

- ఇల్లెందులో అంబేద్కర్ విగ్రహం ఎదుట నల్లబ్యాడ్జీలతో జర్నలిస్టుల నిరసన
- నేడు భద్రాద్రి కలెక్టరేట్ ముట్టడి

పాల్వంచ/ ఇల్లెందు, సెప్టెంబర్ 14: టీ న్యూస్ ఉమ్మడి ఖమ్మం జిల్లా ప్రతినిధితోపాటు కెమెరామన్, లైవ్ టెక్నీషియన్‌పై పెట్టిన అక్రమ కేసులను ఎత్తివేయాలని టీయూడబ్ల్యూజే (టీజేఎఫ్) ఇల్లెందు డివిజన్ నాయకులు డిమాండ్ చేశారు. ఆదివారం నల్లబ్యాడ్జీలు ధరించి ఇల్లెందులోని అంబేద్కర్ విగ్రహానికి వినతిపత్రం అందించి నిరసన వ్యక్తంచేశారు. టీన్యూస్ ప్రతినిధి సాంబశివరావుపై కొణిజర్ల పోలీసులు తప్పుడు కేసు నమోదు చేశారని టీయూడబ్ల్యూజే (టీజేఎఫ్) జాతీయ కౌన్సిల్ సభ్యుడు గుర్రం రాజేశ్ మండిపడ్డారు. కేసులను నిరసిస్తూ సోమవారం నిర్వహించనున్న భద్రాద్రి కలెక్టరేట్ ముట్టడిని జర్నలిస్టులు జయప్రదం చేయాలని తెలంగాణ జర్నలిస్టుల ఫోరం జాతీయ కౌన్సిల్ సభ్యుడు చంద్ర నరసింహారావు పిలుపునిచ్చారు.

మత్తులో తూలుతున్న తెలంగాణ!

రాష్ట్రంలో యథేచ్ఛగా తయారవుతున్న గంజాయి, మెఫెడ్రోన్, ఆల్ప్రాజోలం

- పరిశ్రమల్లో వేల కోట్ల డ్రగ్స్ స్వాధీనం
- స్కూల్‌లోనే డ్రగ్స్ తయారీ కేంద్రం
- టన్నుల్లో సరఫరా అవుతున్న గంజాయి
- ఇటీవల కల్తీ కల్లుతో 10 మంది మృతి
- డ్రగ్స్ మత్తును వదల్చలేని ప్రభుత్వం
- మత్తు అరికట్టడంలో చేతులెత్తేసిన సీఎం!
- చేష్టలుడిగి చూస్తున్న ఈగల్, ఎక్సైజ్‌శాఖ
- పెద్దఎత్తున వెల్లువెత్తుతున్న విమర్శలు

'కేసీఆర్ పదేండ్ల పాలనలో అన్ని రంగాల్లో అగ్రగామిగా ఉన్న తెలంగాణ.. రేవంత్‌రెడ్డి 20 నెలల పాలనలో 'ఉడ్తా తెలంగాణ'గా రూపుదిద్దుకున్నది. చర్లపల్లిలో రూ.12,000 కోట్ల డ్రగ్స్ పట్టుబడడమే ఇందుకు నిదర్శనం. దేశంలో అతి పెద్ద డ్రగ్స్ రాకెట్ గుజరాత్ తర్వాత తెలంగాణలో వెలుగుచూడడం దురదృష్టకరం'

'మహారాష్ట్ర పోలీసులు నెలల తరబడి పరిశోధించి డ్రగ్స్ రాకెట్ గుట్టును రట్టు చేస్తే.. రేవంత్‌రెడ్డికి మాత్రం సోయిలేకపోవడం సిగ్గుచేటు. ఓ ముఖ్యమంత్రీ డ్రగ్స్ వ్యవహారంలో నీకేమైనా ముడుపులు ముట్టాయా? అందుకే మౌనంగా ఉన్నావా? రూ.12వేల కోట్ల డ్రగ్స్ పట్టుబడితే మీ పోలీసులకు కనీస సమాచారం రాలేదెందుకు? నీ ఈగల్ ఏం చేస్తున్నది? నీ హోంమంత్రిత్వ శాఖ ఏంచేస్తున్నది? పోలీసుశాఖ ఇంటెలిజెన్స్ ఏంచేస్తున్నది?'

\- కేటీఆర్, మాజీ మంత్రి (సెప్టెంబర్ 8న మీడియాతో)

హైదరాబాద్, సెప్టెంబర్ 14 (నమస్తే తెలంగాణ): రాష్ట్రంలోని నగరాల నుంచి.. పచ్చని పల్లెల వరకు డ్రగ్స్ చిచ్చు పెడుతున్నాయి. తెలంగాణలో డ్రగ్స్ తయారీ, సరఫరా దందా జోరుగా నడుస్తున్నది. రూ.500కే డ్రగ్స్ ప్యాకెట్లు లభ్యమవుతుండటంతో 'ఉడ్తా తెలంగాణ'గా పిలువాల్సిన రోజులు వచ్చేస్తున్నాయి. స్కూల్‌కు వెళ్లే విద్యార్థులకు గంజాయి చాక్లెట్లు, కాలేజీ విద్యార్థులు గంజాయి ప్యాకెట్లు, సాఫ్ట్‌వేర్ ఉద్యోగులకు మెఫెడ్రోన్, కొకైన్, హెరాయిన్ వంటి మాదకద్రవ్యాలు యథేచ్ఛగా దొరుకుతున్నాయి. ఇలా అన్ని వయసుల వారిని, అన్ని వర్గాల వారిని ఈ మత్తు మహమ్మారి చిత్తు చేస్తున్నా.. ప్రభుత్వంలో కొంచెం కూడా చలనం లేకపోవడం దౌర్భాగ్యమని రాజకీయ విశ్లేషకులు చెప్తున్నారు. మన హైదరాబాద్ మహానగరానికి కూతవేటు దూరంలో రూ.12వేల కోట్ల విలువైన డ్రగ్స్, వాటి ముడిపదార్థాలు పట్టుబడ్డాయంటే ఈ మహమ్మారి తెలంగాణ రాష్ట్రాన్ని ఎంతలా కమ్మేసిందో అర్థం చేసుకోవచ్చు.



ఏకంగా స్కూల్‌లోనే తయారీ

ఇటీవల చర్లపల్లిలోని పారిశ్రామికవాడలో భారీ డ్రగ్ రాకెట్‌ను మహారాష్ట్ర పోలీసులు సీక్రెట్ ఆపరేషన్ ద్వారా ఛేదించారు. ఆ ఘటన మరువక ముందే.. హైదరాబాద్ నగరంలోని కంటోన్మెంట్ ఏరియాలో ఏకంగా ఓ పాఠశాలలోనే అల్ప్రాజోలం తయారు చేస్తున్న ముఠా ఉదంతం బయటపడింది. రూ.40 లక్షల విలువ జేసే నాలుగు కేజీల అల్ప్రాజోలం, ముడిపదార్థాలు, యంత్రాలను పోలీసులు స్వాధీనం చేసుకున్నారు. అప్పటికిగాని నెమ్మదిగా మేల్కొన్న ప్రభుత్వం ఈ ఘటనలపై సీరియస్‌గా ఉన్నట్టు లీకులు ఇస్తున్నది. దీంతో ఆ పాఠశాలను మూసివేయించింది. అదే స్కూల్‌లో మత్తు మాత్రలు, ఇతర హానికారక రసాయనాలు ఉండటం విస్తుగొలిపే అంశం. ఇక ఆ ఏడాది ఇప్పటి వరకు ఒక్క ఎక్సైజ్‌శాఖ దాడుల్లోనే సుమారు 325 కేజీలకుపైగా ఆల్ప్రాజోలం పట్టుబడిందంటే.. మత్తు మహమ్మారి ఎంతలా విస్తరించిందో అర్థం చేసుకోవచ్చు. ఇటీవల కల్తీ కల్లుతో హైదరాబాద్ కూకట్‌పల్లిలో 10 మంది మృతి చెందారు. ఆ ఘటనపై ప్రభుత్వం తూతూ మంత్రంగా చర్యలు తీసుకున్నా.. ఆల్ప్రాజోలం మత్తు జాడలు ఇంకా తెలంగాణలో కనిపిస్తూనే ఉన్నాయి.

క్వింటాళ్ల కొద్దీ గంజాయి దందా

తెలంగాణను మత్తు మహమ్మారి పట్టి పీడిస్తుందనడానికి పోలీసులకు, ఎక్సైజ్ అధికారులకు క్వింటాళ్ల కొద్ది పట్టుబడుతున్న గంజాయే నిదర్శనం. ఏ రైడ్‌లోనైనా కనీసం పది కేజీలకు పైగానే గంజాయి దొరుకుతున్నది. ఇక పోలీసులు నిఘా పెట్టి పట్టుకునే కేసులలోనూ పెద్ద ఎత్తునే గంజాయి దొరుకుతున్నది. 2024, 2025లో రాష్ట్ర వ్యాప్తంగా స్వాధీనం చేసుకున్న కొన్ని టన్నుల కొద్దీ గంజాయిని అధికారికంగా పోలీసులు, ఎక్సైజ్ అధికారులు దహనం చేశారు. ఈ ఏడాది జూలై వరకు 3,681 కేజీల గంజాయిని ఒక్క ఎక్సైజ్‌శాఖ అధికారులే పట్టుకున్నారు. తెలంగాణను ఒక వైపు గంజాయి, అల్ప్రాజోలం వంటి మత్తు పదార్థాలు పట్టిపీడిస్తుంటే.. మరోవైపు కొకైన్, ఎండీఎంఏ, ఎండీ, హెరాయిన్ వంటి సింథటిక్ డ్రగ్స్ జోరుగా చలామణిలో ఉన్నాయి. ఈ డ్రగ్స్ డార్క్‌వెబ్ ద్వారా తెలంగాణలోకి వస్తున్నా... ప్రభుత్వం, పోలీసు, నిఘావర్గాలు అరికట్టలేకపోతున్నాయని విమర్శలు వ్యక్తమవుతున్నాయి.

మత్తులోకం.. పబ్స్ అరాచకం

హైదరాబాద్ నగరంలోని పలు పబ్స్ మత్తు లోకానికి కేరాఫ్‌గా మారాయి. పబ్‌లలో డీజేలు పెట్టే చాలామంది నిర్వాహకులే డ్రగ్స్ పెడ్లర్స్‌గా మారిపోతున్నారు. అహ్మదాబాద్, గోవా, ముంబై, బెంగళూరు, చెన్నై, విశాఖ వంటి పట్టణాల్లో డ్రగ్స్ తీసుకొచ్చి, నేరుగా తెలంగాణలో విక్రయిస్తున్నారంటే ఇక్కడి ప్రభుత్వం, పోలీసులు, ఈగల్ టీమ్స్ అంటే వారికి ఎంత భయం ఉందో అర్థమవుతుంది. వీటికితోడు ఎక్కడెక్కడి నుంచో వచ్చే మందుబాబులు హైదరాబాద్ చుట్టుపక్కల ఫామ్‌హౌస్‌లలో డ్రగ్ పార్టీలు చేసుకోవడం కలవరం పుట్టించే అంశం. అల్ప్రాజోలం, డ్రగ్స్ నెట్‌వర్క్‌ల వెనుక కొందరు పెద్దల హస్తం ఉందని ఆరోపణలు వినిపిస్తున్నాయి.

కొన్ని డ్రగ్స్ కేసుల వివరాలు

- గత ఆగస్టు 9న మెడిసిటీ మెడికల్ కాలేజీలో 9 మంది మెడికోలకు డ్రగ్స్ పాజిటివ్ నిర్ధారణ.
- తెలంగాణలో డ్రగ్స్ వాడుతున్న వారిలో 15మంది డాక్టర్లు ఉన్నారని వెల్లడించిన అధికారులు.
- మల్నాడు రెస్టారెంట్‌లో డ్రగ్ నెట్‌వర్క్‌లో సుమారు 100 మందికిపైగా వినియోగదారులను అదుపులోకి తీసుకున్న పోలీసులు.
- ఈ ఏడాది జూలైలో ఈగల్ టీమ్ డెకాయ్ ఆపరేషన్ చేపట్టి.. 2 గంటల్లో 86 మంది గంజాయి వినియోగదారుల అరెస్ట్.
- ఆగస్టు 22న అంతర్రాష్ట్ర డ్రగ్స్ స్మగ్లర్ల నుంచి రూ.22.75 లక్షల విలువైన 91 కేజీల గంజాయి స్వాధీనం.
- ఆగస్టులో హైదరాబాద్‌లోని మహీంద్రా యూనివర్సిటీలో డ్రగ్స్ తీసుకున్న 51 మంది విద్యార్థుల అరెస్ట్
- మార్చిలో రూ.11 కోట్ల విలువైన 2,225 కేజీల గంజాయిని ఎక్సైజ్ అధికారులు ఉమ్మడి ఖమ్మం జిల్లాలో స్వాధీనం.
- జూలై 28న రూ.5 కోట్ల విలువైన 935 కేజీల గంజాయిని బాటసింగారం ఫ్రూట్ మార్కెట్ సమీపంలో పట్టివేత.
- ఆగస్టు 5న రూ.4 కోట్ల విలువైన 847 కేజీల గంజాయి స్వాధీనం.
- జనవరి 24న .14.60 కోట్ల రూపాయలవిలువైన 3,558 కేజీల గంజాయి కాల్చివేత.
- ఎక్సైజ్ పోలీస్ స్టేషన్లలో 10,596 కేజీల గంజాయి నిల్వలు ఉంటాయని అంచనా.
- 2024లో నమోదైన దాదాపు 500 కేసులలో పట్టుబడిన 981 మందిలో 65-70శాతం ఇంజినీరింగ్ విద్యార్థులు.
- 2024లో ఇబ్రహీంపట్నం గురునానక్ ఇంజినీరింగ్ కాలేజీలో పదుల సంఖ్యలో గంజాయి తాగుతూ పట్టుబడిన విద్యార్థులు.
- 2024 జనవరిలో యూపీ నుంచి వచ్చిన 560 కేజీల గంజాయి చాక్లెట్లును స్వాధీనం.

స్కూల్‌లో డ్రగ్స్ తయారీ.. బైక్‌పై సరఫరా

- శ్రీమేధా డ్రగ్స్ కేసులో సంచలన నిజాలు
- నిందితుడి స్కూల్‌ను క్లోజ్ చేసిన విద్యాశాఖ

హైదరాబాద్/ హైదరాబాద్ సిటీ బ్యూరో సెప్టెంబర్ 14 (నమస్తే తెలంగాణ): హైదరాబాద్‌లోని బోయినపల్లి శ్రీమేధా స్కూల్‌లో డ్రగ్స్ తయారీ కేసు దర్యాప్తులో సంచలన నిజాలు బయటపడుతున్నాయి. స్కూల్ యజమాని మలేలా జయప్రకాశ్‌గౌడ్ పది నెలలుగా అల్ప్రాజోలమ్ డ్రగ్ తయారుచేస్తున్నట్టు పోలీసులు గుర్తించారు. జయప్రకాశ్ తన బైక్ మీదనే డ్రగ్ సరఫరా చేసేవాడని దర్యాప్తు అధికారులు తెలిపారు. కేసులో జయప్రకాశ్‌గౌడ్‌తో పాటు శేఖర్, మరో నిందితుడు గురవారెడ్డి పాత్రపైనా ఈగల్‌టీమ్ అధికారులు లోతుగా ఆరా తీస్తున్నారు. గురవారెడ్డి అందించిన ఫార్ములాతోనే జయప్రకాశ్‌గౌడ్ స్కూల్‌లో డ్రగ్ యూనిట్ ఏర్పాటు చేసినట్టు చెప్పారు. డ్రగ్స్ కేసులో నిందితుడు జయప్రకాశ్‌గౌడ్ నడుపుతున్న పాఠశాలలోని రెండు గదుల్లో అల్ప్రాజోలం తయారు చేసేవాడని, పాఠశాల నడిచే సమయంలో ఆ రెండు గదులకు తాళం వేసి ఉంచేవాడని పోలీసులు గుర్తించారు. డ్రగ్ తయారీ విషయం పాఠశాల సిబ్బందికి తెలియకుండా స్కూల్‌తో సంబంధం లేని మురళీ సాయి, ఉదయ్‌సాయి సహకారం తీసుకున్నట్టు వెల్లడించారు. హైదరాబాద్ నుంచి మహబూబ్‌నగర్, సంగారెడ్డికి కూడా జయప్రకాశ్ టూవీలర్‌పై డ్రగ్స్ విక్రయించినట్టు ఈగల్ టీమ్ అధికారులు దర్యాప్తులో గుర్తించారు. మహబూబ్‌నగర్‌లోని కల్లు కాంపౌండ్ యజమానికి పెద్ద మొత్తంలో మత్తు మందు అమ్మినట్టు తెలిపారు. జయప్రకాశ్ అరెస్ట్ తర్వాత స్కూల్‌లో చేసిన సోదాల్లో ఈగల్ టీమ్ రూ.20 లక్షలు స్వాధీనం చేసుకున్నది. ఆ మొత్తాన్ని జయప్రకాశ్ ఫ్యాక్టరీలో పాత పేపర్ల మధ్య దాచినట్టు అధికారులు వెల్లడించారు. డ్రగ్స్ కేసు నేపథ్యంలో మేధా స్కూల్‌పై విద్యాశాఖ చర్యలు చేపట్టింది. స్కూల్ లైసెన్స్ రద్దు చేసి, సీజ్ చేసింది. మేధా స్కూల్‌లో చదువుతున్న 130 మంది విద్యార్థులను ఇతర స్కూళ్లలో చేర్పించేలా చర్యలు తీసుకుంటున్నట్టు మేడ్చల్ మల్కాజిగిరి డీఈవో విజయకుమారి తెలిపారు.

200 రోజులైనా ఆరుగురి మృతదేహాల జాడేదీ?

- 'ఎస్ఎల్‌బీసీ'పై కేంద్రం ఎందుకు స్పందించడం లేదు?
- ఇదే బీజేపీ, కాంగ్రెస్ మైత్రి బంధానికి నిదర్శనం
- బాధితులకు పరిహారమివ్వడంలోనూ సర్కార్ ఘోర విఫలం
- బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ ధ్వజం



హైదరాబాద్, సెప్టెంబర్ 14(నమస్తే తెలంగాణ): 'ఎస్ఎల్‌బీసీ సొరంగ ప్రమాద ఘటన జరిగి 200 రోజులు దాటినా ఆరుగురి మృతదేహాల జాడేది? కాళేశ్వరం ప్రాజెక్టులో తలెత్తిన చిన్న సమస్యకే ఎన్డీఎస్ఏను పంపించి రాద్ధాంతం చేసిన కేంద్రం ఈ ఘటనపై ఎందుకు స్పందించడం లేదు?' అంటూ బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కే తారక రామారావు ప్రశ్నించారు. అసమర్థ కాంగ్రెస్ సర్కారు మృతదేహాలను వెలికితీయడంలోనే కాదు, బాధిత కుటుంబాలకు పరిహారం ఇవ్వడంలోనూ విఫలమైందని దుయ్యబట్టారు. ఎస్ఎల్‌బీసీ ఘటన జరిగి ఆదివారానికి 200 రోజులు పూర్తయిన నేపథ్యంలో కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల వైఖరిని ఎక్స్ వేదికగా కేటీఆర్ తప్పుబట్టారు. ఈ పాపపు వ్యవహారంలో రెండు పార్టీలు కూడా భాగస్వాములేనని విమర్శించారు. ఎస్ఎల్‌బీసీ ప్రమాదంపై కేంద్రం అనుసరిస్తున్న వైఖరి.. బీజేపీ, కాంగ్రెస్ అపవిత్ర బంధానికి నిలువెత్తు నిదర్శనమని దుయ్యబట్టారు. కేంద్రంలోని బీజేపీ బడే భాయ్.. రాష్ట్రంలోని కాంగ్రెస్ చోటే భాయ్‌ను కాపాడుతున్నారని ఎద్దేవా చేశారు.

అధికారంలోకి రాగానే బాధితులకు న్యాయం చేస్తాం

కాంగ్రెస్ సర్కారు చేతగానితనంతో చితికిపోయిన, ఎస్ఎల్‌బీసీ ప్రమాదంలో మరణించిన వారి కుటుంబాలకు బీఆర్ఎస్ అండగా ఉంటుందని కేటీఆర్ పేర్కొన్నారు. అధికారంలోకి రాగానే ఆరుగురు బాధిత కుటుంబాలకు న్యాయం చేస్తామని హామీ ఇచ్చారు. కాంగ్రెస్ పాలనలో విధ్వంసానికి గురైన అన్ని రంగాలను గాడిన పెడతామని తెలిపారు. ఎల్ఎస్‌బీసీ టన్నెల్ కుప్పకూలడానికి గల కారణాలను రాబడతామని స్పష్టంచేశారు. ఆరుగురు కార్మికుల ప్రాణాలను బలిగొన్న బాధ్యులకు శిక్ష పడేలా చేస్తామని, ఇది బాధితులకు బీఆర్ఎస్ పార్టీ ఇస్తున్న హామీ అని పేర్కొన్నారు.

కేసీఆర్ ఈవీ పాలసీ భేష్

- అమరరాజా బ్యాటరీ యూనిట్ పురోగతే సాక్ష్యం : కేటీఆర్

హైదరాబాద్, సెప్టెంబర్14 (నమస్తే తెలంగాణ): కేసీఆర్ తెచ్చిన ఈవీ, ఈఎస్ఎస్ విధానం భేష్ అని మాజీ మంత్రి, బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ ఆదివారం ఎక్స్ వేదికగా కొనియాడారు. ఆ ఈవీ పాలసీ ఫలితంగానే మహబూబ్‌నగర్‌లో అమరరాజా గిగా బ్యాటరీ ప్యాక్ యూనిట్ అందుబాటులోకి వచ్చిందని గుర్తుచేశారు. గద్వాలలో శనివారం నిర్వహించిన సమావేశంలో పాల్గొనేందుకు వెళ్తున్న సమయంలో ఆయన మహబూబ్‌నగర్‌లో అమరరాజా గిగా బ్యాటరీ ప్యాక్ యూనిట్‌ను చూసి యూనిట్ పురోగతిపై హర్షం వ్యక్తంచేశారు. యూనిట్ ఫొటోలను ఎక్స్ వేదికగా షేర్ చేశారు. కేసీఆర్ ప్రభుత్వం గతంలో తెచ్చిన ఈవీ, ఈఎస్ఎస్ పాలసీ ఫలితమిదని వివరించారు. అమరరాజా సీఎండీ జయ గల్లాకు ధన్యవాదాలు తెలియజేశారు.

ప్రమాదంలో సింగరేణి మనుగడ

- సంస్థపై కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల వివక్ష
- బ్లాకులు ఇవ్వకపోవడమే నిదర్శనం
- కార్మికుల సంక్షేమానికి కేసీఆర్ కృషి
- మాజీ మంత్రి కొప్పుల ఈశ్వర్
- సింగరేణిని కాపాడిందే కేసీఆర్ : పుట్ట మధు, రాజిరెడ్డి



తెలంగాణభవన్‌లో మాట్లాడుతున్న మాజీ మంత్రి కొప్పుల ఈశ్వర్, మాజీ ఎమ్మెల్యే పుట్ట మధు, టీజీబీకేఎస్ నేత మిర్యాల రాజిరెడ్డి

హైదరాబాద్, సెప్టెంబర్ 14 (నమస్తే తెలంగాణ): 'సింగరేణి సంస్థ మనుగడ ప్రమాదంలో పడింది. ఈ సంస్థపై రాష్ట్రంలోని కాంగ్రెస్ ప్రభుత్వం, కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వం వివక్ష చూపుతున్నాయి. సింగరేణికి అసలు బ్లాకులు ఎందుకు ఇవ్వడం లేదు. అదే ప్రధాన వివక్ష' అని మాజీ మంత్రి, తెలంగాణ బొగ్గు గని కార్మిక సంఘం గౌరవాధ్యక్షుడు కొప్పుల ఈశ్వర్ ఆగ్రహం వ్యక్తంచేశారు. హైదరాబాద్ తెలంగాణ భవన్‌లో ఆదివారం ఆయన మాజీ ఎమ్మెల్యే పుట్ట మధు, టీజీబీకేఎస్ (బొగ్గు గని కార్మిక సంఘం) నేత మిర్యాల రాజిరెడ్డితో కలిసి మీడియాతో మాట్లాడారు. తెలంగాణపై బీజేపీ, కాంగ్రెస్ నాయకులు కక్షగట్టారని మండిపడ్డారు. ప్రధాని మోదీ, తెలంగాణ సీఎం రేవంత్‌రెడ్డి చెట్టాపట్టాలేసుకుని తిరుగుతున్నారని ఆరోపించారు. సీఎం రేవంత్‌రెడ్డికి తెలంగాణపైనే కాదు.. సింగరేణి సంస్థపైనా ప్రేమే లేకుండా పోయిందని దుయ్యబట్టారు. సింగరేణి కార్మికవర్గాన్ని తప్పుదోవ పట్టించేలా రాష్ట్ర డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క మాట్లాడారని, ఆయన వ్యాఖ్యలను ఖండిస్తున్నట్టు చెప్పారు. తెలంగాణలో ఏకైక ప్రభుత్వరంగ సంస్థగా సింగరేణి కొనసాగుతున్నదని, అలాంటి సంస్థ మనుగడను ప్రభుత్వం కాపాడాలని ఆయన డిమాండ్ చేశారు. సింగరేణి సంస్థ రక్షణ కోసం, కార్మికుల సంక్షేమం కోసం నాటి తెలంగాణ తొలి ముఖ్యమంత్రిగా కేసీఆర్ విశేష కృషి చేశారని కొనియాడారు. తెలంగాణలో ఉన్న బొగ్గు బ్లాకులన్నీ సింగరేణికే దక్కాలని కేసీఆర్ చొరవ చూపారని చెప్పారు. గతంలో కాంగ్రెస్ హయాంలోనే సింగరేణి ప్రైవేటీకరణకు శ్రీకారం చుట్టారని, దేశవ్యాప్తంగా 1,400 బొగ్గు బ్లాకుల ప్రైవేటీకరణకు నిర్ణయం తీసుకున్నారని విమర్శించారు. అనంతరం బీజేపీ అధికారంలోకి వచ్చాక నాలుగు బ్లాక్‌లను ప్రైవేటీకరణ చేసిందని, ఆ బ్లాకులను కాపాడటం కోసం కేసీఆర్‌తోపాటు తెలంగాణ బొగ్గుగని కార్మిక సంఘం తీవ్రంగా ప్రయత్నించిందని, లాభాల వాటాను 16 నుంచి 32 శాతానికి పెంచినట్టు గుర్తుచేశారు.

బయ్యారం ఉక్కు ఫ్యాక్టరీ ఏమైంది?

తెలంగాణలో బయ్యారం ఉక్కు ఫ్యాక్టరీ తెస్తామని కాంగ్రెస్ హామీ ఇచ్చిందని, ఇప్పుడు దానిని నిలుపుకోవడం లేదని కొప్పుల ఈశ్వర్ విమర్శించారు. ఈ ప్రభుత్వం వచ్చాక సింగరేణిపై మంత్రుల ఆధిపత్యం బాగా పెరిగిందని ధ్వజమెత్తారు. సింగరేణిలో లాభాల నుంచి ఈసారి 35శాతం వాటా ఇప్పిస్తామని ఏఐటీయూసీ చెప్పిందని గుర్తుచేశారు.

సింగరేణికి రక్షించింది కేసీఆరే : పుట్ట మధు, రాజిరెడ్డి

నాడు ముఖ్యమంత్రిగా సింగరేణి సంస్థలను కాపాడిందే కేసీఆరే అని మాజీ ఎమ్మెల్యే పుట్ట మధు, తెలంగాణ బొగ్గు గని కార్మిక సంఘం నేత మిర్యాల రాజిరెడ్డి తెలిపారు. కార్మికులకు ఎక్స్‌గ్రేషియో ఇప్పించింది కేసీఆర్ ప్రభుత్వమేనని గుర్తుచేశారు. ఈ సంస్థలో 40,000 కార్మికులు ఉండటానికి కూడా ఆయనే కారణమని తెలిపారు. కార్మిక చట్టాల ప్రకారమే కొప్పుల ఈశ్వర్‌ను గౌరవ అధ్యక్షుడిగా ఎన్నుకున్నట్టు చెప్పారు. సింగరేణి కార్మికులకు లాభాల్లో వాటా ప్రకటించకపోతే భవిష్యత్తు కార్యాచరణ ప్రకటిస్తామని ఆయన ప్రభుత్వాన్ని హెచ్చరించారు.

కేటీఆర్‌పై చామల వ్యాఖ్యలు గర్హనీయం

- బీఆర్ఎస్వీ రాష్ట్ర ఉపాధ్యక్షుడు తుంగ బాలు



హైదరాబాద్, సెప్టెంబర్ 14(నమస్తే తెలంగాణ): బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్‌పై భువనగిరి ఎంపీ చామల కిరణ్‌కుమార్‌రెడ్డి చేసిన వ్యాఖ్యలు గర్హనీయమని బీఆర్ఎస్వీ రాష్ట్ర ఉపాధ్యక్షుడు తుంగ బాలు పేర్కొన్నారు. 'కేటీఆర్‌ను నిరుద్యోగులు ఎందుకు నిలదీయాలి.. విద్యార్థులు, నిరుద్యోగుల పక్షాన మాట్లాడినందుకా? గ్రూప్-1పై జ్యుడీషియల్ కమిషన్ వేయమన్నందుకా? ఏటా రెండు లక్షల ఉద్యోగాలు భర్తీ చేయమన్నందుకా? జాబ్ క్యాలెండర్ రిలీజ్ చేయమన్నందుకా?' అని ఆదివారం ఒక ప్రకటనలో ప్రశ్నల వర్షం కురిపించారు. అయినా యూత్ డిక్లరేషన్ పేరిట అనేక హామీలు ఇచ్చి నట్టేట ముంచిన కాంగ్రెస్ అగ్రనేత రాహుల్‌గాంధీ, సీఎం రేవంత్‌ను నిలదీసేందుకు నిరుద్యోగులు సిద్ధంగా ఉన్నారని హెచ్చరించారు.

కామారెడ్డి డిక్లరేషన్ అమలు చేయాలి

- రిటైర్డ్ ఐఏఎస్ అధికారి చిరంజీవులు



కరీంనగర్ తెలంగాణచౌక్, సెప్టెంబర్ 14: కామారెడ్డి డిక్లరేషన్‌లో బీసీలకు ఇచ్చిన హామీలను అమలు చేసిన తర్వాతనే స్థానిక సంస్థల ఎన్నికలు నిర్వహించాలని రిటైర్డ్ ఐఏఎస్ అధికారి చిరంజీవులు డిమాండ్ చేశారు. కరీంనగర్‌లోని పద్మశాలీ సంక్షేమ భవనంలో ఆదివారం నిర్వహించిన బీసీ రాజ్యాధికార సభకు ఆయన హాజరై మాట్లాడారు. బీసీలు విద్య, ఉద్యోగ, రాజకీయ రంగాల్లో అన్యాయానికి గురవుతున్నారని ఆవేదన వ్యక్తంచేశారు. బీసీలను చైతన్యం చేసేందుకు అన్ని జిల్లాల్లో బీసీ సభలను నిర్వహిస్తున్నట్టు పేర్కొన్నారు. బీసీల ఐక్య డిమాండ్‌తోనే రాష్ట్ర ప్రభుత్వం కులగణన చేపట్టిందని గుర్తుచేశారు. రాజ్యాంగంలోని తొమ్మిదో షెడ్యూల్‌లో చేర్చడంతోనే బీసీలకు 42శాతం రిజర్వేషన్ సాధ్యపడుతుందని స్పష్టంచేశారు.

బీఆర్ఎస్ రాష్ట్ర కార్యదర్శి శ్రీహరి కన్నుమూత

మొదటిపేజీ తరువాయి...

తెల్లవారుజామున అతడి స్వగ్రామమైన సిద్దిపేట జిల్లా కోహెడ మండలం శనిగరం గ్రామానికి తీసుకువచ్చారు. ఆయన మృతిపట్ల బీఆర్ఎస్ అధినేత కేసీఆర్ దిగ్భ్రాంతి వ్యక్తంచేశారు. మంత్రులు పొన్నం ప్రభాకర్, అడ్లూరి లక్ష్మణ్ తదితరులు శ్రీహరి మృతదేహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. అనంతరం కుటుంబ సభ్యులకు సానుభూతి తెలిపారు. మాజీ మంత్రులు హరీశ్‌రావు, గంగుల కమలాకర్, మాజీ ఎంపీ బోయినపల్లి వినోద్‌కుమార్, మాజీ ఎమ్మెల్యేలు వొడితెల సతీశ్‌కుమార్, పుట్ట మధు, ఎమ్మెల్సీ దేశపతి శ్రీనివాస్, మాజీ ఎమ్మెల్సీ నారదాసు లక్ష్మణ్‌రావు తదితరులు కూడా శ్రీహరి మృతదేహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. కుటుంబ సభ్యులకు ప్రగాఢ సానుభూతి తెలిపారు. శ్రీహరి అంత్యక్రియల సందర్భంగా హరీశ్‌రావు, గంగుల కమలాకర్, బోయినపల్లి వినోద్‌కుమార్, వొడితెల సతీశ్‌కుమార్, దేశపతి శ్రీనివాస్ తదితరులు ఆయన పాడె మోశారు.



కర్ర శ్రీహరి పాడె మోస్తున్న మాజీ మంత్రులు హరీశ్‌రావు, గంగుల కమలాకర్

శ్రీహరి మరణం బాధాకరం: కేసీఆర్

కర్ర శ్రీహరి మరణం బాధాకరమని బీఆర్ఎస్ అధినేత కేసీఆర్ పేర్కొన్నారు. శ్రీహరి మృతికి సంతాపం తెలుపుతూ ఆదివారం ఒక ప్రకటన విడుదల చేశారు. ఈ సందర్భంగా ఆయనతో ఉన్న అనుబంధాన్ని గుర్తుచేసుకున్నారు. ఆయన ఆత్మకు శాంతిచేకూరాలని భగవంతుడిని ప్రార్థించారు. రాజకీయాల్లో గ్రామ స్థాయి నుంచి అంచెలంచెలుగా ఎదిగారని కొనియాడారు. ఆయన కుటుంబసభ్యులకు ప్రగాఢ సానుభూతి తెలిపారు.

ప్రజల గుండెల్లో శ్రీహరికి సుస్థిర స్థానం: కేటీఆర్

నాలుగు దశాబ్దాలపాటు సర్పంచ్‌గా, ప్యాక్స్ చైర్మన్‌గా, ఎంపీటీసీగా, ఎంపీపీగా, జడ్పీటీసీగా ప్రజల గుండెల్లో సుస్థిర స్థానం సంపాదించుకున్న కర్ర శ్రీహరి మరణం విచారకరమని బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ పేర్కొన్నారు. నిజాయితీ, అంకితభావం, నిస్వార్థ సేవకు ఆయన మారుపేరని ఆదివారం ఒక ప్రకటనలో కొనియాడారు. ఆయన మృతి హుస్నాబాద్ నియోజకవర్గానికి తీరనిలోటని పేర్కొన్నారు. కుటుంబసభ్యులకు ప్రగాఢ సానుభూతి తెలిపారు. హరీశ్‌రావు, వినోద్‌కుమార్ మాట్లాడుతూ.. ప్రజల పక్షాన నిలిచిపోరాటం చేసిన నాయకుడు శ్రీహరి అని కొనియాడారు. ఆయన మరణం పార్టీకి తీరని లోటని అన్నారు. శ్రీహరి మృతికి ఎంపీ వద్దిరాజు రవిచంద్ర ఒక ప్రకటనలో సంతాపం తెలిపారు.



విద్యార్థులను చితకబాదిన వంట మాస్టర్

- ఖమ్మంజిల్లా పెనుబల్లి ఎస్సీ హాస్టల్‌లో ఘటన

పెనుబల్లి, సెప్టెంబర్ 14: ఖమ్మం జిల్లా పెనుబల్లి ఎస్సీ హాస్టల్‌లో విద్యార్థులను వంట మాస్టర్ చితకబాదిన ఘటన ఆలస్యంగా వెలుగులోకి వచ్చింది. విద్యార్థుల తల్లిదండ్రులు వివరాల ప్రకారం.. రెండ్రోజుల క్రితం హాస్టల్ పరిధిలోని క్రీడా ప్రాంగణంలో విద్యార్థులు కబడ్డీ ఆడుతుండటంతో వంట మాస్టర్ రమేశ్ వారిని మందలించాడు. మట్టి, బురద అంటుతుందని విద్యార్థులను కొట్టాడు. ఇందులో ఓ విద్యార్థి చంప, వీపు కందిపోయింది. విషయాన్ని తల్లిదండ్రులకు తెలపడంతో వారు ఆదివారం హాస్టల్‌కు వచ్చి వార్డెన్ వెంకటేశ్వరరావుకు ఫిర్యాదు చేయగా, చర్యలు తీసుకుంటామని హామీ ఇచ్చారు.

బాలల సంక్షేమంలో హోంశాఖ కీలకం

- లింగభేదాలు లేకుండా వ్యవస్థలు సమగ్రంగా పనిచేయాలి
- ఏ బిడ్డనైనా.. తమ సొంతబిడ్డలా భావిస్తేనే బాల్యం భద్రంగా ఉంటుంది : హైకోర్టు సీజే
- బాలల చట్టాలు అమలు చేయాల్సిన బాధ్యత అధికారులదే : జస్టిస్ మౌసమి భట్టాచార్య



'సేఫ్ గార్డింగ్ ది గర్ల్‌చైల్డ్' కార్యక్రమంలో హైకోర్టు సీజే అపరేశ్‌కుమార్, జస్టిస్ మౌసమి భట్టాచార్య తదితరులు

హైదరాబాద్, సెప్టెంబర్ 14 (నమస్తే తెలంగాణ): బాలల సంక్షేమంలో హోంశాఖ కీలక పాత్ర పోషించాలని హైకోర్టు ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ అపరేశ్‌కుమార్ సింగ్ సూచించారు. సంక్షేమ శాఖతోపాటు హోంశాఖ కూడా సమన్వయంతో పని చేస్తే బాలల హక్కులను కాపాడొచ్చని పేర్కొన్నారు. ఆదివారం సికింద్రాబాద్‌లోని జ్యుడీషియల్ అకాడమీలో జువైనల్ జస్టిస్ కమిటీ ఆధ్వర్యంలో స్టేట్ స్టేక్ హోల్డర్స్ యాన్యువల్ కన్సల్టెంట్ మీటింగ్ నిర్వహించారు. ఈ సందర్భంగా 'సేఫ్ గార్డింగ్ ది గర్ల్‌చైల్డ్.. టువర్డ్స్ ఏ సేఫర్ అండ్ ఎనేబిలింగ్ ఎన్విరాన్‌మెంట్ ఫర్ హర్ ఇన్ ఇండియా' అనే అంశంపై జస్టిస్ అపరేశ్‌కుమార్ సింగ్ మాట్లాడుతూ.. పంచాయతీరాజ్, మున్సిపల్ శాఖల విభాగాలు, వార్డు స్థాయి అధికారులు, అంగన్‌వాడీలు, ఆయాలు చిత్తశుద్ధితో పనిచేస్తే బాలల సంరక్షణ సాధ్యమవుతుందని చెప్పారు. క్షేత్రస్థాయిలో పర్యటించి బాలల సంరక్షణకు అన్ని విభాగాలు సమన్వయంతో కృషిచేయాలని పిలుపునిచ్చారు. పిల్లలు చదువుకొనేందుకు మౌలిక సదుపాయాలు కల్పించాలని, మానవ వనరులను అందుబాటులో ఉంచాలని, తల్లిదండ్రులు, సమాజం పిల్లల బాధ్యత తీసుకోవాలని సూచించారు. ప్రతి ఒక్కరూ లింగ భేదం లేకుండా బాలల అభ్యున్నతికి పాటుపడాలని ఆకాంక్షించారు. ఏ బిడ్డనైనా.. తమ సొంత బిడ్డలా అక్కున చేర్చుకున్ననాడే బాల్యం మరింత భద్రంగా ఉంటుందని చెప్పారు. ఈ సందర్భంగా తాను జార్ఖండ్‌లో కొవిడ్ సమయంలో బాలల సంరక్షణ కోసం చేపట్టిన పలు కార్యక్రమాలను వివరించారు. హైకోర్టు న్యాయమూర్తి జస్టిస్ మౌసమి భట్టాచార్య మాట్లాడుతూ.. క్షేత్రస్థాయిలో బాలల చట్టాలు అమలుచేయాల్సిన బాధ్యత అధికారులదేనని చెప్పారు. వెట్టిచాకిరీ నుంచి పిల్లలను తప్పించడంలో అన్ని విభాగాలు కీలకంగా పనిచేయాలని సూచించారు. ఎంతోమంది బాలికలకు సరైన గైడెన్స్ లేక ఎన్నో వేధింపులకు గురవుతున్నారని ఆవేదన వ్యక్తంచేశారు.

బాలల ఆత్మహత్యలు పెరిగాయి

యునిసెఫ్ నివేదిక ప్రకారం.. దేశవ్యాప్తంగా బాలల ఆత్మహత్యలు నాలుగు రెట్లు పెరిగాయని యునిసెఫ్ ఏపీ, తెలంగాణ, కర్ణాటక ఫీల్డ్ ఆఫీసర్ డాక్టర్ జెలాలేమ్ బిర్హాను తఫెస్సే ఆందోళన వ్యక్తంచేశారు. వారిలో ఎస్సీ, ఎస్టీ, బీసీ విద్యార్థులే అధికంగా ఉన్నారని తెలిపారు. దేశంలో మళ్లీ బాల్యవివాహాలు పెరుగుతున్నాయని ఆవేదన వ్యక్తంచేశారు. డీజీపీ జితేందర్ మాట్లాడుతూ.. తెలంగాణలో జువైనల్ చట్టాలను సమర్థంగా అమలు చేస్తున్నామని చెప్పారు. బాలికల సంరక్షణ కోసం ప్రభుత్వం షీటీమ్స్, భరోసా సెంటర్లు, యాంటీ ట్రాఫికింగ్ యూనిట్లు ఏర్పాటుచేసిందని, ఆపరేషన్ స్మైల్, ముస్కాన్ ద్వారా బాలల వెట్టిచాకిరీని అరికడుతున్నామని వివరించారు. కార్యక్రమంలో హైకోర్టు న్యాయమూర్తులు, పలువురు ఉన్నతాధికారులు ప్రసంగించారు.



సూర్యాపేట జిల్లా రామన్నగూడేనికి చెందిన కాంగ్రెస్, బీజేపీ నాయకులకు గులాబీ కండువా కప్పి బీఆర్ఎస్‌లోకి ఆహ్వానిస్తున్న జగదీశ్‌రెడ్డి

రైతును నట్టేట ముంచిన రేవంత్ సర్కార్

- స్థానిక ఎన్నికలకు సన్నద్ధం కావాలి
- మాజీ మంత్రి, ఎమ్మెల్యే జగదీశ్‌రెడ్డి
- బీఆర్ఎస్‌లో చేరిన పలువురు కాంగ్రెస్, బీజేపీ నాయకులు

ఆత్మకూర్.ఎస్, సెప్టెంబర్ 14: రేవంత్‌రెడ్డి ప్రభుత్వం రైతులను నట్టేట ముంచిందని మాజీ మంత్రి, ఎమ్మెల్యే జగదీశ్‌రెడ్డి విమర్శించారు. యూరియా కొరతతో రైతులు నానా ఇబ్బందులు పడుతుంటే మంత్రులు, ఎమ్మెల్యేలు నిమ్మకునీరెత్తినట్టు వ్యవహరిస్తున్నారని మండిపడ్డారు. సూర్యాపేట నియోజకవర్గంలోని ఆత్మకూర్.ఎస్ మండలం రామన్నగూడెం గ్రామానికి చెందిన బీజేపీ, కాంగ్రెస్ నాయకులు, కార్యకర్తలు, యువకులు ఆదివారం పెద్ద సంఖ్యలో బీఆర్ఎస్‌లో చేరారు. ఆత్మకూర్.ఎస్ మండలంలోని నెమ్మికల్‌లో ఏర్పాటు చేసిన బీఆర్ఎస్ ముఖ్య కార్యకర్తల సమావేశం అనంతరం వీరికి జగదీశ్‌రెడ్డి గులాబీ కండువాలు కప్పి పార్టీలోకి ఆహ్వానించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. అందరూ కలిసికట్టుగా పని చేస్తూ పార్టీ పటిష్టతకు పాటుపడాలని సూచించారు. స్థానిక సంస్థల ఎన్నికలకు బీఆర్ఎస్ నాయకులు, కార్యకర్తలు సన్నద్ధం కావాలని పిలుపునిచ్చారు. అత్యధిక స్థానాలు గెలుచుకునేలా కార్యకర్తలు పని చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో బీఆర్ఎస్ జిల్లా అధ్యక్షుడు, మాజీ ఎంపీ బడుగుల లింగయ్యయాదవ్, జడ్పీ మాజీ వైస్ చైర్మన్ గోపగాని వెంకటనారాయణ తదితరులు పాల్గొన్నారు.

మున్సిపల్ శాఖలో అవినీతి కంపు!

ఆయా విభాగాల్లో భారీగా పెరిగిన అక్రమాలు ● భవన అనుమతుల్లో కొరవడిన పారదర్శకత

- పనులు చేసేందుకు చేయి తడపందే ఫైలు కదలని పరిస్థితి
- ఇటీవల ఏసీబీకి భారీగా వెల్లువెత్తుతున్న ఫిర్యాదులు
- పెరిగిన దాడులు, పట్టివేతలు, కేసుల నమోదు

హైదరాబాద్, సెప్టెంబర్ 14 (నమస్తే తెలంగాణ): రాష్ట్రంలో కాంగ్రెస్ అధికారంలోకి వచ్చిన తర్వాత ప్రభుత్వశాఖల్లో అవినీతి అధికారులు, ఉద్యోగులు మరింత రెచ్చిపోతున్నారని ఆరోపణలు జోరుగా వినిపిస్తున్నాయి. ప్రతి పనికీ చేయి చాచడం కొందరు అధికారులకు అలవాటుగా మారిందని బాధితులు చెప్తున్నారు. ప్రభుత్వ వ్యవస్థలో కొందరు పెద్దలు కమీషన్లు వసూలు చేస్తున్నారన్న ప్రచారం నేపథ్యంలో అదేబాటలో అధికార యంత్రాంగం రెచ్చిపోతున్నదని మండిపడుతున్నారు. వివిధ పనుల కోసం ఆశ్రయిస్తే 'నాకేంటి?' అంటూ వేధిస్తున్నారని చెప్తున్నారు. ప్రతీ పనికి ఓ రేటు కట్టి డబ్బులు వసూలు చేస్తున్నారని ఆగ్రహం వ్యక్తంచేస్తున్నారు. కనీసం రూ.5 వేల నుంచి రూ.10 లక్షల వరకు ముక్కుపిండి లంచాలు డిమాండ్ చేస్తున్న ఘటనలు వెలుగు చూస్తున్నాయి. వేధింపులు భరించలేక కొందరు ప్రజలు ఏసీబీని ఆశ్రయిస్తుంటే మరికొందరు బాధితులుగానే మిగిలిపోతున్నారు. రెడ్ హ్యాండెడ్‌గా దొరుకుతున్నది కొందరైతే గుట్టుచప్పుడు కాకుండా జనాలను పీడిస్తున్నవారు మరికొందరు. ఈ నేపథ్యంలో ఏసీబీని ఆశ్రయిస్తున్న వారి సంఖ్య పెరిగింది.

కీలకశాఖలు.. అవినీతి అడ్డాలు

ప్రభుత్వంలోని కీలకశాఖలు అవినీతికి అడ్డాలుగా మారాయి. ముడుపుల మురికిలో మునిగిపోతున్నాయి. అందుకు ఏసీబీ నమోదుచేసిన కేసులే ఉదాహరణ. ఈ ఏడాది జనవరి నుంచి జూన్ వరకు రెవెన్యూశాఖలో సుమారు 25 కేసులు, పంచాయతీరాజ్‌శాఖలో 19 కేసులు, పోలీస్‌శాఖలో 16 కేసులు, పురపాలకశాఖలో 11 కేసులను ఏసీబీ నమోదు చేసింది. హైదరాబాద్ నగరశివారు మున్సిపాలిటీలు, కార్పొరేషన్ల పరిధిలో నివాస ప్రాంతాలు విస్తరించడం, భవన అనుమతులు, ఎల్ఆర్ఎస్, ఓసీలు, లైసెన్సులు పొందడం వంటి అంశాల్లో అవినీతి ఎక్కువ చోటుచేసుకున్నది. ముఖ్యంగా టౌన్‌ప్లానింగ్ విభాగంలో భారీగా అవినీతి అక్రమాలు జరుగుతున్నట్టు ఏసీబీ దాడుల ద్వారా తెలుస్తున్నది. బీఆర్ఎస్ హయాంలో ఆన్‌లైన్‌లో సింగిల్ విండోలో అనుమతులు ఇచ్చేవారు. దాంతో ప్రజలు పెద్దగా అధికారులను సంప్రదించాల్సిన పరిస్థితి ఉండేది కాదు. కానీ, ఇప్పుడు కాంగ్రెస్ పాలనలో పర్మిషన్లకు వివిధ అంచెలు పెరిగాయి. ఒక ఇంటి నిర్మాణానికి చాలా ఎన్వోసీలు సమర్పించాల్సి రావడం, దానిని అసరాగా చేసుకొని అధికారులు, ఉద్యోగులు ఎవరి స్థాయిలో వాళ్లు వసూళ్లకు పాల్పడటం సాధారణంగా మారింది.



ఏసీబీ కేసులు అధికంగా నమోదైన శాఖలు

ఈ ఏడాదిలో జూన్ వరకు

రెవెన్యూశాఖ	25
పంచాయతీరాజ్‌శాఖ	19
పోలీస్‌శాఖ	16
పురపాలకశాఖ	11
విద్యుత్తుశాఖ	11

ఫైల్ కదలాలంటే... ఏజెంట్‌ను కలవాల్సిందే

కొన్ని మున్సిపాలిటీల్లో అధికారులు ఏజెంట్లను నియమించుకొని మరీ వసూళ్లకు పాల్పడుతున్నారని విమర్శలు వినిపిస్తున్నాయి. ఏజెంట్లను కలిస్తే తప్ప ఫైల్ ముందుకు కదలని పరిస్థితులు ఉన్నాయని బాధితులు చెప్తున్నారు. ఇల్లు, భవనం, అపార్ట్‌మెంట్.. ఇలా నిర్మాణస్థాయిని బట్టి లక్షల్లో లంచాలు వసూలు చేస్తున్నారని తెలుస్తున్నది. అధికారులు, ఉద్యోగుల వేధింపులతో విసిగివేసారిపోతున్న ప్రజానీకం.. ఏసీబీని ఆశ్రయిస్తున్నారు. దీంతో కేసులు పెద్దసంఖ్యలో నమోదవుతున్నాయని తెలుస్తున్నది. ఏ ఉద్యోగి అయినా లంచం అడిగితే ఏసీబీ టోల్ ఫ్రీ నంబర్ 1064కు ఫోన్‌చేయాలని అవినీతి నిరోధకశాఖ కోరుతున్నది. 9440446106 నంబర్ ద్వారా వాట్సాప్‌లో, acb.telangana.gov.in ద్వారా వెబ్‌సైట్‌లో, ఇతర సోషల్ మీడియా యాప్‌లోనూ ఫిర్యాదు చేయవచ్చని ఏసీబీ అధికారులు సూచిస్తున్నారు.

పురపాలకశాఖలో ఇటీవలి కొన్ని కేసులు

- ఓపెన్‌ప్లాట్‌కు ఎల్ఆర్ఎస్ ధ్రువపత్రం ఇచ్చేందుకు రూ.5 లక్షలు డిమాండ్ చేసి రూ.4 లక్షలు తీసుకుంటుండగా రంగారెడ్డి జిల్లా నార్సింగి మున్సిపాలిటీ కార్యాలయంలో టౌన్ ప్లానింగ్ అధికారిగా (టీపీవో)మణిహారికఏసీబీకి చిక్కింది.
- రాజేంద్రనగర్ సర్కిల్ డిప్యూటీ కమిషనర్ రవికుమార్ మున్సిపల్ అనుమతుల కోసం ఒక హోటల్ యాజమాన్యం నుంచి రూ.2 లక్షలు లంచం తీసుకుంటూ ఏసీబీకి పట్టుబడ్డాడు.
- జీహెచ్ఎంసీ సికింద్రాబాద్ జోన్‌లో అసిస్టెంట్ సిటీ ప్లానర్‌గా పనిచేస్తున్న విఠల్‌రావు రెండు భవనాలకు ఆక్యుపెన్సీ సర్టిఫికెట్ (ఓసీ) జారీ చేయడానికి రూ.8 లక్షలు డిమాండ్ చేసి, అందులో రూ.4 లక్షలు తీసుకుంటుండగా ఏసీబీకి దొరికాడు.
- అంబర్‌పేటలో కాంట్రాక్టర్ బిల్లు మంజూరు కోసం జీహెచ్ఎంసీ అసిస్టెంట్ ఇంజినీర్ (ఏఈ) మనీషా రూ.15 వేల లంచం డిమాండ్ చేసి, రూ.5 వేలు లంచం తీసుకుంటూ ఏసీబీకి చిక్కింది.

చెలిమె

తెలంగాణ ప్రజలకు భాష ఓ పిలుపు మాత్రమే కాదు. చరిత్ర మారినా చెదరని అస్తిత్వం. అందుకే తెలంగాణ ఘన సాహిత్యానికి పెద్దపీట వేస్తూ చెలిమెను నిర్వహిస్తున్నది మన పత్రిక. అలసిసొలసిన వేళల్లో కళారూపాలైనా, పోరుబాటల్లో పాటలా మారినా, ఆత్మగౌరవాన్ని కథతో నినదించినా... తనదైన శైలి తెలంగాణది. ఆ సాహిత్యంలో మీకు ఎలాంటి అభిరుచి ఉన్నా, కలాన్ని కదిలించండి. ఆసక్తిగా, సూటిగా తెలంగాణ సాహిత్యానికి సంబంధించిన రచనలు చేయండి... editpage@ntnews.com



మానవ జీవితానికి బాల్యం ఆధారభూతమైన దశ. ఈ దశలో పిల్లల మనస్సు ఆకర్షణకు లోనవుతుంది, ఊహలకు గొప్ప స్థావరంగా ఉంటుంది. అలాంటి దశలో వారు చదివే, వినే, చూసే, అనుభవించే అంశాలే భవిష్యత్తు కాలంలో వారి వ్యక్తిత్వాన్ని తీర్చిదిద్దుతాయి.

పిల్లలు మానసికంగా, శారీరకంగా, ఆరోగ్యంగా ఎదగాలంటే ప్రేమ, ఆహారం, స్వచ్ఛమైన గాలి, ఆటలు ఎంత అవసరమో కళలు, కథలు, కవితలు, సంగీతం కూడా అంతే అవసరం. బాలసాహిత్యం అనేది పిల్లల కోసం రాసేది. అలా రాసిన బాల సాహిత్యం పిల్లల్లో తమదైన ఊహాశక్తి, జ్ఞానం, నైతిక విలువలు, సృజనాత్మకతను పెంపొందించడంలో కీలక పాత్ర పోషిస్తుంది.

మనో వికాసానికి బాల సాహిత్యమే పునాది

కథలు, కవితలు, నాటికలు, జానపద గాథలు, ఇతర రూపాల్లో లభించే బాల సాహిత్యం పిల్లల మానసిక, భావోద్వేగ, సామాజిక అభివృద్ధికి దోహదపడుతుంది. నిజానికి బాల సాహిత్యం ఎదుగుతున్న పిల్లల జీవితాల్లో ఒక అమూల్యమైన సంపద. ఇది వారి మనసును ఆకర్షిస్తూ, విజ్ఞానాన్ని అందిస్తూ, నైతిక విలువలను నేర్పిస్తుంది. భవిష్యత్ సమాజంలో సానుకూల మార్పులు తీసుకురావడానికి బాల సాహిత్యం ఎంతో ముఖ్యమైనది. పిల్లలను ఉత్తమ తరంగా, పౌర సమాజంగా సంసిద్ధం చేయడానికి బాల సాహిత్యం ఒక శక్తివంతమైన సాధనం. దీన్ని సమర్థవంతంగా వినియోగించుకోవడం ద్వారా మనం పిల్లలకు మెరుగైన భవిష్యత్తును అందించవచ్చు.

> బాల సాహిత్యం చదవడం వల్ల పిల్లల్లో ఊహాశక్తి రెక్కలు కట్టుకొని ఎగురుతుంది. మాయాజాల కథలు, సాహస గాథలు వారిలో కొత్త ఆలోచనలను రేకెత్తిస్తాయి. ఇవి వారి సృజనాత్మక ఆలోచనలను పెంచి, సమస్యలను వినూత్నంగా పరిష్కరించే సామర్థ్యాన్ని అందిస్తాయి.

బాల సాహిత్యం వివిధ రూపాల్లో ఉంటుంది. వాటి ద్వారా వారిలో భాషా నైపుణ్యాలు అభివృద్ధి చెందుతాయి. సరళమైన, ఆకర్షణీయమైన శైలిలో రాసిన కథలు, కవితలు వారి పఠన, రచన, శ్రవణ సామర్థ్యాలను మెరుగుపరుస్తాయి. బాలసాహిత్యం పిల్లలకు సత్యం, ధర్మం, సహానుభూతి, సహకారం వంటి నైతిక విలువలను కూడా నేర్పుతుందనే చెప్పవచ్చు. అలనాటి పంచతంత్రం, ఈసప్ కథలు వంటివి నీతి బోధనల ద్వారా పిల్లల్లో సానుకూల దృక్పథాన్ని పెంపొందిస్తాయి. వేమన, సుమతి పద్యాలు వాళ్లలో సృజనాత్మకతకు పాదులు వేస్తాయి. అమ్మమ్మలు, నాన్నమ్మలు, తాతయ్యలు చెప్పే కథలు, జానపద కథలు పాటల ద్వారా పిల్లలు తమ సంస్కృతి, సంప్రదాయాల గురించి తెలుసుకుంటారు. ఇది వారిలో సాంస్కృతిక గౌరవాన్ని, గుర్తింపును కలిగిస్తుంది. బాలలు కథలు, కవితలు, పాటలు చదువడం ద్వారా వారిలో ఆత్మవిశ్వాసం, ఓర్పు, పట్టుదల వంటి గుణాలు పెరుగుతాయి. బాల సాహిత్యం పిల్లల్లో సానుకూల వ్యక్తిత్వ లక్షణాలను రూపొందిస్తుంది. సమూహ కథలు, స్నేహగాథలు పిల్లలకు సహకారం, జట్టు కృషి, టీం స్పిరిట్ పక్కవారి భావాలను గౌరవించడం లాంటి అంశాలను నేర్పుతాయి. అంతేకాదు, సైన్స్ విజ్ఞాన సంబంధిత కథలు, కవితలు శాస్త్రీయ పిల్లల్లో జ్ఞానాభిరుచిని పెంచుతాయి. కథల ద్వారా పిల్లలు వివిధ భావోద్వేగాలను అర్థం చేసుకుంటారు. దుఃఖం, సంతోషం, భయం వంటి భావాలను నియంత్రించడం నేర్చుకుంటారు. బాల సాహిత్యం పిల్లలకు వినోదాన్ని అందిస్తూనే ఒత్తిడి నుంచి ఉపశమనం కలిగిస్తుంది. ఇది వారి మానసిక ఆరోగ్యానికి దోహదపడుతుంది.

ఇట్లా బాలల గురించి బాలల సాహిత్యం సినిమాలు సాంస్కృతిక రంగం గురించి చాలా మాట్లాడతాం. కానీ, మన దేశంలో పిల్లల కోసం చేస్తున్నదేమిటి? ఎంత? అని ఆలోచిస్తే జరుగుతున్నది చాలా స్వల్పమనే చెప్పాలి. ముఖ్యంగా పిల్లల సృజనాత్మక రంగంలో జరుగుతున్న కృషి చాలా తక్కువ. మలయాళం, బెంగాలీ, కన్నడ, కొంత మరాఠీ భాషల్లో మాత్రం ఎన్నదగిన కృషి జరుగుతున్నది. తెలుగులో బాల సాహిత్యం విరివిగానే వస్తున్నప్పటికీ ఇంకా నాణ్యమైన రచనలు రావాల్సి ఉన్నది. మరోవైపు బాల సాహిత్యకారులను ద్వితీయస్థాయి సృజనకారులుగా కాకుండా వారికి ఇవ్వాల్సిన గుర్తింపు ఇవ్వాల్సి ఉన్నది. సాహిత్య విషయాలు ఇట్లా ఉంటే సిన్మా సంగతి మరింత దారుణం. పిల్లల కోసం ప్రత్యేకంగా తీసిన వందల బాలల సినిమాలు ముంబై చిల్డ్రన్ ఫిల్మ్ సొసైటీ గోదాముల్లో స్తబ్ధంగా పడి ఉన్నాయి. ఇక మన హైదరాబాద్‌లో జరగాల్సిన అంతర్జాతీయ స్థాయి పిల్లల సినిమాల పండుగకు రాష్ట్ర, కేంద్ర ప్రభుత్వాలు తిలోదకాలిచ్చేశాయి.

ఈ స్థితిలో బాల సాహిత్యకారులు మరో అంశాన్ని గమనించాల్సి ఉన్నది. ఇవ్వాళ ప్రాథమికోన్నత విద్యాసంస్థలన్నీ ఇంగ్లీష్ మాధ్యమానికే మొగ్గు చూపుతున్నాయి. భవిష్యత్తులో ఉద్యోగాల కోసమైనా, మరి దేనికోసమైనా ఇంగ్లిష్ తప్పనిసరి అనే వాదంతో తెలుగు బోధన అపురూపమైపోయిందనే చెప్పాలి. ఇక ఐటీ తదితర రంగాల్లో ఉన్నవాళ్లకు తెలుగు చదువడమే గగనమైపోయింది. అందుకే బాల సాహిత్య సృజనకర్తలు కేవలం తెలుగులోనే రాసి ఊరుకోకుండా వాటికి ఆంగ్లానువాదాలను కూడా జతచేసి ప్రచురించగలిగితే ఈ రోజుల్లోని ఇంగ్లిష్ మీడియం స్కూళ్లల్లో వాటికి సముచితమైన స్థానం లభిస్తుంది.

> టీవీల్లో, ఇంటర్నెట్‌లో ఇంగ్లిషుకే అలవాటు పడిపోతున్న బాలలకు ద్విభాషా పుస్తకాలు ఎంతో మేలు చేస్తాయి. ఈ దిశలో పెద్దపల్లి లాంటి ఒక మారుమూల ప్రాంతంలో జరిగిన ఒక ప్రయత్నాన్ని అందరి దృష్టికి తేవాలని ఉన్నది. పుల్లూరి జగదీశ్వర్‌రావు అనే బాల సాహిత్యవేత్త 'లిటిల్స్' అనే ఒక కథల పుస్తకాన్ని తెలుగు, ఇంగ్లిష్ భాషల్లో రాసి ప్రచురించారు.

ఆయన ప్రస్తుతం పెద్దపల్లి జిల్లాలో తహశీల్దార్‌గా పని చేస్తున్నారు. విద్యాధికుడైన ఆయన పలు పత్రికల్లో కూడా వ్యాసాలు రాస్తారు. 'ఎడారి మొక్కలు' కథతో మొదలయ్యే ఈ కథా సంకలనంలో 24 కథలున్నాయి. అలతి అలతి మాటల్లో జీవకారుణ్యం, పర్యావరణం, జీవ వైవిధ్యం, కాలుష్యం వంటి అనేక అంశాలను కథలుగా ద్విభాషల్లో గుదిగుచ్చారు. ఈ కథలను చదివి పెద్దపల్లి జిల్లా కలెక్టర్ శ్రీహర్ష ఆకర్షితుడై 150 పేజీల 'లిటిల్స్' పుస్తకాన్ని తానే ముద్రించి పెద్దపల్లి జిల్లాలోని అన్ని ప్రభుత్వ స్కూళ్లకు పంపిణీ చేయించారు. కలెక్టర్ శ్రీహర్ష రాసిన ముందుమాటలో 'పాఠశాల విద్యను అభ్యసిస్తున్న కాలం బాలబాలికలకు అత్యంత ముఖ్యమైన కాలం. వాళ్లు వ్యక్తులుగా రూపొందే క్రమం అక్కడే మొదలవుతుంది' అన్నారు. అది ముమ్మాటికీ నిజం. పుల్లూరి జగదీశ్వర్‌రావు వలె పిల్లల కోసం ద్విభాషా కథలు, కవితలు రాయడం, కలెక్టర్ శ్రీహర్ష లాగా ప్రోత్సహించి స్కూలు విద్యార్థులకు అందుబాటులోకి తీసుకురావడం రాష్ట్రమంతటా, అన్ని జిల్లాల్లోనూ జరగాల్సి ఉన్నది. అట్లయితేనే అర్థవంతమైన బాల సాహిత్యం అందుబాటులోకి వస్తుంది.



వారాల ఆనంద్
94405 01281



జల నిందలు!

మట్టి భాష తెలిస్తే
చెట్టు ఘోష అర్థమయితది
గాలి విలువ గమనిస్తే
హరిత స్వప్నం విచ్చుకుంటది!
నీటి విలువ నీకేం తెలుసు
పంట పొలాలకు ఎరుక
ఎగిసిపడుతూ సముద్రం వైపు
వెల్లువెత్తే నదీనదాలను చూస్తుంటే
క్రూరమైన ఎగతాళొకటి
ఎదను నిలువునా చీలుస్తది!
నీటికి విలువ కట్టే రాజకీయాలు
కాటికి కాళ్లు జాపినట్లే
అవి ఇప్పుడు వట్టి నీళ్లే కావచ్చు
మట్టితో చేతులు కలిపితే
రత్నాలను పండిస్తాయి
రాజ్యాన్ని ధాన్యాగారం చేస్తాయి!
సంపద సృష్టికర్తలు
రెండే రెండు
భూమి-నీళ్లు
ఎవరు ఎంత గొప్పలకు పోయినా
మనం వట్టి సంధానకర్తలం మాత్రమే!
కరువు కోరల పదును తెలిసినవాడు
కాలాన్ని కలగన్నాడు
ఎన్నటికీ ఎడారే అనుకున్న తెలంగాణ
దేశానికి ఇప్పుడు ఆహారాన్ని
వాగ్దానం చేస్తున్నది!
బహుళ అంతస్తుల మేడలు
తలెత్తుక నిలబడాలన్నా
నగర జీవనం కలకాలం
తళతళ మెరవాలన్నా
నిర్మిత జల నిధుల పైన
నిందలు వేయరాదు.. వేయరాదు!!



కోట్ల వెంకటేశ్వరరెడ్డి
9440233261



వాగ్భూషణం

గొంతెత్తితే
గోరింటలు గొంతు కలుపుతయి
కట్లెపూలు కోలాటమాడుతయి
బొడ్డు మల్లెలు బోనమెత్తుకుంటయి
రుద్రాక్షలు నిద్రాణమైన వీణను
వీపు తట్టి లేపుతయి.
జాజులు జతుల గతులను నేర్చి
పొత్తిలిలోని మెత్తటి మాటల
పసి పెదవుల మీద పండు
వెన్నెల పూయిస్తయి
పాలకంకులకు పూవు పిందెలకు
పుప్పొడి ఉగ్గును తినిపిస్తయి
నుడులకు అడుగులు మొలిసి
నూతన లోకానికి తీసుకపోతయి..

ఆ మేని తీగ
ఎదల పొదలను అల్లుకుంటది
తలలో నాలుక అయితది
తలెలో మెతుకు అయితది
తల్లడం మల్లడం అయ్యే గుండెను
తావుకు తెస్తది

ఆ కాళ్ళు గెగ్గెర బొంగరాల్లాగా
ఊరంతా తిరిగినా
ఉనికిలోనే ఉంటయి
ఏటి గట్టు మీదుంటయి
నీటి అలల నరాల తీగలను మీటుతయి
మాటల ఊటలో దాగి
చుక్కల చూపులకు రెక్కలు కడుతయి.
చూపులను తూపులను చేస్తయి
చెట్టు తొర్రలోని తొడిదిలాగా
ఒర్రెలోని చెలిమెలాగా
జలలోనే ఉంటయి
జ్వలనాన్నే కలగంటయి.



కందుకూరి అంజయ్య
94902 22201

> వినిర్మాణం (deconstruction) చాలా క్లిష్టమైన సబ్జెక్టు. అది రూపకం, విరోధాభాస, అలెగరి, అన్యాపదేశం మొదలైనవాటి లాగా సాహిత్య సాధనం (Literary device) కాదు. వినిర్మాణంలో వాచకం (Text)లోని వాక్య నిర్మాణాన్ని ధ్వంసం చేయడం ఉండదు. నిజానికి, రచన చేయడం అనే పనితో వినిర్మాణానికి సంబంధం లేదు. ఇదివరకే రాసిన రచనల వాచకాలను విశ్లేషించడం కోసం, వివరించడం కోసం ప్రతిపాదించబడిన సిద్ధాంతం లేదా పద్ధతి వినిర్మాణం. కాబట్టి, ఒక కవి లేదా రచయిత మంచి వినిర్మాణం టెక్నిక్‌తో రాశాడనే వ్యాఖ్య అసంబద్ధమైనది. వినిర్మాణాన్ని సరిగ్గా, సంపూర్ణంగా ఆకళింపు చేసుకున్నవారు తక్కువగానే ఉంటారు.

విశిష్టమైన విశ్లేషణ సిద్ధాంతం 'వినిర్మాణం'



జాక్వెస్ డెరిడా (1930–2004) అనే ఫ్రెంచ్ మేధావి, విమర్శకుడు ప్రతిపాదించిన సూత్రాలను, వివరణలను ఆధారం చేసుకొని ఏర్పడిన విమర్శ సిద్ధాంతమే వినిర్మాణం. డెరిడాకన్న ముందు ఫ్రెడెరిక్ నీషే(friedrich nietzsche), మార్టిన్ హెయ్డెగ్గర్ (martin heidegger)లు దీనిగురించిన చిన్న చిన్న ప్రతిపాదనలు చేశారు. డెరిడా తన మూడు గ్రంథాలలో వినిర్మాణానికి సంబంధించిన ప్రాథమిక అభిప్రాయాలను వెల్లడించాడు. ఆ గ్రంథాలు Of Grammatology, Writing and Difference, Speech and Phenomena.

> వినిర్మాణంలో మంచి, చెడు; మగ, ఆడ; జ్ఞానం, అజ్ఞానం; సత్యం, అసత్యం లాంటి పరస్పరం విరుద్ధంగా కనిపించే జంట (binary oppositions) విశేష్యాలను పరిశీలించడం ఉంటుంది. వాటి మధ్య మనం చూసే భేదాలను ఆధారం చేసుకొని, అర్థాలను అలా నిర్ణయించుకుంటాం అంటాడు డెరిడా.

సోపానక్రమం (hierarchy)లో వారి స్థానం, విశేషాధికారం (privilege) ప్రకారం ఆ హెచ్చుతగ్గుల అర్థాలను నిర్ణయిస్తామే తప్ప, ఆ అర్థాలు స్థిరమైనవి కావనీ, పైగా తక్కువ విలువ ఉన్నదని మనం భావించే పదం నిజానికి ఎక్కువ విలువ ఉన్నది కావచ్చుననీ సూత్రీకరిస్తాడు. ఉదాహరణకు, జ్ఞానం అజ్ఞానం కన్న గొప్పదనే వాక్యంలో జ్ఞానం అంటే అజ్ఞానం కానిది కదా? అజ్ఞానం అన్నది లేకపోతే జ్ఞానానికి అస్తిత్వం లేదు. అంటే అది స్వతంత్రంగా మనలేదు. పైగా అజ్ఞానం కుతూహలానికి, నేర్చుకోవడానికి దారితీసి, జ్ఞానాన్ని ఉత్పన్నం చేయవచ్చు. ఇప్పుడు జ్ఞానంగా చలామణి అవుతున్నది. తర్వాతి కాలంలో అజ్ఞానంగా నిరూపింపబడవచ్చు. అదేవిధంగా సత్యం కొన్ని అపోహల మీద, ఉపమానాల మీద దృష్టాంతాల మీద, నీతిబోధల మీద ఆధారపడి ఉండవచ్చు. కొత్త రుజువులు ఏర్పడినప్పుడు అసత్యమే సత్యంగా పరిణామం చెందవచ్చు. అప్పుడు అజ్ఞానం జ్ఞానం కన్న, అసత్యం సత్యం కన్న ఎక్కువ విలువను సంతరించుకోవచ్చు.

వినిర్మాణం మీద చర్చలో భాగంగా డెరిడా differance అనే కొత్త పదాన్ని సృష్టించాడు. నిజానికి ఈ పదం ఫ్రెంచి భాషలో గాని, ఇంగ్లీషులో గాని లేదు. difference మాత్రమే ఉంది. కానీ, difference కూ differance మధ్య ఉన్న భేదాన్ని పలకడం ద్వారా చూపించలేం. రాసి లిపి రూపంలో మాత్రమే చూపించగలం. డెఫర్ (defer) అంటే వాయిదా వేయడం. గౌరవించడం అన్నది మరొక అర్థం Deference అంటే వాయిదా వేసే ప్రక్రియ. ఇక్కడ అంతిమ అర్థం ఎప్పుడూ వాయిదా వేయబడుతూనే ఉంటుందని అంతరార్థం. 'దిగ్మండలం'ను మనం చూస్తాం కదా. అది ఎందుకు కనపడుతుంది? అక్కడ నేల ఉన్నందుకే. నేల లేకపోతే అది కనిపించదు. నిజాన్ని దర్శించాలంటే దగ్గరికి వెళ్లి చూడాలి. కానీ, మనం ఎంత నడిచినా దాన్ని చేరుకోలేం. అంటే దాన్ని defer చేయాలన్న మాట (వాయిదా వేయాలి)! అదేవిధంగా పరస్పరం విరుద్ధంగా కనిపించే పదాల నిజమైన, అంతిమ అర్థం తెలుసుకోవాలంటే నిరంతరం వాయిదా వేస్తూనే పోవాలి! ఇటువంటి పదాలకు ఇప్పుడున్న అర్థాలను స్థిరీకరించే, అంతిమంగా నిర్ధారించే ప్రయత్నాలు విఫలం కాక తప్పదు అంటాడు డెరిడా. ప్రతి పదంలో దానికి విరుద్ధమైన మాట అర్థపు అవశేషం మిగిలి ఉంటుందన్నది అతని వాదన.

స్విస్ జాతీయుడైన సస్యూర్ (Ferdinand de Saussure)ను గొప్ప భాషావేత్తగా, భాషాశాస్త్ర పరిశోధకునిగా భావిస్తారు. ఈయన కూడా భాషలో భేదాలు మాత్రమే ఉంటాయనీ, సానుకూల శబ్దాలు (positive terms) అంటూ ఉండవనీ సిద్ధాంతీకరించాడు. ఈ విధంగా, వినిర్మాణాన్ని వాచకాల వివరణల వివేచన పద్ధతిగా అభివర్ణించవచ్చు.



ఎలనాగ



గుట్టు తెలియాలి

అవినీతి
విశ్వరూపమెత్తింది
విశ్వమంతా
విశ్వాసాన్ని కోల్పోయి
దోపిడీ కొమ్ము కాస్తున్నది
నీతి
గోతిలో కూరుకుపోయింది
నేతి బీర
నవ్వులొలకబోస్తున్నది
ధర్మ దేవత
గాంధారి రూపు దాల్చింది
మాటకు విలువ లేకుండా ఉంది
మూటలకు
వంత పాడుతున్నది
చట్టం
చట్ట బండలయినది
పీతాంబర
దారులకే పీటలేస్తున్నది
చేసిన పాపం
కాశీకే అంకితమంటున్నది
రక్త సంబంధాలకు
లుప్తమనే వ్యాధి సోకింది
ఆత్మీయత అనురాగం
ఎడారిలోన యుగళగీతమైనది
ఐక్యత బీడు పడిపోగా
నీతికి పట్టమెక్కుడున్నది
అవినీతి అంతం కావాలంటే
కలుషాలకు నిలయమైన...
కలియుగాన్ని
మట్టుబెట్టే గుట్టు తెలియాలి



నమిలకొండ నాగేశ్వర్‌రావు
86885 534570

జీవితాన్ని ఉద్యమ జెండాలా మలచుకోవడం అందరివల్లా కాదు. నమ్మిన ఆదర్శాలకు కట్టుబడి నిలబడటం, కలెబడటం కూడా అందరికీ సాధ్యం కాదు. జ్ఞానానికి, ఆచరణకు మధ్య ఎదురయ్యే డోలాయమాన స్థితిలో పెను తుపానులను ధిక్కరిస్తూ ఆచరణ వైపు నిలబడటం కొందరికే సాధ్యమవుతుంది. అడుగడుగునా రేవును ముంచెత్తే తీరాలున్నా ద్వీపంలా నిలిచి ఉండటం స్థితప్రజ్ఞత గల వారికే సొంతమవుతుంది. తానూ సమాజమూ ఒకే ఇరుసు మీద నడిచే రెండు చక్రాలని సంభావించే విజ్ఞత కొందరిలోనే అంకురిస్తుంది. కల్లోల కాలాన్ని ఎరుకతో ఎదురీది జీవితాన్ని సృజనాత్మకంగా మలుచుకొని నిండైన భరోసా వాక్యంగా నిలబడటమే గాజోజు నాగభూషణ జీవిత సారం.

జీవిత పరమార్థ ప్రాణ దీపం

'వంగడమంటూ వంట బట్టాక/ వెన్నెముక నిటారుగా నిలిచేదెట్లా/ లొంగడమంటూ మొదలయ్యాక/ నిన్నటి నిలదీతల పదునెక్కడ' అని వంగిపోవడం, లొంగిపోవడం మొదలైతే నిలదీసే అవకాశాన్ని కోల్పోతామని తెలుసుకొమ్మంటాడు రచయిత. 'ప్రశ్నే మన అస్తిత్వ రక్షణకు అమ్ములపొది/ ప్రశ్నతోనే ప్రజల సామూహిక చైతన్యం' అనే సోయితో హేతువును వెన్నెముకగా చేసుకొని ప్రశ్నను ఆయుధంగా చేపట్టి కలంకారునిగా సాగిపోతున్న తేజోపుంజం గాజోజు కవిత. 'మాట్లాడాల్సిన సమయంలో/ మౌనం ఒక పలాయనవాదం/ పోట్లాడాల్సిన సమరంలో/ వెనుకడుగు మరణంతో సమానం/ మనిషివి కదా మాట్లాడు/ వ్యక్తావ్యక్త శక్తులేవో/ నీ అస్తిత్వాన్ని అస్థిరపరుస్తున్న వేళ/ సజీవంగా మాట్లాడకపోతే/ రేపు నీ సమాధిలోంచైనా మాట్లాడక తప్పదు/ నిర్బంధం నిను మరణంలోనూ వెంటాడే నీడ' అని నిబద్ధుడైన సమరవీరుని చివరిమాటల ఒరవడిని పరిచయం చేస్తాడు. మనిషి అస్తిత్వాన్ని రక్షించుకోవడానికి పోరాటమే శరణ్యం తప్ప పలాయనం చిత్తగించడం కాదనే విప్లవ సారాంశాన్ని ఉపదేశిస్తుంది గాజోజు కవిత.

'కన్నీటికి నిలువుటద్దం కవిత్వం/ కాలానికి సజీవ సాక్ష్యం కవిత్వం/ కష్టజీవుల చెమట నెత్తురుల సారం కవిత్వం/ కదనశక్తుల కరవాలం కవిత్వం' (కవిత్వం ఒక తపస్సు) అని తాను ప్రజాపక్షం, కష్టజీవుల పక్షం, కాలానికి సాక్ష్యంగా కవిత్వమై నిలబడుతాననే యథార్థాన్ని నిష్ఠతో ప్రకటిస్తాడు. గాజోజు ఈ కవితా పోరాటం, ఉద్యమ ఆరాటం, నిలువెత్తు ఆచరణై నిలబడుతున్నది దేనికోసం? 'యుద్ధానంతర శాంతి విలసిల్లే నేల కోసం/ యుద్ధమసలే కానరాని బుద్ధ భూమి కోసం' అని జీవితాల్లో, సమాజంలో శాంతి విలసిల్లాలని, బౌద్ధ తాత్వికత విస్తరించి మానవ సమాజం సుభిక్షంగా ఉండాలని అతని కవిత చాటుతుంది. గాజోజు ఆశించినట్టుగా ... 'చీకటి పడగానే అనుకుంటాను/ రేపటి సూర్యుణ్ణి మళ్లీ చూస్తానని/ వేకువ కాగానే తలపోస్తాను/ వేదనలన్నీ నిన్నటి చిరునామాలేనని' నేడున్న స్థితి నుంచి బయటపడి ఒక కొత్త లోకాన్ని చూడటానికి బాటలు వేస్తుంది గాజోజు కవిత్వం.



పల్లె నుంచి అమెరికా దాకా ఆధిపత్యం ఎక్కడున్నా తుదముట్టించి పిడికెడు స్వేచ్ఛ కోసం పోరాడాలనే యుద్ధ గీతం గాజోజు కవిత్వం. సహజ వనరులను, సంస్కృతినీ విధ్వంసం చేస్తున్న దమన నీతిపై శర సంధానం గాజోజు కవిత్వం. సమాజాన్ని ప్రజాస్వామ్య లౌకిక బహుజన శ్రేయోరాజ్యంగా తీర్చిదిద్దుకోవాలనే తపన గాజోజు కవిత్వం. వర్తమాన జీవిత దృశ్యాన్ని కల్లోల సాగరం చేస్తున్న జాత్యహంకారాలు, కరోనా బీభత్సాలు, చెంచుపెంటలు, ఇంద్రవెల్లులు, ధర్నాచౌక్‌లు, రాతి చట్టాలు, కుల, మత విద్రోహాలకు నిరసన గాజోజు కవిత్వం. పిల్లలు, మహిళలు, రైతులు, సంచారులు, ఆదివాసీ సమూహాలతో పాటు ముంపు బాధితులు, వలస కార్మికులు, కూరగాయలమ్మే వాళ్లు, హోటల్ వెయిటర్లు, గారడీ విద్యతో పొట్ట పోసుకునేవాళ్లు, రాళ్లని రోళ్లు చేసి వీధుల్లో తిరిగే బాధాదగ్ధుల జీరగొంతు గాజోజు కవిత్వం.

జీవితం చుట్టూ అల్లుకున్న ఉద్యమ సహచరుల స్మృతిగీతాలు, చిన్ననాటి నుంచి పెంచి పోషించుకున్న చుట్టపు తీగలు, మరపురాని నోస్టాల్జియా సందర్భాలు, తెల్లారితే బడి ఒడిలో దర్శనమిచ్చే పచ్చి పాల నురుగుల అమాయకత్వాలు గాజోజు కవిత్వం. నవనీతం వంటి మానవీయ స్పర్శ, పున్నమ పూలు పూసే కరుణ రసార్ద్రత, ప్రకృతి ఒడిలో కదిలే గాలి తరగల సున్నితత్వం, ఏటిపాటల గలగలలు, జీవిత పరమార్థం కనుగొనే ప్రాణదీపం గాజోజు కవిత్వం.



బూర్ల వెంకటేశ్వర్లు
94915 98040



భయమే భద్రత!

ఎక్కడ పడిపోతానేమోనని
పనిగట్టుకొని పసిగడుతూనే ఉంది
వేగానికి ముందు నోరు తెరచి
నిర్లక్ష్యం వెనుక చేతులు ఆనించి
కుడి ఎడమల కుదుపుల మాటున
ఒడి కాచుక్కూచుంది

నిత్య సేద్యపు జీవితపు పొలంలో
జారుడు బల్లంటి కాలం గట్ల మీద
వేసిన అడుగు, తీసిన పొడుగునా
మనసును సతాయిస్తున్న భయమే
నేలపై నూకలు మిగిల్చిన
జీవన సంజీవనయ్యిందేమో!

భయమే భద్రత!
చావంటే భయం కాదు
బ్రతుకంటే చావడమూ కాదు
ఎప్పటికైనా, తప్పనిదే అయినా..
మృత్యువే ఎదురొస్తే
వెళ్ళి కౌగిలించుకుంటామా?



వినోద్ కుత్తం
96343 14502



మంత్రి సీతక్క స్వగ్రామమైన ములుగు జిల్లా జగ్గన్నపేటలో యూరియా కోసం పెద్ద ఎత్తున బారులు తీరిన రైతులు

మంత్రి సీతక్క స్వగ్రామంలో రైతుల క్యూ

ములుగురూరల్, సెప్టెంబర్14: రాష్ట్ర మంత్రి సీతక్క స్వగ్రామమైన ములుగు జిల్లా ములుగు మండలం జగ్గన్నపేటలో రైతులు యూరియా కోసం క్యూ కట్టారు. లారీలో యూరియా రావడంతో అక్కడే ఉన్న రైతులు ఒక్కసారిగా ఎగబడ్డారు. అబ్బాపురంలో గ్రామపంచాయతీ కార్యాలయం వద్ద యూరియా కోసం రైతులు బారులు తీరారు.

ప్రభుత్వ వైఫల్యంతోనే కొరత: నాగజ్యోతి

మంత్రి సీతక్క సొంత గ్రామంలో యూరియా కోసం రైతులు క్యూ లైన్‌లో నిలబడి అవస్థలు పడుతున్నారంటే.., ములుగు జిల్లావ్యాప్తంగా పరిస్థితి ఎలా ఉందో అర్థమవుతుందని బీఆర్ఎస్ ములుగు నియోజకవర్గ ఇన్‌చార్జి బడే నాగజ్యోతి అన్నారు. ఆదివారం ఆమె మాట్లాడుతూ.. ప్రభుత్వ వైఫల్యంతోనే యూరియా కొరత ఏర్పడిందని విమర్శించారు. ప్రజలు ఇబ్బందిపడుతున్నా రాష్ట్రంలో యూరియా కొరత లేదని మాట్లాడడం సీతక్కకే చెల్లిందని ఎద్దేవా చేశారు.



కామారెడ్డి జిల్లా రామారెడ్డి మండలం అన్నారంలో యూరియా కోసం చెప్పులను వరుసలో ఉంచిన రైతులు



హనుమకొండ జిల్లా శాయంపేట మండలం ఆగ్రోస్ సెంటర్ ఎదుట నిప్పు పెట్టి నిరసన తెలుపుతున్న వసంతాపూర్ రైతులు

అదే వరుస.. తీరని గోస

యూరియా కోసం క్యూలైన్లు.. తప్పని చెప్పుల వరుసలు.. పొద్దంతా నిల్చున్నా దొరకని సంచులు.. రైతుల నిరసనలు.. అక్కడక్కడా ఆగ్రహ జ్వాలలు.. ఇప్పటికీ ఇవి నిత్యకృత్యంగా మారాయి. రాష్ట్రవ్యాప్తంగా ఆదివారం కూడా రైతు కుటుంబాలు యూరియా కోసం ఎక్కడికక్కడ క్యూలైన్లు కట్టారు. మంత్రి సీతక్క స్వగ్రామంలో పెద్ద ఎత్తున రైతులు క్యూకట్టగా, మాజీ మంత్రి సత్యవతి రాథోడ్‌కూ యూరియా కష్టాలు తప్పలేదు. ఆమె కూడా రైతుల క్యూలైన్‌లో నిల్చోగా, ఒక్కటే బస్తాను అధికారులు ఇచ్చారు. మహబూబాబాద్ జిల్లాలో యూరియా కోసం వెళ్తుండగా ఇద్దరు రైతులు రోడ్డు ప్రమాదంలో దుర్మరణం పాలయ్యారు. ఒక్కబస్తా కోసం పనులు మానుకొని రైతులు పొద్దంతా అష్టకష్టాలు పడుతుంటే.. మరోవైపు అక్రమార్కుల బాగోతం ఒక్కొక్కటీ బయటపడుతున్నది. యూరియాను దారి మళ్లించాడని మిర్యాలగూడ ఎమ్మెల్యే గన్‌మన్‌పై ఆరోపణలు వెల్లువెత్తాయి.

యూరియా కొరత వాస్తవమే

పరకాల ఎమ్మెల్యే రేవూరి ప్రకాశ్‌రెడ్డి



పరకాల, సెప్టెంబర్ 14 : ప్రస్తుత సీజన్‌లో యూరియా కొరత వాస్తవమేనని ఎమ్మెల్యే రేవూరి ప్రకాశ్‌రెడ్డి ఒప్పుకున్నారు. హనుమకొండ జిల్లా పరకాల కేంద్రంలోని ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో నిర్వహించిన మీడియా సమావేశంలో ఆయన మాట్లాడారు. రైతులు తమ అవసరానికంటే ఎక్కువ యూరియాను కొనుగోలు చేసి నిల్వ చేసుకోవడంతోనే యూరియా కొరత ఏర్పడిందని చెప్పారు. జిల్లా వ్యాప్తంగా సెప్టెంబర్‌లో 18వేల మెట్రిక్ టన్నుల యూరియా అవసరం కాగా, ఇప్పటికే 14వేల మెట్రిక్ టన్నుల యూరియా సరఫరా జరిగిందని వెల్లడించారు. యూరియా దొరకని రైతులు నానో యూరియాను పంటలకు స్ప్రే చేసుకోవాలని సూచించారు. రాష్ట్రానికి అవసరమైన యూరియాను సరఫరా చేయించే దిశగా ప్రభుత్వం కేంద్రంపై ఒత్తిడి తీసుకొస్తున్నదని తెలిపారు.



ఆదిలాబాద్ జిల్లా ఇచ్చోడలో యూరియా బస్తాతో నిరసన తెలుపుతున్న బీఆర్ఎస్ నాయకులు, రైతులు

ప్రాణాలను బలిగొన్న యూరియా

- ఎరువుల కోసం వెళ్తూ ఇద్దరు గిరిజన రైతుల దుర్మరణం
- రైతులు వెళ్తున్న బైక్‌ను హైవేపై ఢీ కొట్టిన బొలెరో వాహనం
- మహబూబాబాద్ జిల్లా గూడూరు మండలంలో విషాదం



మహబూబాబాద్ ఏరియా వైద్యశాల మార్చురీ గది ఎదుట ధర్నా చేస్తున్న మాజీ మంత్రి సత్యవతి రాథోడ్, మృతుల కుటుంబ సభ్యులు, బంధువులు, గిరిజన సంఘాల నేతలు

మహబూబాబాద్ రూరల్/ గూడూరు, సెప్టెంబర్ 14 : ప్రభుత్వం నిర్లక్ష్యం రైతులపాలిట శాపంగా మారాయి. యూరియా విషయంలో సర్కారు అనాలోచిత నిర్ణయాలు రైతుల ప్రాణాల మీదికి తెస్తున్నాయి. ఓ పక్క పంటల అదును దాటిపోతుండటం, మరో పక్క యూరియా దొరకకపోవడంతో అన్నదాతలు పడరానిపాట్లు పడుతున్నారు. ఎలాగైనా పంటలను దక్కించుకోవాలనే ఆరాటంతో ఆదివారం పొద్దున్నే యూరియా కోసం బయలు దేరిన ఇద్దరు రైతులు రోడ్డు ప్రమాదంలో మృత్యువాత పడగా ఆ కుటుంబాలకు తీరని దుఃఖాన్ని మిగిల్చింది. ఈ హృదయ విదారక ఘటన మహబూబాబాద్ జిల్లా గూడూరు మండలం జగన్నాయకులుగూడెం వద్ద ఎన్‌హెచ్-365పై జరిగింది. ఎస్సై గిరిధర్‌రెడ్డి తెలిపిన ప్రకారం.. గూడూరు మండలం దుబ్బగూడెంకు చెందిన బానోత్ లాల్యా (77), జోషితండాకు చెందిన ధరావత్ వీరన్న (46) సమీప గ్రామమైన బొద్దుగొండ రైతువేదికలో యూరియా కోసం టోకెన్లు ఇస్తున్నారని తెలిసి, ఆదివారం ఉదయం 6.30 గంటలకు బైక్‌పై బయలుదేరారు. జగన్నాయకులగూడెం క్రాస్‌రోడ్ సమీపంలో మహబూబాబాద్ నుంచి గూడూరు వైపునకు వస్తున్న బొలేరో వాహనం వీరి ద్విచక్రవాహనాన్ని బలంగా ఢీ కొట్టింది. ఈ ప్రమాదంలో బానోత్ లాల్యా తలకు తీవ్రగాయాలు కావడంతో ఘటనా స్థలంలోనే ప్రాణాలు వదిలాడు. తీవ్ర గాయాలతో ఉన్న వీరన్నను పోలీసులు మహబూబాబాద్ ఏరియా వైద్యశాలకు తరలించారు. పరిస్థితి విషమంగా ఉండటంతో ఖమ్మంలోని ఓ దవాఖానకు తరలిస్తుండగా వీరన్న కూడా మృతి చెందాడు. బానోత్ లాల్యా భార్య లక్ష్మి ఫిర్యాదు మేరకు నిర్లక్ష్యంగా వాహనాన్ని నడిపిన డ్రైవర్ చొక్కలింగంపై కేసు నమోదు చేసినట్టు ఎస్సై తెలిపారు. బీఆర్ఎస్ జిల్లా అధ్యక్షురాలు మాలోత్ కవిత, మండల బాధ్యులు సంపత్‌రావు, ఆరె వీరన్న, నూకల సురేందర్, రహీం, కతార్ సింగ్, మోహన్, సుధాకర్‌రావు దుబ్బగూడెం గ్రామానికి వెళ్లి మృతుల కుటుంబాలను పరామర్శించి అండగా ఉంటామని హామీ ఇచ్చారు.

రైతు కుటుంబాలను ఆదుకోవాలి: మాజీ మంత్రి సత్యవతి రాథోడ్

యూరియా కోసం వెళ్తూ రోడ్డు ప్రమాదంలో మృతి చెందిన రైతుల కుటుంబాలను ప్రభుత్వం ఆదుకోవాలని మాజీ మంత్రి సత్యవతిరాథోడ్ డిమాండ్ చేశారు.

గూడూరు మండలంలో ఇద్దరు రైతులు మృతి చెందగా, మృతదేహాలను మహబూబాబాద్‌లోని ఏరియా వైద్యశాలకు తరలించారు. మృతుల కుటుంబ సభ్యులు, బంధువులు ప్రభుత్వ నిర్లక్ష్యం వల్లే రైతులు మృతి చెందారని ఏరియా వైద్యశాల ఎదుట ఆందోళన చేపట్టారు. సమాచారం తెలుసుకున్న మాజీ మంత్రి సత్యవతిరాథోడ్ వారికి మద్దతుగా ఆందోళనలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. రాష్ట్ర వ్యాప్తంగా రైతులు యూరియా కోసం ఇబ్బందిపడుతున్నా సీఎం రేవంత్‌రెడ్డి మాత్రం ఎలాంటి సమీక్షలు చేయకుండా రైతులు, యూరియా సమస్యలను గాలికి వదిలేశారని మండిపడ్డారు. కేసీఆర్ ముందు చూపుతో రైతులకు ఎలాంటి సమస్యలు లేకుండా సకాలంలో యూరియాను అందించినట్టు గుర్తుచేశారు. ప్రభుత్వం నిర్లక్ష్యంతో యూరియా దొరుకుతుందో లేదోనని రైతులు పొద్దున్నే బైక్‌పై వెళ్లి రోడ్డు ప్రమాదంలో దుర్మరణం చెందడం కలిచివేసిందని ఆవేదన చెందారు. దీనికి ప్రభుత్వమే పూర్తి బాధ్యత వహించి, బాధిత కుటుంబాలకు రూ.10లక్షల ఎక్స్‌గ్రేసియా ప్రకటించాలని డిమాండ్ చేశారు. అనంతరం మృతుల కుటుంబాలను ఓదార్చి బీఆర్ఎస్ అండగా ఉంటుందని ధైర్యం చెప్పారు.

మాజీ మంత్రికీ తప్పని యూరియా కష్టాలు

యూరియా కూపన్ కోసం క్యూలో నిలబడిన సత్యవతి రాథోడ్

కురవి, సెప్టెంబర్ 14: యూరియా కష్టాలు సామాన్య రైతులకే కాదు మాజీ మంత్రి సత్యవతిరాథోడ్‌కూ తప్పలేదు. మహబూబాబాద్ జిల్లా కురవి మండలంలోని స్వగ్రామమైన పెద్దతండాలో సత్యవతిరాథోడ్‌కు ఐదున్నర ఎకరాల భూమి ఉండగా వివిధ పంటలు సాగు చేయిస్తున్నారు. నెలరోజులుగా యూరియా దొరకకపోవడంతో ఆదివారం మాజీ మంత్రి గుండ్రాతిమడుగు సొసైటీ వద్దకు వచ్చి కూపన్ కోసం మహిళా రైతులతో కలిసి లైన్‌లో నిలబడ్డారు. గంటపాటు వేచి ఉన్న తర్వాత అధికారులు ఒక యూరియా బస్తాకు కూపన్ ఇచ్చారు. తర్వాత మరో లైన్ నిలబడి యూరియా బస్తాను తీసుకున్నారు. ఒక్క బస్తా కోసం రైతు పడే కష్టాన్ని స్వయంగా సత్యవతిరాథోడ్ అనుభవించారు.

చేతగాని ప్రభుత్వం వల్లే రైతులకు కష్టాలు: మాజీ మంత్రి సత్యవతిరాథోడ్

అమలు గాని హామీలు ఇచ్చి అధికారంలోకి వచ్చిన కాంగ్రెస్ ప్రభుత్వ చేతగానితనం వల్లనే రైతులు కష్టాలు పడుతున్నారని మాజీ మంత్రి సత్యవతి రాథోడ్ ధ్వజమెత్తారు. గుండ్రాతిమడుగు సొసైటీ ఎదుట ఆమె మీడియాతో మాట్లాడుతూ.. నెలరోజులుగా రైతులు నాట్లు, పనులను వదిలి క్యూలో నిలబడుతున్నారని పేర్కొన్నారు. పది ఎకరాలు ఉన్న రైతు ఒక్క బస్తా యూరియా ఏం చేసుకుంటారో ప్రజాప్రతినిధులు చెప్పాలని నిలదీశారు. రైతు కష్టాలు చూస్తే రాష్ట్ర ప్రభుత్వానికి దున్నపోతు మీద వాన కురిసినట్టుగా ఉన్నదని ఎద్దేవా చేశారు. రైతు కష్టాలు పడుతుంటే కాంగ్రెస్ ప్రభుత్వం మాత్రం కేంద్రానిదే తప్పు అంటూ తప్పించుకుంటున్నదని విమర్శించారు. రాష్ట్రంలోని యూరియా కర్మాగారాన్ని బాగుచేయించాలనే సోయి ప్రభుత్వానికి లేకపోయిందని మండిపడ్డారు. రాష్ట్రం నుంచి 16 మందిని పార్లమెంట్‌కు పంపిస్తే ఒక్క రోజు కూడా రైతుల గురించి మాట్లాడిన పాపానపోలేదని ధ్వజమెత్తారు. ఇప్పటికైనా రైతుల డిమాండ్ మేరకు యూరియాను దిగుమతి చేసుకోవాలని సూచించారు. రైతుల ఉసురు తగిలిన ఏ ప్రభుత్వం మనుగడలేదని గుర్తుచేశారు.

ధాన్యం కొనుగోళ్లలో కోత!

మొదటిపేజీ తరువాయి...



తెలిసింది. ఇందుకు సంబంధించి రాష్ట్ర సివిల్ సప్లయ్ అధికారులకు సమాచారం ఇచ్చినట్టు తెలిసింది. వానకాలం ధాన్యం కొనుగోళ్లపై ఇటీవల ఫుడ్ కార్పొరేషన్ ఆఫ్ ఇండియా (ఎఫ్‌సీఐ) రాష్ట్ర సివిల్ సప్లయ్ అధికారులతో సన్నాహక సమావేశాన్ని నిర్వహించింది. ఈ సందర్భంగా కేంద్రం తరఫున కొనుగోలు చేసే ధాన్యం వివరాలను రాష్ట్ర అధికారులకు తెలియజేసినట్టు సమాచారం. ఒకవేళ ఈ సీజన్‌లో 52 లక్షల టన్నులు మాత్రమే కొనుగోలు చేయాలనే నిర్ణయం ఫైనల్ అయితే... రాష్ట్రంలో రైతుల నెత్తిన పిడుగు పడినట్టే అనే ఆందోళనలు వ్యక్తమవుతున్నాయి.

కోటి టన్నులు కొనుగోలు చేసేదెవరు?

ఈ వానకాలంలో ఇప్పటివరకు 66 లక్షల ఎకరాల్లో వరి సాగైనట్టు వ్యవసాయ శాఖ తన నివేదికలో వెల్లడించింది. ఈ లెక్కన ఎకరానికి సగటున 23 క్వింటాళ్ల ధాన్యం దిగుబడిని అంచనా వేసినా 151 లక్షల టన్నుల ధాన్యం ఉత్పత్తి అవుతుందని భావిస్తున్నారు. ఇందులో సర్కారు 52 లక్షల టన్నులు మాత్రమే కొనుగోలు చేయాలని నిర్ణయించినట్టు తెలిసింది. దీనిపై సివిల్ సప్లయ్ అధికారులు స్పందిస్తూ... ఇది చాలా తక్కువ లక్ష్యమని, దీనిని పెంచాలని కోరినట్టు తెలిసింది. దీనిపై ఎఫ్‌సీఐ అధికారులు స్పందిస్తూ.. 'ముందు ఇచ్చిన టార్గెట్ పూర్తి చేయండి.. ఒకవేళ ఇంకా వస్తే అప్పుడు చూద్దాం' అని అన్నట్టు తెలిసింది. దీంతో రైతులు పండించిన మిగిలిన సుమారు కోటి టన్నుల ధాన్యాన్ని ఎవరు కొనుగోలు చేస్తారనేది ప్రశ్నార్థకంగా మారింది.

కాంగ్రెస్ సర్కారు వైఫల్యమేనా?

రాష్ట్రంలోని కాంగ్రెస్ సర్కారు నిర్లక్ష్యం, వైఫల్యం రైతులకు శాపంగా మారిందనే విమర్శలు వ్యక్తమవుతున్నాయి. కేంద్ర ధాన్యం కొనుగోళ్ల టార్గెట్‌ను తక్కువగా పెట్టడానికి కచ్చితంగా రాష్ట్ర ప్రభుత్వ వైఫల్యమే కారణమనే అభిప్రాయం వ్యక్తమవుతున్నది. సర్కారు పక్కా ప్రణాళికతో వ్యవహరించి కేంద్రానికి నివేదికలు పంపిస్తే కొనుగోలు లక్ష్యం ఇంత తగ్గేదికాదనే ఆరోపణలు వినిపిస్తున్నాయి. ప్రస్తుత సాగు లెక్కల ప్రకారం ఈ సీజన్‌లో ప్రభుత్వం ఎలాంటి కొర్రీలు లేకుండా కొనుగోలు చేస్తే 90 లక్షల టన్నుల నుంచి కోటి టన్నుల ధాన్యం కొనుగోలు కేంద్రాలకు వస్తుందనే అంచనాలున్నాయి. రైతులు పండించే మొత్తం 150 లక్షల టన్నుల ధాన్యంలో 30 లక్షల టన్నులు మిల్లర్లు, వ్యాపారులు కొనుగోలు చేసినా, మరో 20 నుంచి 25 లక్షల టన్నులు రైతులు తమ అవసరాలకు నిల్వ చేసుకుంటే మిగిలిన కోటి టన్నులు సర్కారు కొనుగోలు చేయాల్సి వస్తుంది. అలాంటిది 52 లక్షలకే పరిమితం చేయడంపై విమర్శలు వ్యక్తమవుతున్నాయి.

బోనస్ ఎగ్గొట్టేందుకేనా?

సన్నాలకు క్వింటాల్‌కు రూ.500 బోనస్ ఇస్తామన్న హామీని తూతూ మంత్రంగా అమలుచేస్తున్న సర్కారు.. దీని నుంచి తప్పించుకోవాలనే ఆలోచనలో ఉన్నట్టు విమర్శలు వ్యక్తమవుతున్నాయి. గత వానకాలం బోనస్ పైసలను మూడు నెలల తర్వాత చెల్లించిన సర్కారు.. మొన్నటి యాసంగి బోనస్ పైసలను ఇప్పటివరకూ చెల్లించలేదు. సుమారు రూ.1,200 కోట్ల బకాయిలున్నాయి. బోనస్ వస్తుందన్న ఆశతో ఈ వానకాలంలో రైతులు భారీగా సన్నాలు సాగు చేశారు. సుమారు 60% సన్నాలు సాగు చేసినట్టు అంచనా. దీంతో కొనుగోలు కేంద్రాలకు సుమారు 40-50 లక్షల టన్నుల సన్న ధాన్యం వస్తుందని అధికారులు అంచనా వేస్తున్నారు. ఇదే జరిగితే ప్రభుత్వం బోనస్ కింద రైతులకు రూ.2వేల కోట్ల నుంచి రూ.2,500 కోట్ల వరకు చెల్లించాల్సి ఉంటుంది. ప్రస్తుత బకాయిలు రూ.1,200 కోట్లు చెల్లించలేక ఆపసోపాలు పడుతున్న సర్కారు.. రూ.2వేల కోట్లు చెల్లించడం కష్టమేననే అభిప్రాయాలు వ్యక్తమవుతున్నాయి. ఇందులో భాగంగానే ధాన్యం కొనుగోళ్లలో కోత పెడితే... బోనస్ భారం తగ్గించుకోవచ్చనే ఆలోచనలో సర్కారు ఉన్నదనే ఆరోపణలు వినిపిస్తున్నాయి. అందుకే కేంద్రం 52 లక్షల టన్నుల కొనుగోలుకు ఆమోదం తెలిపితే, రాష్ట్ర ప్రభుత్వం నోరు మెదపడంలేదనే విమర్శలు వ్యక్తమవుతున్నాయి.

కరెంట్ షాక్‌తో యువ రైతు మృతి



శివారెడ్డి (ఫైల్)

రాజోళి, సెప్టెంబర్ 14: విద్యుదాఘాతంతో యువ రైతు మృతి చెందిన ఘటన జోగుళాంబ గద్వాల జిల్లా రాజోళి మండలంలో చోటుచేసుకున్నది. స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం.. తుమ్మలపల్లి యువ రైతు మద్దూరు శివారెడ్డి (28) నీళ్లు పెట్టేందుకు ఆదివారం పొలానికి వెళ్లాడు. తుంగభద్ర తీరంలో మోటర్‌ను ఆన్ చేసే క్రమంలో విద్యుదాఘాతానికి గురయ్యాడు.

లారీ లోడ్ యూరియా పక్కదారి

కాంగ్రెస్ ఎమ్మెల్యే గన్‌మన్ నిర్వాకం

- ఎమ్మెల్యే లక్ష్మారెడ్డి పీఏని అంటూ వ్యవసాయాధికారులకు ఫోన్
- వెంటనే యూరియాను కేటాయించిన అధికారులు
- నల్లగొండ జిల్లాలోని మిర్యాలగూడలో ఘటన



ఎమ్మెల్యే లక్ష్మారెడ్డి గన్‌మన్ నాగునాయక్

మిర్యాలగూడ, సెప్టెంబర్ 14: ఎమ్మెల్యే గన్‌మన్ అధికార దుర్వినియోగానికి పాల్పడ్డాడు. ఎమ్మెల్యే చెప్పాడంటూ అధికారులను బురిడీ కొట్టించి లారీ లోడ్ యూరియాను పక్కదారి పట్టించాడు. ఈ ఘటన నల్లగొండ జిల్లా మిర్యాలగూడలో ఆలస్యంగా వెలుగులోకి వచ్చింది. వివరాలు ఇలా.. మిర్యాలగూడ ఎమ్మెల్యే బత్తుల లక్ష్మారెడ్డి గన్‌మన్ నాగునాయక్ పక్షం రోజుల క్రితం మార్క్‌ఫెడ్ డీఎం జ్యోతికి ఫోన్ చేసి.. 'నేను ఎమ్మెల్యే పీఏను మాట్లాడుతున్నా.. సార్ బిజీగా ఉన్నారు. ఒక లారీ లోడ్ యూరియా మాడ్గులపల్లి మండలం కుక్కడం ఎన్‌డీసీఎస్‌కు పంపించాలి' అని సూచించాడు. ఆ మేరకు సదరు అధికారి జ్యోతి ఈ విషయాన్ని మెసేజ్ ద్వారా జిల్లా వ్యవసాయాధికారి శ్రవణ్‌కుమార్‌కు సమాచారం అందించారు. జిల్లా వ్యవసాయాధికారి వెంటనే స్పందించి ఇండెంట్ పెట్టి, లారీ లోడ్ యూరియాను సదరు సొసైటీకి పంపించారు. ఇటీవల జిల్లా వ్యవసాయాధికారికి అనుమానం వచ్చి మార్క్‌ఫెడ్ డీఎంను అడగ్గా.. ఆమె విచారణ జరుపగా ఎమ్మెల్యే చెప్పలేదనే విషయం వెలుగులోకి వచ్చింది. లారీ లోడ్ యూరియా పక్కదారి పట్టిన విషయం వెలుగులోకి రావడంతో ఎస్పీ శరత్ చంద్రపవార్‌కు ఫిర్యాదు రావడంతో నాగునాయక్‌ను నల్లగొండ జిల్లా కేంద్రానికి అటాచ్ చేసి విచారణకు ఆదేశించారు. విచారణ పూర్తయ్యాక శాఖాపరమైన చర్యలు తీసుకోనున్నట్టు తెలిసింది.

పక్కదారి పట్టలేదు

ఎమ్మెల్యే పీఏనంటూ గన్‌మన్ లారీ యూరియాను పక్కదారి పట్టించిన విషయమై జిల్లా వ్యవసాయాధికారి శ్రవణ్‌కుమార్‌ను వివరణ కోరగా, యూరియా పక్కదారి పట్టలేదని తెలిపారు. కుక్కడం ఎన్‌డీసీఎస్‌కు కేటాయించిన యూరియాను రైతులే తీసుకున్నట్టు చెప్పారు. ఓ వ్యక్తి ఎమ్మెల్యే పీఏనని అబద్ధం చెప్పి ఎమ్మెల్యేకు తెలియకుండానే యూరియాను అలాట్ చేయాలని కోరినట్టు ధ్రువీకరించారు.

- ఉల్లి సాగుతో అప్పల పాలు



ఉల్లి పంట సాగు రైతును నిలువునా ముంచింది. దిగుబడి ఆశాజనకంగా ఉన్నా మార్కెట్‌లో సరైన ధర లభించకపోవడంతో రైతులు అప్పులపాలయ్యారు. మార్కెట్‌కు తీసుకెళ్లినా గిట్టుబాటు ధర లేక, నిల్వ చేద్దామంటే గోదాములు లేక ఇబ్బందులు పడుతున్నారు. దీంతో పడించిన పంటను పొలాల్లోనే వదిలేస్తున్నారు. వనపర్తి జిల్లా వీపనగండ్ల మండలం గోవర్ధనగిరికి చెందిన రైతు నడిపి ఖాజా పదెకరాలు కౌలుకు తీసుకొని ఉల్లి పంటను సాగుచేశాడు. సాగు కోసం .8.43 లక్షల పెట్టుబడి పెట్టాడు. మార్కెట్‌లో ధర లేకపోవడంతో చేతికి వచ్చిన ఉల్లి పంటను పొలంలోనే వదిలేశాడు. దీంతో ఆ పంటను స్థానికులు తమ ఇండ్లకు తీసుకెళ్తున్నారు. ప్రభుత్వం ఉల్లి పంటకు గిట్టుబాటు ధరను కల్పించకపోవడంతో నష్టపోవాల్సి వస్తుందని రైతులు ఆవేదన వ్యక్తంచేస్తున్నారు. బీఆర్ఎస్ హయాంలో పంటలకు గిట్టుబాటు ధర కల్పించి కొనుగోలు చేసిన విషయాన్ని వారు గుర్తుచేస్తున్నారు. ఇప్పటికైనా ప్రభుత్వం స్పందించి ఉల్లి పంటకు మద్దతు కల్పించి తమను ఆదుకోవాలని రైతులు కోరుతున్నారు.

– వీపనగండ్ల



మంచిర్యాల జిల్లా రాపనపల్లి అంగన్‌వాడీలో కుళ్లిన కోడిగుడ్లు

అంగన్‌వాడీలో కుళ్లిన కోడిగుడ్లు

మంచిర్యాల జిల్లా రాపనపల్లిలో ఘటన

కోటపల్లి, సెప్టెంబర్ 14 : మంచిర్యాల జిల్లా కోటపల్లి మండలం రాపనపల్లిలోని అంగన్‌వాడీలో కుళ్లిన కోడిగుడ్లు పంపిణీ చేశారు. లబ్ధిదారుల వివరాల ప్రకారం.. అంగన్‌వాడీలో మూడు రోజుల క్రితం కోడిగుడ్లను పంపిణీచేశారు. వాటిని ఆదివారం పిల్లలకు అందించేందుకు ఉడకబెట్టగా దుర్వాసన వచ్చింది. గుడ్లను పగులకొట్టగా కుళ్లిపోయి ఉన్నాయి. కుళ్లిన గుడ్లను సమ్మయ్య అనే వ్యక్తి ఫొటో తీసి గ్రామంలోని వాట్సాప్ గ్రూప్‌లో పెట్టాడు. ఇలాంటి కుళ్లిన గుడ్లను తింటే గర్భిణులు, బాలింతలు, చిన్నారుల ఆరోగ్య పరిస్థితి ఏమిటని ప్రశ్నించారు. అంగన్‌వాడీ సూపర్‌వైజర్‌ను 'నమస్తే తెలంగాణ' ఫోన్ ద్వారా వివరణ కోరగా తన దృష్టికి రాలేదన్నారు.

17నుంచి పోషణ మాసోత్సవాలు

ప్రజాప్రతినిధులకు మంత్రి సీతక్క లేఖలు

హైదరాబాద్, సెప్టెంబర్ 14 (నమస్తే తెలంగాణ): రాష్ట్రవ్యాప్తంగా ఈనెల 17నుంచి పోషణ మాసోత్సవాలు నిర్వహించనున్నట్టు మహిళా శిశు సంక్షేమశాఖ మంత్రి సీతక్క తెలిపారు. ఈ మేరకు చిన్నారులు, మహిళల్లో పోషకాహార అవశ్యకతపై నెలరోజులపాటు చైతన్య కార్యక్రమాలు నిర్వహించనున్నామని ఆదివారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. ఈ మేరకు కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని ప్రజాప్రతినిధులకు లేఖలు రాశారు. కార్యక్రమాల నిర్వహణకు ఐసీడీఎస్ ప్రాజెక్టుకు రూ. 30 వేలు, ప్రతి జిల్లాకు రూ. 50 వేలు విడుదల చేసినట్టు వెల్లడించారు. పోషకాహార మాసోత్సవాల్లో జంక్ ఫుడ్ తగ్గింపు, నూనె, చక్కెర, ఉప్పు వినియోగంపై అవగాహన కల్పించాలని అధికారులను ఆదేశించారు.

పల్లెకు అందని 'సంక్షేమం'

పథకాలపై కాంగ్రెస్ సర్కారు డొల్ల ప్రచారం

ములుగు జిల్లా రామయ్యపల్లెనే నిదర్శనం

- సున్నా వడ్డీ రుణాలు అసలే అందని గ్రామం
- 55 కుటుంబాలకు వర్తించని రైతు రుణమాఫీ
- 87మంది రైతుల్లో సరిపడా యూరియా ముగ్గురికే
- 79 దరఖాస్తుదారుల్లో ముగ్గురికే ఇందిరమ్మ ఇండ్లు
- మళ్లీ వలసబాట పట్టిన 14 రైతు కుటుంబాలు
- కాంగ్రెస్ పాలనలో పల్లెకు దక్కిన సంక్షేమం ఇదే
- సామాజిక సంస్థ బయటపెట్టిన దా'రుణాలు'



ములుగు జిల్లా రామయ్యపల్లెలో సర్వే చేస్తున్న ఓ సామాజిక సంస్థ ప్రతినిధి

హైదరాబాద్, సెప్టెంబర్ 14 (నమస్తే తెలంగాణ) : నేతి బీరకాయలో నెయ్యి లేనట్టుగానే.. పల్లెలకు రేవంత్ సర్కారు సంక్షేమ పథకాలు అందిస్తున్నట్టుగా చెప్తున్నదాంట్లో నిజం లేదనేందుకు ములుగు జిల్లా రామయ్యపల్లె నిదర్శనంగా నిలిచింది. ఈ ఊరిలో 80 రైతు కుటుంబాలు లోన్లు తీసుకుంటే కేవలం 25 కుటుంబాలకే రుణమాఫీ అయింది. 87 మంది రైతుల్లో కేవలం ముగ్గురికే సరిపడా యూరియా అందింది. 19 మంది రైతు కుటుంబాలకు 'భరోసా' దక్కలేదు. 79 మంది ఇందిరమ్మ ఇండ్ల కోసం దరఖాస్తు చేసుకుంటే ముగ్గురికే వచ్చాయి. 16 మహిళా సంఘం గ్రూపులుంటే ఒక్కదానికీ సున్నా వడ్డీ రుణాలు అందలేదు. రూ.500 గ్యాస్ సిలిండర్ అందుతున్నది కేవలం నాలుగు కుటుంబాలకేనని తేలింది. కాంగ్రెస్ ప్రభుత్వం చెప్తున్నదాంట్లో నిజమెంతో తెలుసుకునేందుకు గ్రామాన్ని యూనిట్‌గా తీసుకొని ఓ సామాజిక సంస్థ నిర్వహించిన సర్వేలో ఈ దారుణాలు బయటపడ్డాయి.

ఈ మారుమూల పల్లెనే సాక్ష్యం

ములుగు మండలం లక్నవరం అడవుల్లో విసిరేసినట్టుగా రామయ్యపల్లె ఉంటుంది. వంద ఇండ్ల గడప కలిగిన ఈ మారుమూల పల్లెలో గిరిజన తెగల ఆధిపత్యం ఉంటుంది. ఇక్కడివారికి వ్యవసాయమే జీవనాధారం. ఊరిలో ఓ ఔత్సాహిక రైతు.. పేరు డాక్టర్ భూక్యా అమర్‌సింగ్. 16 ఎకరాల ఆసామి. ఆర్థిక శాస్త్రంలో పీహెచ్‌డీ చేశారు. ఆయన పేరు మీద జంగాలపల్లి యూనియన్ బ్యాంక్‌లో రూ.1.90 లక్షల వ్యవసాయ రుణం ఉన్నది. లక్డోత్ రాజు, బానోతు సమయ్యకు కూడా బ్యాంకు లోన్ ఉన్నది. ముగ్గురూ కలిసి బ్యాంకు చుట్టూ రుణమాఫీ కోసం తిరగని రోజు లేదు. అమర్‌సింగ్ తల్లి భూక్యా రఖిలీ, సోదరుడి భార్య సునీత ఇద్దరూ మహిళా సంఘం సభ్యురాళ్లు. కాంగ్రెస్ అధికారంలోకి వచ్చిన 20 నెలల నుంచి సున్నా వడ్డీ రుణాల కోసం తిరుగుతూనే ఉన్నారు. ఇప్పటి వరకు రూపాయి కూడా రుణసాయం అందలేదు.. ఒక్క సునీతా, రఖిలీ మాత్రమే కాదు.. ఆ పల్లెకు చెందిన ప్రతి పొదుపు సంఘం మహిళ జంగాలపల్లి యూనియన్ బ్యాంకు చుట్టూ తిరుతూనే ఉన్నారు. కానీ సీఎం రేవంత్‌రెడ్డి రూ.2 లక్షల లోపు రైతులందరికీ రుణమాఫీ చేశామని, అడిగిందే తడవుగా మహిళలకు సున్నా వడ్డీ రుణాలు ఇస్తున్నామని పదే పదే ప్రకటిస్తున్న నేపథ్యంలో గ్రామానికి చెందిన బాధితులతో కలిసి ఓ సామాజిక సంస్థ క్షేత్రస్థాయిలో వాస్తవ పరిస్థితిని అంచనా వేయాలని నిర్ణయించింది. 20 నెలల్లో అందిన సంక్షేమ పథకాల వివరాలు సేకరించాలని సంకల్పించింది. 16 ప్రశ్నలతో కూడిన పత్రాన్ని రూపొందించి, 10 రోజులపాటు ఇల్లిల్లూ తిరిగి పూర్తి వివరాలు సేకరించింది. సమాచారాన్ని క్రోడీకరించి, వచ్చిన ఫలితాలను పరిశీలిస్తే ఈ పల్లెలో మళ్లీ పాత రోజులే కనిపించాయి. సమైక్య పాలన నాటి పరిస్థితులు కండ్ల ముందు కదలాడాయి. మూడు సార్లు రైతుభరోసా అందిన రైతు కుటుంబాలు కేవలం రెండంటే రెండే ఉండగా అసలు ఇప్పటి వరకు రైతు భరోసా అందనివి 19 కుటుంబాలున్నట్టు తేలింది. కేసీఆర్ హయాంలో వందకు వంద కుటుంబాలు.. ఉన్న ఊరులోనే సాగు చేసుకొని జీవనం సాగించగా కాంగ్రెస్ వచ్చిన తర్వాత 14 కుటుంబాలు భూములను కౌలుకిచ్చి వలస పోయినట్టు తేలింది. ఈ సర్వే రిపోర్టును డాక్టర్ అమర్‌సింగ్ 'నమస్తే తెలంగాణ'కు పంపారు.

80 మందిలో 25 మందికే రుణమాఫీ


కాశీందేవిపల్లి రెవెన్యూ గ్రామానికి రామయ్యపల్లె హామ్లెట్ విలేజ్‌గా ఉంటుంది. 295 హెక్టార్ల భూమి ఉన్నట్టు అంచనా. సరిగ్గా 103 కుటుంబాలు ఉన్న ఈ గ్రామంలో 76 కుటుంబాలు షెడ్యూల్డ్ తెగల కుటుంబాలు. 27 బీసీ యాదవ, కుర్మ కుటుంబాలు, ఒక్క ఎస్సీ కుటుంబం ఉన్నది. వీరిలో 87 కుటుంబాలకు ఎంతో కొంత వ్యవసాయ భూమి ఉన్నది. మిగిలిన కుటుంబాలు వ్యవసాయ కూలీ పనులు చేసుకుంటున్నాయి. వ్యవసాయం కాకుండా గొర్రెల పోషణ కనిపించింది. ఈ గ్రామంలో ఎంత మంది రైతులు లోన్లు తీసుకున్నారు? ఎంత మందికి రుణమాఫీ అయింది? అని పరిశీలించగా 80 రైతు కుటుంబాలు లోన్లు తీసుకున్నాయి. వీరిలో రూ.2 లక్షల లోపు రుణం ఉన్న రైతులు 54 మంది, ఆ పైన రుణం ఉన్నవారు 26 మంది ఉన్నారు. గ్రామం మొత్తం మీద రైతు రుణమాఫీ అయినవారు కేవలం 25 మందేనని తేలింది. ఇంకా 55 మంది రైతుల రుణాలు జంగాలపల్లి యూనియన్ బ్యాంకులోనే మూలుగుతున్నాయి.


భరోసా అందని రైతులు

19 మంది రైతు కుటుంబాలకు ఇప్పటి వరకు రైతు భరోసా దక్కలేదు. రాష్ట్ర ప్రభుత్వం ఇప్పటి వరకు మూడుసార్లు రైతు భరోసా వేసినట్టు ప్రకటించింది. అయితే కేవలం రెండు కుటుంబాలకే మూడు సార్లు రైతు భరోసా అందింది. రెండు పర్యాయాలు తీసుకున్న వాళ్లు 55.2%, కేవలం ఒకేసారి తీసుకున్న వాళ్లు 25.3% మాత్రమే ఉన్నట్టు లెక్క తేలింది. 87 మంది రైతుల్లో కేవలం ముగ్గురే క్యూలో నిలబడకుండా నేరుగా యూరియా తెచ్చుకున్నామని చెప్పారు. మిగిలిన 84 మంది రైతులు రోజుల తరబడి చెప్పులు వరుసలో పెట్టి నిలబడి యూరియా తెచ్చుకున్నామని వివరించారు.

ముగ్గురికే ఇందిరమ్మ ఇండ్లు

103 కుటుంబాలు ఉన్న రామయ్యపల్లిలో 62 కుటుంబాలు గుడిసెల్లోనే నివసిస్తున్నాయి. వీటిలో 18 గడ్డి గుడిసెలు. 44 ఇండ్లు గూనిపెంకలు, రేకుల కొట్టాలు. 79 మంది ఇందిరమ్మ ఇండ్ల కోసం దరఖాస్తు చేసుకున్నారు. కానీ కాంగ్రెస్ ప్రభుత్వం ముగ్గురికి మాత్రమే ఇండ్లు మంజూరు చేసింది. అట్లాగే 16 మహిళా సంఘం గ్రూపులు ఉండగా ఒక్క గ్రూప్‌కు కూడా సున్నా వడ్డీ రుణాలు అందలేదు. రూ 500 గ్యాస్ సిలిండర్ రెగ్యులర్‌గా పడుతున్నది కేవలం 4 కుటుంబాలకు మాత్రమే అని తేలింది. ఇక 20 నెలల నుంచి ఆరోగ్య శ్రీ పథకం వెసులుబాటును వాడుకున్న కుటుంబం ఒకే ఒక్కటని తేలింది. అదికూడా రూ.5 లక్షల లోపు సౌకర్యమే అందినట్టు స్పష్టమైంది.





ఓ సామాజిక సంస్థ నిర్వహించిన సర్వేలో కాంగ్రెస్ అధికారంలోకి వచ్చిన 20 నెలల్లో అందిన పథకాల అమలుపై వెల్లడైన నిజాలు

కాంగ్రెస్‌కు పల్లెల్లో ఎదురుగాలి

సర్కార్‌పై 60% మంది అసంతృప్తి

అన్నివర్గాల నుంచి తీవ్ర వ్యతిరేకత

- స్థానిక ఎన్నికల కోసం కాంగ్రెస్ పార్టీ తాజాగా నిర్వహించిన సర్వేలో వెల్లడి
- ఎన్నికలు పెడితే దెబ్బతింటామని భయం
- క్షేత్రస్థాయిలో మంత్రులకూ సేమ్‌సీన్
- ఓటమి భయంతోనే 'బీసీ' డ్రామా!
- 42% రిజర్వేషన్ బూచిగా చూపి వెనుకడుగు

హైదరాబాద్, సెప్టెంబర్ 14 (నమస్తే తెలంగాణ): తెలంగాణ వ్యాప్తంగా గ్రామీణ ప్రాంతాల్లో కాంగ్రెస్ సర్కారుకు ఎదురుగాలి వీస్తున్నది. ఆ పార్టీపై తీవ్ర వ్యతిరేకత వ్యక్తమవుతున్నది. ముఖ్యంగా రైతులు, యువత, మహిళల నుంచి వ్యతిరేకత ఉన్నదని తేలింది. ఇప్పటికిప్పుడు స్థానిక ఎన్నికలు జరిగితే కాంగ్రెస్ ఘోరంగా దెబ్బతింటున్నదని తేలింది. స్థానిక సంస్థల ఎన్నికలకు వెళ్లాలనే ఉద్దేశంతో ఇటీవల కాంగ్రెస్ నిర్వహించిన సర్వేలో ఆ పార్టీ నేతలకు కండ్లు బైర్లు కమ్మే చేదు నిజం వెల్లడైంది. గ్రామీణ ఓటర్లలో60% మంది కాంగ్రెస్ ప్రభుత్వంపై అసంతృప్తిని వ్యక్తంచేసినట్టు తెలిసింది. యూరియా కొరత, ఇందిరమ్మ ఇండ్ల వ్యవహారం, చిరుద్యోగుల వేతనాల పెండింగ్, అభివృద్ధి లోపాలు, ఆరు గ్యారెంటీలు, 420 హామీల ఉల్లంఘన వంటి కారణాలతో పల్లె ప్రజల నుంచి ఈ వ్యతిరేకత వస్తున్నది. ఈ అంశం రాష్ట్ర రాజకీయాల్లో కీలక మలుపు తీసుకుంటుందని కాంగ్రెస్ నేతలు భయపడినట్టు సమాచారం. క్షేత్రస్థాయిలో పరిశీలన జరిపిన మంత్రులు కూడా ఇప్పుడే స్థానిక పోరు వద్దని, వాయిదా వేయాలని రేవంత్‌కు సూచించినట్టు తెలిసింది. ఓటమి భయంతోనే కాంగ్రెస్ ప్రభుత్వం స్థానిక ఎన్నికలను వాయిదా వేస్తూ వస్తున్నట్టు విశ్లేషకులు సైతం చెప్తున్నారు. పైకి మాత్రం బీసీలకు 42% రిజర్వేషన్‌పై కట్టుబడి ఉన్నట్టు చెప్పుకుంటూ, మరోవైపు ఎన్నికలు నిర్వహించకుండా ప్రజాస్వామ్యాన్ని అపహాస్యం చేస్తున్నదని ఆరోపిస్తున్నారు.

1,31,883 బ్యాలెట్ బాక్సులు రెడీ

ప్రస్తుతం తెలంగాణలో 1.28 కోట్ల మంది ఓటర్లు, 12,760 గ్రామ పంచాయతీలు, 141 మున్సిపాలిటీలు, 7 మహానగరాలు సహా విస్తృతంగా స్థానిక సంస్థలు ఉన్నాయి. రాష్ట్ర ఎన్నికల కమిషన్ ఇప్పటికే గ్రామ పంచాయతీల వార్డుల వారీ ఓటర్ల తుది జాబితాను, పోలింగ్ స్టేషన్ల జాబితాను ఈ నెల రెండో తేదీనే విడుదల చేసింది. ఎంపీటీసీ, జడ్పీటీసీ స్థానాలకు సంబంధించిన పోలింగ్‌స్టేషన్లు, ఓటర్ల తుది జాబితాలను కూడా విడుదల చేసింది. విడతలవారీగా కాకుండా ఒకేసారి నిర్వహించేందుకు వీలుగా కూడా మహారాష్ట్ర, గుజరాత్ నుంచి బ్యాలెట్ బాక్సులను తెప్పించింది. రాష్ట్రంలో మొత్తం 1,31,883 బ్యాలెట్ బాక్సులను సిద్ధంగా పెట్టింది. ఓ వైపు రాష్ట్ర ఎన్నికల కమిషన్ నెల రోజుల్లో స్థానిక ఎన్నికల నిర్వహణను పూర్తిచేసేందుకు సర్వం సిద్ధంచేసి ఉంచింది. కాంగ్రెస్ సర్కారు స్థానిక పోరుకు ఎప్పుడు గ్రీన్‌సిగ్నల్ ఇస్తే అప్పుడు ఎన్నికల ప్రక్రియను ముగించేందుకు సిద్ధంగా ఉన్నది. కానీ, రేవంత్ సర్కార్ మాత్రం ఓటమి భయంతో స్థానిక ఎన్నికలను వాయిదా వేస్తున్నట్టు పరిశీలకులు అభిప్రాయపడుతున్నారు. బీసీలకు 42% రిజర్వేషన్ అంశాన్ని ముందు పెట్టి తప్పించుకుంటున్నారని అంటున్నారు.

పంచాయతీరాజ్ శాఖ ప్రొఫైల్

గ్రామీణ జిల్లాలు	31
జిల్లా పరిషత్‌లు	31
మొత్తం ఎంపీపీలు	565
గ్రామ పంచాయతీలు	12,760
ఎంపీటీసీ స్థానాలు	5,763
పంచాయతీ వార్డులు	1,12,534
గ్రామీణ జనాభా	1,97,68,543

కమీషన్ పనులకు పైసలుంటయ్

కాలేజీలకు ఇవ్వరా?

మొదటిపేజీ తరువాయి...

వ్యక్తంచేశారు. రెండేండ్లుగా ఫీజు రీయింబర్స్‌మెంట్ విడుదలచేయాలని కాలేజీ యాజమాన్యాలు ఎన్ని విజ్ఞప్తులు చేసినా.. రేవంత్‌రెడ్డి సర్కారు బకాయిలు విడుదల చేయకపోవడం సిగ్గుచేటని మండిపడ్డారు. ప్రగతిశీల ప్రజాస్వామ్య విద్యార్థి సంఘం (పీడీఎస్‌యూ) రూపొందించిన 'బిగ్‌డిబేట్' వాల్‌పోస్టర్‌ను ఆదివారం ఆయన తన నివాసంలో ఆవిష్కరించారు. ఈ సందర్భంగా హరీశ్‌రావు మాట్లాడుతూ.. కాంగ్రెస్ ప్రభుత్వ నిర్లక్ష్యం వల్ల రాష్ట్రవ్యాప్తంగా ఇంజినీరింగ్, ఫార్మసీ, ఎంబీఏ, ఎంసీఏ, బీఈడీతోపాటు డిగ్రీ, పీజీ వంటి విద్యాసంస్థలు మూతపడే పరిస్థితి వచ్చిందని పేర్కొన్నారు. సెమిస్టర్ పరీక్షలను వాయిదా వేసే పరిస్థితి వస్తున్నదంటే, విద్యాశాఖ మంత్రిగా కొనసాగుతున్న సీఎం ఏం చేస్తున్నట్టు? అని ప్రశ్నించారు. బకాయిలు విడుదల చేయకపోవడంతో సోమవారం నుంచి నిరసనలు, నిరాహార దీక్షలు, నిరవధిక బంద్‌లు చేయనున్నట్టు యాజమాన్యాలు ప్రకటించినా ప్రభుత్వం ఎందుకు నోరు మెదపడం లేదని నిలదీశారు. 'అల్లరి చేయొద్దు' అని ఆర్థిక శాఖ మంత్రి సుద్దులు చెప్పినంత మాత్రాన యాజమాన్యాల, విద్యార్థుల గోడు తీరదు కదా అని పేర్కొన్నారు. ఉద్యోగులకు జీతాలు, విద్యార్థులకు ఫీజు బకాయిలు ఇవ్వడానికి లేని డబ్బులు ముఖ్యమంత్రికి కమీషన్ల ప్రాజెక్టులకు ఎలా వస్తున్నాయి, రూ.లక్షల కోట్ల టెండర్లు ఎలా పిలుస్తున్నారని ప్రశ్నించారు.

ఫ్యూచర్‌సిటీకి రూ.20వేల కోట్ల టెండర్లు

ఒకవైపు కాళేశ్వరం కూలిందంటూనే మరోవైపు, మల్లన్నసాగర్ నుంచి మూసీలో గోదావరి నీళ్లు నింపేందుకు రూ.7,000 కోట్ల టెండర్లు ఎలా పిలుస్తున్నారని హరీశ్‌రావు ప్రశ్నించారు. డబ్బులు లేవంటూనే జీహెచ్ఎంసీలో హైలెవల్ బ్రిడ్జీలు, ఫ్లైఓవర్ల నిర్మాణానికి రూ.7,000 కోట్లు, ఫ్యూచర్‌సిటీలో ఆరు లైన్ల రోడ్డు కోసం రూ.5,000 కోట్లు, హెచ్ఎండీఏలో రూ.10,000 కోట్లు, ఆర్ అండ్ బీలో రూ.16 వేల కోట్లు, గురుకులాలను గాలికి వదిలి, రూ.25,000 కోట్లతో ఇంటిగ్రేటెడ్ స్కూళ్లకు టెండర్లు ఎలా పిలుస్తున్నారని నిలదీశారు. కొడంగల్ లిఫ్ట్ ఇరిగేషన్ పేరుతో రూ.4,400 కోట్ల టెండర్లు, మూసీ సుందరీకరణకు రూ.1.5 లక్షల కోట్ల టెండర్లు.. ఈ విధంగా కమీషన్లు దండుకునేందుకు రూ.2.5 లక్షల కోట్లకు టెండర్లు పిలుస్తున్న రేవంత్‌రెడ్డి ప్రభుత్వానికి విద్యార్థుల చదువుల పట్ల శ్రద్ధ లేదా? విద్యాసంస్థలు ఎదుర్కొంటున్న ఇబ్బందుల పట్ల ఆలోచన లేదా? అని ఆగ్రహం వ్యక్తంచేశారు.

మాట తప్పిన సర్కార్

ఫీజు బకాయిల విషయంపై అసెంబ్లీలో తాను ప్రభుత్వాన్ని నిలదీస్తే.. విడతల వారీగా వాటిని విడుదల చేస్తామని, ఏ ఏడాదికి, ఆ ఏడాది క్లియర్ చేస్తామని చెప్పిన కాంగ్రెస్ ప్రభుత్వం, సిగ్గు లేకుండా ఇప్పుడు మాట తప్పిందని హరీశ్‌రావు మండిపడ్డారు. బీఆర్ఎస్ ప్రభుత్వ హయాంలో పెద్దనోట్ల రద్దు, కరోనా వంటి ఎన్నో సవాళ్లు ఎదురైనప్పటికీ, విద్యార్థుల ఫీజు రీయింబర్స్‌మెంట్ ఆపలేదని చెప్పారు. తొమ్మిదిన్నరేండ్ల కేసీఆర్ పాలనలో రూ.20 వేల కోట్లు ఫీజు బకాయిల కింద చెల్లించినట్టు వివరించారు. కాంగ్రెస్ అధికారంలోకి వచ్చాక పరిస్థితులు తారుమారయ్యాయని దుయ్యబట్టారు. పెద్ద మొత్తంలో ఫీజు బకాయిలు పేరుకుపోవడంతో కాలేజీలు నడిపించలేని దుస్థితి వచ్చిందని, ఇప్పటికే రాష్ట్రంలో సగానికిపైగా జూనియర్, డిగ్రీ కాలేజీలు మూతపడ్డాయని ఆవేదన వ్యక్తంచేశారు.

కరెంట్, వాటర్ బిల్లులు కట్

సకాలంలో బిల్లులు చెల్లించకపోవడంతో కరెంట్, వాటర్ కనెక్షన్లను కట్ చేస్తున్నారని, ఉద్యోగులకు జీతాలు ఇవ్వలేక యాజమాన్యాలు ఇబ్బందిపడుతున్నాయని హరీశ్‌రావు పేర్కొన్నారు. ఒకవైపు ఫీజు రీయింబర్స్‌మెంట్ రాక, మరోవైపు బకాయిలు పేరుకుపోవడంతో విద్యార్థులకు సర్టిఫికెట్లు ఇవ్వడం లేదని, సర్టిఫికెట్ల కోసం విద్యార్థులు కోర్టుల చుట్టూ తిరగాల్సిన దుస్థితి వచ్చిందని ఆందోళన వ్యక్తంచేశారు. కాంగ్రెస్ ప్రభుత్వ చేతగాని విధానాల వల్ల రాష్ట్రంలో విద్యావ్యవస్థ కుప్పకూలుతుంటే, సీఎం రేవంత్ మాత్రం అసెంబ్లీ సాక్షిగా ప్రభుత్వ పాఠశాలల్లో రెండు లక్షల మంది విద్యార్థులు పెరిగారంటూ పచ్చి అబద్ధాలు మాట్లాడారని దుయ్యబట్టారు. యూడైస్ ప్రకారం.. ఈ విద్యా సంవత్సరంలో ప్రభుత్వ పాఠశాలల్లో 47 వేల మంది విద్యార్థులు తగ్గినట్టు తెలిపారు. కేసీఆర్‌పై కక్షతో గురుకులాలను, ఫీజు బకాయిలు చెల్లించకుండా ఉన్నత విద్యా సంస్థలను నిర్వీర్యం చేస్తున్నారని మండిపడ్డారు. కాంట్రాక్టర్లకు బిల్లులు చెల్లించి, కమీషన్లు పొందడంపై ఉన్న శ్రద్ధ.. బకాయిలు చెల్లించడంపై లేదని దుయ్యబట్టారు. ఈ ప్రభుత్వానికి కమీషన్లు దండుకోవడంపై ఉన్న ధ్యాస, విద్యా కమిషన్ ఇచ్చిన రిపోర్టుపై లేదని, విద్యా కమిషన్ చేష్టలుడిగి చూస్తుండటం దారుణమని పేర్కొన్నారు.

నేటి నుంచి కాలేజీల బంద్

- 23 లేదా 24న 'చలో హైదరాబాద్'
- లక్షలాది మంది విద్యార్థులతో మార్చ్
- తాళాలు తియ్యం, పరీక్షలు పెట్టం
- రీయింబర్స్‌మెంట్ బకాయిలు విడుదలయ్యే వరకు పోరాటం
- తేల్చిచెప్పిన ప్రైవేట్ కాలేజీ యాజమాన్యాలు



హైదరాబాద్‌లోని మాసబ్‌ట్యాంక్‌లో సమావేశమైన ఫతి ప్రతినిధులు

హైదరాబాద్, సెప్టెంబర్ 14 (నమస్తే తెలంగాణ) : ఫీజు రీయింబర్స్‌మెంట్ బకాయిల విడుదలపై సర్కారుతో తాడేపేడో తేల్చుకునేందుకు ప్రైవేట్ కాలేజీ యాజమాన్యాలు రెడీ అయ్యాయి. పోరాటాన్ని మరింత ఉధృతం చేయాలని నిర్ణయించాయి. సోమవారం నుంచి కాలేజీల నిరవధిక మూసివేత విషయంలో వెనక్కి తగ్గబోమని ప్రకటించాయి. సర్కారు దిగిరాకపోతే ఈనెల 23 లేదా 24న 'చలో హైదరాబాద్' నిర్వహిస్తామని హెచ్చరించాయి. లక్షలాది మంది విద్యార్థులతో హైదరాబాద్‌లో మార్చ్‌తో కదం తొక్కుతామని ప్రకటించాయి. ఫెడరేషన్స్ ఆఫ్ అసోసియేషన్స్ ఆఫ్ తెలంగాణ హయ్యర్ ఇన్‌స్టిట్యూషన్స్(ఫతి) సర్వసభ్య సమావేశాన్ని ఆదివారం హైదరాబాద్‌లో నిర్వహించారు. సర్కారు నుంచి ఎలాంటి స్పష్టతలేకపోవడంతో ఎగ్జిక్యూటివ్ కమిటీ ఆదివారం అత్యవసరంగా సమావేశమయ్యింది. మాసాబ్‌ట్యాంక్‌లోని ఫైన్ ఆర్ట్స్ కాలేజీలో ప్రెస్‌మీట్ నిర్వహించింది.

సంక్షోభానికి సర్కారుదే బాధ్యత

కాలేజీల ప్రతినిధులు సర్కారు వైఖరిని తీవ్రంగా నిరసించారు. బకాయిలను విడుదల చేయాలని పదే పదే కోరినా.. ప్రభుత్వం తమతో సమావేశమయ్యేందుకు మాత్రమే ఆహ్వానించిందని, సంక్షోభానికి పూర్తి బాధ్యత ప్రభుత్వానిదేనని ఫతి ప్రతినిధులు ప్రకటించారు. బకాయిలు విడుదల చేసే వరకు నిరవధిక బంద్ కొనసాగుతుందని వెల్లడించారు. తాము కార్యాచరణ ప్రకటించినా సర్కారు ఫీజు రీయింబర్స్‌మెంట్ బకాయిల విడుదలపై స్పష్టత ఇవ్వకపోవడంతో యాజమాన్యాలు ఫైర్ అయ్యాయి. డిమాండ్లు నెరవేర్చే వరకు కార్యాచరణపై వెనక్కి తగ్గొద్దని నిర్ణయించాయి. సోమవారం నుంచి అన్ని కాలేజీలకు తాళాలేస్తామని, విద్యార్థులెవరు రావొద్దని కోరాయి. ఇంజినీరింగ్ ఇంటర్నల్, బీఈడీ, బీఫార్మసీ సెమిస్టర్ పరీక్షలకు సహకరించబోమన్నాయి. 15న ఇంజినీర్స్‌డేను బ్లాక్‌డేగా పాటించనున్నట్టు వెల్లడించాయి. ఫతి సెక్రటరీ జనరల్ కేవీ రవికుమార్, కోశాధికారి కృష్ణారావు, సునీల్‌కుమార్, రాందాస్ తదితరులు ప్రెస్‌మీట్‌లో పాల్గొన్నారు.

పాత బకాయిలతో మాకేం సంబంధమనడం దారుణం

గత ప్రభుత్వ బకాయిలతో తమకేం సంబంధమంటూ కొందరు మంత్రులు మాట్లాడారు. ఇది అత్యంత దారుణం. ఇలాంటి తప్పుడు ప్రకటనలు చేయడం మరింత బాధించాయి. కాంట్రాక్టర్లు, సంక్షేమ పథకాల కోసం చాలా మంది ప్రభుత్వాన్ని బెదిరించి డబ్బులు తీసుకెళ్లారు. ఒక్క కాలేజీ యాజమాన్యాలు మాత్రమే మౌనం వహించాయి. ప్రభుత్వం డబ్బులివ్వాల్సిన అవసరం లేకుండా ట్రస్ట్ బ్యాంక్‌ను ఏర్పాటు చేయాలని కోరాం. ఈ ప్రతిపాదనను ప్రభుత్వం పట్టించుకోకపోవడం దారుణం. ఏడాది క్రితం ట్రెజరీల ద్వారా టోకెన్లు విడుదలయ్యాయి. కానీ డబ్బులు విడుదల చేయకపోవడం ప్రభుత్వానికే అవమానకరం. టోకెన్లు జారీఅయిన వాటికి రీయింబర్స్‌మెంట్ బకాయిలు విడుదల చేయాలి. అంతవరకు మా పోరాటం కొనసాగుతుంది.

– నిమ్మటూరి రమేశ్‌బాబు, ఫతి, చైర్మన్

డిమాండ్లు

- ఏడాది క్రితం విడుదలైన టోకెన్లకు సంబంధించి ప్రొఫెషనల్ కాలేజీల బకాయిలు 1,200కోట్లు, డిగ్రీ కాలేజీ బకాయిలు 500 కోట్లు 21లోపు విడుదల చేయాలి.
- అక్టోబర్ 31లోపు 50%, డిసెంబర్ 31లోపు మిగతా 50% పాత బకాయిలు విడుదల చేయాలి.
- ట్రస్టు బ్యాంక్ ఏర్పాటుపై అక్టోబర్ 31 లోపు ఫీజిబిలిటీ రిపోర్ట్ విడుదల చేయాలి.
- 2025–26 విద్యాసంవత్సరానికి కొత్త ఫీజు రీయింబర్స్‌మెంట్ ఫీజులను రెండు, మూడు ఇన్‌స్టాల్‌మెంట్లల్లో ఇచ్చేలా స్పష్టమైన విధానాన్ని ఖరారుచేస్తూ డిసెంబర్ 31లోపు జీవో జారీచేయాలి.
- 2025–26 విద్యాసంవత్సరం ఫీజు రీయింబర్స్‌మెంట్ బకాయిలను 2026 మార్చి 31లోపు విడుదలచేయాలి.
- 2026 అడ్మిషన్ పాలసీ, రీయింబర్స్‌మెంట్, ఫీజుల ఖరారు అంశాలను ప్రభుత్వం పరిష్కరించాలి.

బంద్‌కు ఏఐఎస్ఎఫ్ మద్దతు

ప్రైవేట్ కళాశాలల నిరవధిక బంద్‌కు ఏఐఎస్ఎఫ్ తెలంగాణ రాష్ట్ర సమితి సంపూర్ణ మద్దతు ప్రకటిస్తున్నట్టు రాష్ట్ర అధ్యక్షుడు కసిరెడ్డి మణికంఠరెడ్డి, ప్రధాన కార్యదర్శి పుట్ట లక్ష్మణ్ తెలిపారు. ఫీజు బకాయిల విడుదలపై కాంగ్రెస్ ప్రభుత్వం నిర్లక్ష్యం చేస్తుందని, పథకాన్ని ఎత్తివేసే కుట్ర చేస్తుందని ఆరోపించారు.

317 జీవో అమలులో అవకతవకలు

- రగులుతున్న గురుకుల ఉద్యోగులు
- ఇష్టారీతిన ఉద్యోగుల బదిలీలు
- తప్పలను సవరించాలని డిమాండ్
- లేదంటే ఉద్యమ కార్యాచరణ తప్పదని ప్రభుత్వానికి హెచ్చరిక
- 25న బస్సు యాత్ర చేపట్టాలని ఎస్సీ గురుకుల సొసైటీ నిర్ణయం

హైదరాబాద్, సెప్టెంబర్14 (నమస్తే తెలంగాణ): ఎస్సీ గురుకుల సొసైటీ పరిధిలో 317 జీవో అమలులో భాగంగా అనేక లోపాలు చోటుచేసుకున్నాయి. ప్రభుత్వ మార్గదర్శకాలను సొసైటీ ఉన్నతాధికారులు పూర్తిగా తుంగలో తొక్కారు. ఆ లోపాలను సవరించాలని ఉద్యోగులు చేసిన వినతులు సైతం బుట్టదాఖలయ్యాయి. ఫలితంగా ఎందరో ఉద్యోగులు అన్యాయానికి గురై అవస్థలు పడుతున్నారు. అయినా రాష్ట్ర ప్రభుత్వం, ఇటు సొసైటీ ఉన్నతాధికారులు స్పందించడమే లేదని గురుకుల సొసైటీ ఉద్యోగులు మండిపడుతున్నారు. తక్షణమే స్పందించకుంటే త్వరలో భవిష్యత్తు కార్యాచరణ ప్రకటిస్తామని ఉద్యోగ, ఉపాధ్యాయులు హెచ్చరిస్తున్నారు. ప్రభుత్వం 317 జీవోలో భాగంగా మెడికల్, స్పౌజ్, మెడికల్ క్యాటగిరీల్లో బదిలీలకు వేర్వేరుగా గతంలో అనుమతులను జారీచేసింది. 317 జీవో అమలు చేయాలంటే ఒక కచ్చితమైన కమిటీని ఏర్పాటు చేయాలి. ఆ కమిటీకి అధికారిగా ఆ శాఖ ప్రిన్సిపల్ సెక్రటరీ ఉండాలి. ఎస్సీ గురుకుల సొసైటీ వాటిని పాటించనేలేదు. బదిలీల్లో భాగంగా సొసైటీ పరిధిలో 130 మంది ఉద్యోగులు 317 జీవోకు దరఖాస్తు చేసుకున్నారు. అనేక మంది దరఖాస్తు చేసుకునేందుకు అవకాశం కల్పించలేదని తెలుస్తున్నది. ప్రభుత్వ మార్గదర్శకాలను సొసైటీ పాటించలేదని, లోపాలున్నాయని, వాటిని పునఃసమీక్షించాలని గతంలో ఆర్థికశాఖ కూడా పలుమార్లు తిరస్కరించింది. అయినా సొసైటీ ఉన్నతాధికారులు అదే నిర్లక్ష్యం వహించారు.

ఇష్టారాజ్యంగా బదిలీలు

317 జీవోకు సంబంధించి బదిలీల్లో సీనియర్లను వదిలి జూనియర్లకుప్రాధాన్యం ఇస్తూ ఎస్సీ గురుకుల సొసైటీ ఉన్నతాధికారులు ఇష్టారాజ్యంగా వ్యవహరించారు. చివరి నిమిషం వరకూ 130 మందిలో కేవలం కొద్దిమందినే సొసైటీ బదిలీ చేసింది. స్పౌజ్ క్యాటగిరీలో 81 మందికి, మెడికల్ గ్రౌండ్‌లో ఆరుగురిని బదిలీ చేశారు. అందులోనూ సీనియర్ల, రోస్టర్ పాయింట్లలో ముందున్న వారిని కాదని జూనియర్లకు అవకాశం కల్పించారని అప్పుడే ఆరోపణలొచ్చాయి. మిగతా దరఖాస్తుల పరిస్తితి ఏమిటన్నది ఇప్పటికీ తెలియడమే లేదు. ప్రజాభవన్‌లో ఫిర్యాదు చేసినా ఫలితం లేకుండా పోయిందని బాధిత టీచర్లు కన్నీటి పర్యంతమవుతున్నారు. అర్హత ఉన్న అందరికీ ప్రభుత్వం న్యాయం చేయాలని డిమాండ్ చేస్తున్నారు. లేదంటే తీవ్ర పరిణామాలు ఎదుర్కోక తప్పదని ప్రభుత్వాన్ని, సొసైటీ ఉన్నతాధికారులను హెచ్చరించారు.

25 నుంచి బస్సుయాత్ర

అవకతవకలను సవరించాలని డిమాండ్ చేస్తూ ఉద్యోగులు ఈ నెల 25 నుంచి బస్సు యాత్ర చేపట్టాలని నిర్ణయించారు. టిగారియా జనరల్ సెక్రటరీ సెంట్రల్ యూనియన్ డాక్టర్ మధుసూదన్ నేతృత్వంలో గురుకుల టీచర్లు ఆ యూనియన్ కార్యాలయంలో ఆదివారం ప్రత్యేకంగా సమావేశమయ్యారు. 317 జీవో అమలులో జరిగిన అవకతవకలను ప్రభుత్వ పెద్దలు, టీచర్ ఎమ్మెల్సీలు, రాజకీయ పార్టీల రాష్ట్ర అధ్యక్షుల దృష్టికి తీసుకెళ్లాలని నిర్ణయించారు. 25న 150 మంది టీచర్లతో బస్సుయాత్ర నిర్వహించాలని సమావేశంలో తీర్మానించారు.

పూటకో పార్టీ మారితే ఐదుసార్లు ఎమ్మెల్యే అయ్యే వాడిని!

మంత్రి సురేఖ వ్యాఖ్యలపై ఎమ్మెల్యే నాయిని కౌంటర్



వరంగల్/ నయీంనగర్, సెప్టెంబర్ 14 : పూటకో పార్టీ మారితే తాను కూడా ఐదుసార్లు ఎమ్మెల్యే అయ్యేవాడినని వరంగల్ పశ్చిమ ఎమ్మెల్యే నాయిని రాజేందర్‌రెడ్డి పేర్కొన్నారు. ఆదివారం కార్పొరేటర్ల స్టడీ టూర్ బస్సులను గ్రేటర్ వరంగల్ మున్సిపల్ కార్పొరేషన్ వద్ద ప్రారంభించిన అనంతరం ఎమ్మెల్యే రాజేందర్‌రెడ్డి మంత్రి సురేఖ వ్యాఖ్యలపై ఘాటుగా స్పందించారు. అవకాశవాద రాజకీయాలు చేయడం తనవల్ల కాదని, ఇచ్చిన మొదటి అవకాశాన్ని వినియోగించుకొని ఎమ్మెల్యేగా గెలిచానని చెప్పారు. 40 ఏండ్లుగా పార్టీ కోసమే పని చేశానని పేర్కొన్నారు. తన నియోజకవర్గ పరిధిలో ఉన్న భద్రకాళీ దేవాలయంపై మంత్రి పెత్తనమేమిటని మండిపడ్డారు. మంత్రి నియోజకవర్గం నుంచే ఏడుగురిని నియమిస్తే ఎలా అని ప్రశ్నించారు. మంత్రి స్థాయిలో ఉండి వ్యంగ్యంగా మాట్లాడటం, అదృష్టం కొద్దీ గెలిచారని అనడం సరైందికాదన్నారు.

రాజగోపాల్‌రెడ్డిపై ఫిర్యాదు అందలేదు

ఫిర్యాదు వస్తే చర్యల కోసం పరిశీలిస్తాం : మల్లు రవి

హైదరాబాద్, సెప్టెంబర్ 14 (నమస్తే తెలంగాణ) : సొంత పార్టీపై సంచలన వ్యాఖ్యలు చేస్తున్న మునుగోడు ఎమ్మెల్యే కోమటిరెడ్డి రాజగోపాల్‌రెడ్డిపై చర్యలు తీసుకునేందుకు క్రమశిక్షణ సంఘం వెనకాడుతున్నట్టుగా కనిపిస్తున్నది. ఆయన పై పార్టీకి గానీ, క్రమశిక్షణ సంఘానికిగానీ ఎలాంటి ఫిర్యాదు అందలేదని, అందుకే ఆయన విషయాన్ని పట్టించుకోవడం లేదని క్రమశిక్షణ సంఘం చైర్మన్ మల్లు రవి తెలిపారు. ఆదివారం గాంధీభవన్‌లో క్రమశిక్షణ కమిటీ సమావేశం జరిగింది. ఈ సందర్భంగా రాజగోపాల్‌రెడ్డిపై చర్యలు ఎందుకు తీసుకోవడం లేదని విలేకరులు ప్రశ్నించగా.. ఆయనపై తమకు ఫిర్యాదు అందలేదని, ఫిర్యాదు వస్తే పరిశీలించి చర్యలు తీసుకుంటామని స్పష్టంచేశారు.

యునెస్కో తాత్కాలిక వారసత్వ జాబితాలో
తిరుమల కొండలు

భారత్ నుంచి ఏడు ప్రదేశాలకు చోటు



న్యూఢిల్లీ: యునెస్కో తాత్కాలిక ప్రపంచ వారసత్వ ప్రదేశాల జాబితాలో మన దేశం నుంచి ఏడు ప్రదేశాలకు చోటు లభించింది. ఆంధ్రప్రదేశ్‌లోని తిరుమల కొండలు, ఎర్ర మట్టి దిబ్బలు (విశాఖ పట్నం), కర్ణాటక ఉడుపిలోని సెయింట్ మేరీ ఐస్ ల్యాండ్ క్లస్టర్, మేఘాలయాలోని తూర్పు ఖాసి కొండల్లోని పురాతన గుహలు, నాగాలాండ్‌లోని ఓఫియోలైట్(సముద్రం అడుగులోని శిలల క్రమం), మహారాష్ట్ర పంచగని, మహాబలేశ్వర్‌లోని దక్కన్ ట్రాప్స్(లావా నిక్షేపాలతో ఏర్పడిన ప్రాంతం), కేరళ తీరంలోని సహజమైన వర్కల(ఎర్ర లాటరైట్ కొండలు) ఈ జాబితాలో ఉన్నాయి. వీటిని యునెస్కో ప్రపంచ వారసత్వ ఆస్తుల జాబితాలో చేర్చినట్టు అధికారులు తెలిపారు. ఈ ఆస్తులను(ప్రదేశాలను) జాబితాలో చేర్చడం వల్ల వాటి పరిరక్షణ మరింత బలోపేతం అవుతుందని పేర్కొన్నారు. ఈ మేరకు ఈ నెల 12న ఆ ఏడు ఆస్తులను యునెస్కో ప్రపంచ వారసత్వ తాత్కాలిక జాబితాలో చేర్చినందుకు సంతోషంగా ఉందని తెలిపారు. వీటితో తాత్కాలిక జాబితాలో ఉన్న భారతీయ ఆస్తుల సంఖ్య 69 చేరిందని వెల్లడించారు. ప్రపంచ వారసత్వ జాబితాలో చేర్చే ముందు తాత్కాలిక జాబితాలో చేర్చడం తప్పనిసరి పేర్కొన్నారు. దీనికి సహకరించినందుకు భారత పురావస్తు సర్వే సంస్థకు కృతజ్ఞతలు తెలియజేశారు.

రక్తంతో చేతులు తడిచిన వారితో
క్రికెట్ మ్యాచా?

- పాక్‌తో మ్యాచ్‌పై పహల్గాం బాధిత కుటుంబాల ఆగ్రహం
- 26 మంది ప్రాణాల కన్నా డబ్బు ఎక్కువా: ఒవైసీ



టీవీలను బద్దలు కొడుతున్న శివసేన కార్యకర్తలు

ముంబై, సెప్టెంబర్ 14: ఆసియా కప్‌లో ఆదివారం భారత్ క్రికెట జట్టు దుబాయ్‌లో పాకిస్థాన్‌తో క్రికెట్ మ్యాచ్ ఆడటం పట్ల దేశ వ్యాప్తంగా మిశ్రమ స్పందన వ్యక్తమైంది. పలు చోట్ల భారత్ విజయాన్ని కాంక్షిస్తూ పూజలు చేయగా, పహల్గాం దాడి తర్వాత తొలిసారిగా పాకిస్థాన్‌తో మన దేశ జట్టు క్రికెట్ మ్యాచ్ ఆడటం పట్ల పలువురు తీవ్ర అభ్యంతరం వ్యక్తం చేశారు. పహల్గాం దాడి బాధిత కుటుంబాలు సహా పలువురు మాట్లాడుతూ రక్తంతో చేతులు తడిచిన వారితో మనం క్రికెట్ మ్యాచ్ ఆడుతున్నామని విమర్శించారు. పహల్గాం దాడిలో అసువులు బాసిన 26 మంది పౌరుల ప్రాణాల కన్నా ఈ ఆట ద్వారా ఆర్జించే ధనం ఎక్కువా? అని హైదరాబాద్ ఎంపీ అసదుద్దీన్ ఒవైసీ ప్రశ్నించారు. మహారాష్ట్రలో శివసేన (ఉద్ధవ్ ఠాక్రే) ఆధ్వర్యంలో పలువురు కార్యకర్తలు టీవీలను బద్దలు కొట్టి తమ నిరసనను వ్యక్తం చేశారు. పలువురు మహిళలు ప్రధాని నరేంద్ర మోదీకి సిందూర్ (కుంకుమ)ను పంపడమే కాక, డబ్బులు లేని బీసీసీఐకు విరాళాలు ఇవ్వాలంటూ కోరారు. కాగా, మ్యాచ్‌ను నిలిపివేయాలంటూ ఫెడరేషన్ ఆఫ్ వెస్టన్ సినీ ఎంప్లాయిస్ ప్రధాని మోదీకి విజ్ఞప్తి చేసింది.

జీఎస్టీ 2.0తో పేదలపై
మరింత భారం!

- మధ్య, అల్పాదాయ వర్గాలపై తీవ్ర ప్రభావం
- ఆర్థిక కష్టాలు మరింత అధికం
- విద్య, ఆరోగ్య రంగాలపై ఒత్తిడి
- జీఎస్టీతో ఇప్పటికే పెరిగిన ఖర్చులు, తగ్గిన పొదుపు
- పీడబ్ల్యూసీ ఇండియా తాజా సర్వే వెల్లడి



న్యూఢిల్లీ, సెప్టెంబర్ 14: ప్రస్తుతమున్న జీఎస్టీని సవరించి జీఎస్టీ 2.0 తీసుకువస్తున్నామని, దీని ద్వారా ప్రజలపై భారం తగ్గించామని, ఇది ప్రజలకు దీపావళి బొనంజాయే అని కేంద్రం గొప్పగా చెబుతున్నా, వాస్తవ పరిస్థితులు దానికి పూర్తి విరుద్ధంగా ఉన్నాయి. ఈ నెల 22 నుంచి అమలులోకి రానున్న వస్తు, సేవల పన్ను (జీఎస్టీ) తగ్గింపు భారత వినియోగదారులకు ఎంతో ఉపశమనం కలిగిస్తుందని జీఎస్టీ కౌన్సిల్ ప్రకటించినప్పటికీ ప్రజల పరిస్థితి అలా కనిపించడం లేదు. ఈ ఏడాది ప్రారంభంలోనే ఆహార పదార్థాల కొనుగోలు మినహా ఇతర ఖర్చులకు డబ్బులు వెచ్చించేందుకు చాలా మంది వినియోగదారులు తగినంత సొమ్మును కూడబెట్టలేకపోయారని ఒక నివేదిక హెచ్చరించింది. ఆహార పరిశ్రమపై దృష్టి సారించిన పీడబ్ల్యూసీ ఇండియా ఇందుకు సంబంధించిన వాయిస్ ఆఫ్ కన్స్యూమర్ 2025 నివేదికను ఈ నెల 11న విడుదల చేసింది. ఈ నివేదిక ప్రకారం ప్రస్తుతం అమలవుతున్న జీఎస్టీని 32 శాతం మంది తాము ఆర్థికంగా తట్టుకుంటున్నామని చెప్పగా, మరో 7 శాతం మంది తాము ఆర్థికంగా అభద్రతతో ఉన్నామని చెప్పారు.

బియ్యం, కూరగాయల కొనుగోలుకే 40 శాతం పరిమితం

జీఎస్టీ 2.0 (కొత్త పన్ను విధానం) అమలు కాక ముందే ప్రజలలో ఒక వర్గం (40 శాతం మంది) తమ ఆదాయంలో కేవలం బియ్యం, పప్పులు, కూరగాయలు, నిత్యావసర ఆహార సరుకులు కొనుగోలు చేయడానికే సరిపోయేదని వెల్లడించారు. అంటే ఇతర ఖర్చులైన విద్య, దుస్తులు, ప్రయాణాలకు డబ్బు వెచ్చించేందుకు వీలు కాకపోవడం కన్పించింది. ఆదాయ స్థాయి తక్కువగా ఉండటం, ఉద్యోగాల స్థిరత్వం లేకపోవడం వంటివి దీనికి ప్రధాన కారణాలుగా పేర్కొనవచ్చు. అయితే ఆహార వస్తువుల ధరలు పెరగడం వల్ల ప్రజలు 'ఫుడ్ షాపింగ్'కే పరిమితమయ్యారు. దీంతో జీఎస్టీ 2.0 రాకముందే ఈ పరిస్థితి ఉంటే కొత్త పన్ను విధానం తర్వాత ధరల పెరుగుదల, ఖర్చుల భారం మరింత ప్రభావం చూపే అవకాశం ఉంది. ముఖ్యంగా మధ్య తరగతి, తక్కువ ఆదాయం కలిగిన కుటుంబాలపై ఇది తీవ్రమైన ప్రభావం చూపుతుందని సర్వే సూచిస్తోంది. మొత్తం మీద జీఎస్టీ 2.0 అమలుకు ముందు కూడా సుమారు 40 శాతం వినియోగదారులు కేవలం ఆహార అవసరాలను తీర్చుకోవడానికే పోరాడుతున్నారని సర్వే చూపిస్తున్నది.

జీఎస్టీ 2.0 అమలైతే అదనపు భారం ఇలా...

కొత్త జీఎస్టీని ఇప్పుడు కేవలం 5 శాతం, 18 శాతం శ్లాబ్‌లకే పరిమితం చేశారు. దీంతో కొన్ని వస్తువుల ధరలు పెరుగుతుండగా, మరి కొన్ని తగ్గనున్నాయి. జీఎస్టీ 2.0లో పన్ను రేట్లు పెరిగితే వస్తువుల ధరలు కూడా పెరుగుతాయి. ముఖ్యంగా నిత్యావసరాలు, కిరాణా, ఆహార పదార్థాలు, విద్యుత్ బిల్లులు వంటివి అదనపు భారం అవుతాయి. ఫలితంగా సాధారణ ప్రజల జీవన వ్యయం పెరుగుతుంది. ఇప్పటికే 40 శాతం ప్రజలు ఆహారం కొనుగోలు చేయడానికే ఇబ్బంది పడుతున్నారని తాజా సర్వే చెబుతోంది. జీఎస్టీ 2.0తో ధరలు పెరగడంతో విద్య, ఆరోగ్యం, దుస్తులు, ప్రయాణం వంటి వాటిపై ప్రజల ఖర్చులు మరింత తగ్గిపోతాయి. అంటే ఇకపై విలాస, స్వేచ్ఛాపూరిత ఖర్చులు పూర్తిగా తగ్గిపోతాయి. పన్ను పెరుగుదల అన్ని వర్గాలపైనా ఎక్కువగానే ప్రభావం చూపినా మధ్య తరగతి, తక్కువ ఆదాయ వర్గాలపై ఎక్కువ భారం పడనుంది. బ్యాంకింగ్ చార్జీలు, రవాణా, విద్యా సేవలు, ఆరోగ్య సేవల మీద పన్ను ఎక్కువైతే వాటి భారం వినియోగదారుల నెత్తిపై పడుతుంది. అయితే జీఎస్టీ 2.0తో పన్ను వ్యవస్థ సరళీకరణ అవుతుందని, ఇది దీర్ఘకాల ప్రయోజనాన్ని ఇస్తుందని, పన్ను ఎగవేత తప్పుతుందని ప్రభుత్వం చెబుతున్నది. అయితే సాధారణ వినియోగదారులకు తక్షణ ప్రయోజనం కంటే తక్షణ భారమే ఎక్కువగా అనిపిస్తుంది. జీఎస్టీ 2.0 వల్ల వస్తువులు, సేవల ధరలు పెరిగే అవకాశం ఉండటంతో ప్రజల ఖర్చులు పెరిగి, జీవన ప్రమాణాలు క్షీణించే ప్రమాదం ఉంది. ముఖ్యంగా మధ్య తరగతి, పేద వర్గాలపై దీని ప్రభావం తీవ్రంగా పడనుంది.

పెరిగిన అప్పులు.. తగ్గిన పొదుపు

భారత దేశంలో 'జీవన వ్యయ సంక్షోభం కొంతవరకు ఉంది. అంటే గృహ పొదుపు శాతం నాలుగు సంవత్సరాల క్రితం కంటే నేడు తక్కువగా ఉంది. అయితే వాస్తవానికి బాధ్యతలు పెరిగాయి' అని పీడబ్ల్యూసీ రిటైల్ అండ్ కన్స్యూమర్ మార్కెట్ల లీడ్ డైరెక్టర్ హితాంషు గాంధీ అన్నారు. యూనిఫైడ్ పేమెంట్స్ ఇంటర్‌ఫేస్ లావాదేవీల వ్యాపారి కేటగిరీ వారీగా విభజనపై నేషనల్ పేమెంట్స్ కార్పొరేషన్ ఆఫ్ ఇండియా (ఎన్‌పీసీఐ) ఇటీవల విడుదల చేయడం ప్రారంభించిన నెల వారీ డేటాను ప్రస్తావిస్తూ రుణం చెల్లింపు అధిక శాతం కుటుంబాలపై చాలా తీవ్రమైన ఒత్తిడిని పెంచుతున్నదని అన్నారు.

ఎలక్ట్రానిక్స్ ఉత్పత్తులపైనే తగ్గింపు ఎక్కువ

జీఎస్టీ ధర తగ్గింపు గొప్పగా ఉందని చాలా మంది మురిసిపోతున్నారు. అయితే ఆ ధర తగ్గింపులో ఎక్కువ భాగం ఎలక్ట్రానిక్స్ ఉత్పత్తిని కొనుగోలు చేయడం, యాత్రకు వెళ్లడం, బయట తినడం అంశాలకే పరిమితం అవుతుందని పిడబ్ల్యూసీ ఇండియా భాగస్వామి, రిటైల్, వినియోగదారుల రంగం నాయకుడు రవి కపూర్ అన్నారు. జీఎస్టీ రేటు తగ్గింపులు ఫార్మల్ సెక్టార్ తయారు చేసిన వస్తువులకు డిమాండ్‌ను పెంచుతాయని కూడా భావిస్తున్నారు. జీఎస్టీ రేటు తగ్గింపులు భారత దేశ వృద్ధి బేస్ పాయింట్లు (బీపీఎస్) పెంచుతాయని, ఒక పూర్తి సంవత్సరంలో రిటైల్ ద్రవ్యోల్బణాన్ని 100 బీపీఎస్ తగ్గించవచ్చునని ఆర్థికవేత్తలు అంచనా వేశారు. అయితే పన్ను తగ్గింపులో ఎంత భాగం తగ్గిన ధరల రూపంలో వినియోగదారులకు బదిలీ అవుతుందనే దానిపై ప్రశ్నలు మిగిలి ఉన్నాయి.

తల్లి పేరుతో ఓట్ల వేట!

- కాంగ్రెస్ దూషణలను విషంలా గొంతులో దాచుకుంటా
- అస్సాం సభలో ప్రధాని మోదీ

గువాహటి: ప్రధాన మంత్రి నరేంద్ర మోదీ తన తల్లి పేరు చెప్పుకుంటూ బీహార్ శాసన సభ ఎన్నికల్లో ఓట్ల వేట సాగిస్తున్నారు! ఆయన అస్సాంలో మాట్లాడినా, మనసు మాత్రం బీహార్‌లోనే ఉన్నట్లు కనిపించింది. అస్సాంలోని డరంగ్‌లో ఆదివారం జరిగిన బహిరంగ సభలో ఆయన మాట్లాడుతూ, ''మొత్తం కాంగ్రెస్ వ్యవస్థ నన్ను లక్ష్యంగా చేసుకుంటుందని నాకు తెలుసు. మోదీ మళ్లీ ఏడుస్తున్నాడు అని అంటుంది. ప్రజలే నా దేవుళ్లు. నా బాధను వారి ముందు చెప్పుకోకపోతే, ఎవరికి చెప్పుకుంటాను? వాళ్లే నా యజమానులు, నా దేవుళ్లు, నా రిమోట్ కంట్రోల్. నాకు వేరే ఇతర రిమోట్ కంట్రోల్ లేదు'' అని ఆయన అన్నారు. తాను మహా శివుడి భక్తుడినని, శివుడు విషాన్ని మింగినట్లుగానే, తనపై వచ్చే దూషణల విషాన్ని తాను మింగుతానని తెలిపారు. ఇటీవల బీహార్‌లో ఆర్జేడీ-కాంగ్రెస్ బహిరంగ సభలో కొందరు మోదీ తల్లి హీరాబెన్‌ను దూషించినట్లు వార్తలు వచ్చాయి. ఈ అభ్యంతరకర వ్యాఖ్యలు చేసినపుడు తమ నేతలెవరూ వేదికపై లేరని కాంగ్రెస్ తెలిపింది. ఆ తర్వాత కాంగ్రెస్ ఓ ఏఐ వీడియోను విడుదల చేసింది. మోదీతో హీరాబెన్ మాట్లాడుతున్నట్లు దీనిలో కనిపించింది. బీహార్ శాసన సభ ఎన్నికలు త్వరలో జరుగుతాయి. ఆర్జేడీ, కాంగ్రెస్, వామపక్షాలు, వీఐపీ వంటి పార్టీలు మహా కూటమిగా ఏర్పడి పోటీ చేయబోతున్నాయి. బీజేపీ, జేడీయూ కలిసి పోటీ చేస్తాయి. ఎన్నికల ప్రచార వ్యూహకర్త ప్రశాంత్ కిశోర్ నేతృత్వంలోని జన సురాజ్ పార్టీ కూడా బరిలో దిగబోతున్నది.

నా మేధస్సు విలువ రూ.200 కోట్లు

స్వలాభం కోసం తెలివితేటలు వాడటం లేదు : గడ్కరీ

న్యూఢిల్లీ, సెప్టెంబర్ 14: ఇథనాల్ కలిపిన పెట్రోల్ అమ్మకంపై వస్తున్న ఆరోపణల్ని కేంద్ర మంత్రి నితిన్ గడ్కరీ కొట్టిపారేశారు. శనివారం నాగపూర్‌లో జరిగిన ఓ కార్యక్రమంలో ఆయన మాట్లాడుతూ, తన తెలివితేటలు, ఆలోచనలు అభివృద్ధి కోసమే తప్ప, స్వలాభం కోసం కాదని స్పష్టం చేశారు. 'నా మెదడు రూ.200కోట్ల విలువైనది. నిజాయితీగా ఎలా సంపాదించాలో తెలుసు' అని అన్నారు. ఇథనాల్ కలిపిన పెట్రోల్ అమ్మకాలపై వస్తున్న విమర్శలను ఆయన కొట్టిపారేశారు. సోషల్‌మీడియాలో తనపై జరుగుతున్న ప్రచారమంతా 'రాజకీయ ప్రేరేపితం' అని అన్నారు. ఇథనాల్ కలపటం వెనుక స్వీయ ప్రయోజనాలు, స్వార్థముందన్న ఆరోపణలపై గడ్కరీ పై విధంగా స్పందించారు.

గొప్పలు చెప్తుంది.. గంపెడు జొన్నలు కొనదు

భారత్‌పై అమెరికా కామర్స్ సెక్రటరీ హోవార్డ్ లుట్నిక్

న్యూయార్క్: 140 కోట్ల మంది జనాభా ఉన్నామని భారత దేశం గప్పాలు కొడుతుందని, కనీసం ఒక గంపెడు అమెరికా జొన్నలను కొనదని అమెరికా కామర్స్ సెక్రటరీ హోవార్డ్ లుట్నిక్ ఆరోపించారు. భారత్ టారిఫ్‌లను తగ్గించాలని, లేదంటే అమెరికాతో వ్యాపారం చేయడంలో కష్ట కాలాన్ని ఎదుర్కొనక తప్పదని హెచ్చరించారు. భారత దేశ ఆర్థిక వ్యవస్థను అమెరికాకు కట్టడి చేశారన్నారు. అదే సమయంలో అమెరికా ఆర్థిక వ్యవస్థను భారత్ కోసం బార్లా తెరిచామన్నారు. ''టారిఫ్‌లను తగ్గించండి. మేం మిమ్మల్ని చూసినట్లుగానే, మీరు మమ్మల్ని చూడండి'' అని డొనాల్డ్ ట్రంప్ చెప్పారన్నారు.

ఈసీ ఆత్మపరిశీలన చేసుకోవాలి

ఓట్ల చోరీపై మాజీ సీఈసీ ఖురేషీ

న్యూఢిల్లీ: ఎన్నికల విషయంలో తాము ఏం చేస్తున్నాం, ఎలా చేస్తున్నాం అనే విషయాలను ఎన్నికల సంఘం ఆత్మ పరిశీలన చేసుకోవాలని మాజీ కేంద్ర ఎన్నికల కమిషనర్ ఎస్‌వై ఖురేషీ అన్నారు. పీటీఐ ఇంటర్వ్యూలో ఆయన మాట్లాడుతూ ఓట్ల చోరీపై ఆరోపణలు చేస్తున్న కాంగ్రెస్ నేత రాహుల్ గాంధీపై అభ్యంతరకర వ్యాఖ్యలు చేయడానికి బదులు వాటిపై దర్యాప్తునకు ఈసీ ఆదేశించి ఉండాల్సిందన్నారు. బీహార్‌లో ఈసీ 'సర్'ను నిర్వహించిన విధానాన్ని కూడా ఆయన తప్పుపట్టారు. ఎన్నికల కమిషన్ ఓటర్లు, ప్రతిపక్షాల విశ్వాసాన్ని గెలుచుకొనేలా ఉండాలని అన్నారు. ఈసీపై వస్తున్న విమర్శలను చూసి తీవ్ర ఆవేదనకు గురవుతున్నానని ఆయన తెలిపారు.

బెట్టింగ్ యాప్ ప్రమోషన్‌లో నటీమణులకు నోటీసులు

న్యూఢిల్లీ, సెప్టెంబర్ 14: ఆన్‌లైన్ బెట్టింగ్ యాప్‌ల ప్రమోషన్ కేసులో కేంద్ర దర్యాప్తు సంస్థ ఎన్‌ఫోర్స్‌మెంట్ డైరెక్టరేట్ (ఈడీ) దూకుడు కొనసాగుతున్నది. ఇప్పటికే పలువురు నటీనటులను విచారించిన ఈడీ..తాజాగా బాలీవుడ్ నటి ఊర్వశి రౌతేలాతోపాటు, బెంగాల్ నటి, టీఎంసీ మాజీ ఎంపీ మిమి చక్రవర్తికి నోటీసులు జారీ చేసింది. మిమి చక్రవర్తిని ఈనెల 15న, ఊర్వశిని ఈ నెల 16న ఢిల్లీలో విచారణకు హాజరుకావాలని ఆదేశించింది. వీరిద్దరూ ప్రముఖ బెట్టింగ్ యాప్‌నకు ప్రచారం చేసినట్టు తెలిసింది. ఆర్థిక లావాదేవీలు, ప్రచారంలో వీరిద్దరి పాత్ర ఎంత మేరకు అన్నది తెలుసుకునేందుకు విచారణ అవసరమని ఈడీ భావిస్తున్నది.

లష్కరే ఆఫీస్ పునర్నిర్మాణానికి
పాక్ నిధులు!

న్యూఢిల్లీ: పహల్గాం ఉగ్రదాడికి ప్రతీకారంగా ఈ ఏడాది మే 7న భారత వాయుసేన చేపట్టిన 'ఆపరేషన్ సిందూర్'లో మురిద్కేలోని లష్కరే తాయిబా (ఎల్‌ఈటీ) ప్రధాన కార్యాలయం మార్కజ్ తాయిబా పూర్తిగా ధ్వంసమైంది. ఈ దాడిలో ఉగ్రవాదుల ఆయుధాగారాలు, శిక్షణ కేంద్రాలు నాశనమయ్యాయి. నిఘా వర్గాల సమాచారం ప్రకారం పాకిస్థాన్ ఈ ఉగ్రవాద సంస్థ పునర్నిర్మాణానికి నేరుగా నిధులు సమకూరుస్తున్నట్టు తెలిసింది. లష్కరేకు ప్రభుత్వం ఇప్పటికే రూ.4 కోట్లు కేటాయించింది. మొత్తం పునర్నిర్మాణానికి రూ.15 కోట్లకు పైగా ఖర్చవుతుందని సంస్థ అంచనా వేస్తున్నది. లష్కరే కమాండర్లు మౌలానా అబూ జార్, యూనస్ షా బుఖారీ ఈ ప్రాజెక్టు పనులను పర్యవేక్షిస్తున్నట్టు ఆ వర్గాలు పేర్కొన్నాయి. వచ్చే ఏడాది ఫిబ్రవరి 5 నాటికి ఈ నిర్మాణాలు పూర్తి చేయాలనే లక్ష్యంతో వారు పనిచేస్తున్నారు.

ఈశాన్య భారతంలో భూకంపం

గువాహటి : ఈశాన్య భారతం, పశ్చిమ బెంగాల్‌లలో ఆదివారం భూకంపం సంభవించింది. దీని తీవ్రత భూకంప లేఖినిపై 5.8గా నమోదైంది. ఆదివారం మధ్యాహ్నం 4.41 గంటలకు మొదటిసారి భూమి కంపించింది. ఆ తర్వాత గంటన్నర సమయంలో మూడుసార్లు చిన్న ప్రకంపనలు వచ్చాయి. అస్సాంలో భూకంపం వల్ల ఇద్దరు గాయపడగా, కొన్ని ఇండ్లు దెబ్బతిన్నాయి. మణిపూర్ పశ్చిమ ప్రాంతాలు, అరుణాచల్ ప్రదేశ్ రాజధాని ఈటా నగర్‌లలో కూడా భూమి కంపించింది. అస్సాం సరిహద్దుల్లోని పశ్చిమ బెంగాల్ ప్రాంతాలపై కూడా ఈ ప్రభావం కనిపించింది. అస్సాం ముఖ్యమంత్రి హిమంత బిశ్వ శర్మకు ప్రధాని నరేంద్ర మోదీ ఫోన్ చేసి, వివరాలు అడిగి తెలుసుకున్నారు. కేంద్ర ప్రభుత్వం నుంచి అన్ని విధాలుగా సహాయపడతామని చెప్పారు.



బీహార్‌లో అన్ని చోట్ల ఆర్జేడీ పోటీ

- కాంగ్రెస్ కూటమిపై ఒత్తిడి పెంచిన ఆర్జేడీ నేత తేజస్వి
- సీట్ల పంపకంపై ప్రతిష్ఠంభన



పాట్నా : రానున్న బీహార్ శాసన సభ ఎన్నికల్లో అన్ని నియోజక వర్గాల్లోనూ ఆర్జేడీ పోటీ చేస్తుందని ఆ పార్టీ సీనియర్ నేత తేజస్వి ప్రసాద్ యాదవ్ చెప్పారు. ముజఫర్‌పూర్ జిల్లాలోని కంటి పట్టణంలో ఆదివారం జరిగిన ఆర్జేడీ కార్యకర్తల సమావేశంలో ఆయన మాట్లాడారు. మహా కూటమి భాగస్వామ్య పార్టీల మధ్య సీట్ల పంపకంలో ప్రతిష్టంభన ఏర్పడిన నేపథ్యంలో ఆయన ఈ ప్రకటన చేశారు. తేజస్వి మాట్లాడుతూ, ప్రధాన మంత్రి నరేంద్ర మోదీపై విరుచుకుపడ్డారు. తన తండ్రి, ఆర్జేడీ చీఫ్ లాలూ ప్రసాద్ యాదవ్ సాధించిన విజయాలను వివరించారు. ఆర్జేడీ పోటీ చేయబోతున్న కొన్ని నియోజకవర్గాల పేర్లను కూడా ఆయన చెప్పారు. వీటిలో ఒకదానిలో ప్రస్తుతం కాంగ్రెస్ ఎమ్మెల్యే ఉన్నారు. సీట్ల పంపకాల చర్చల్లో మిత్ర పక్షాలపై ఒత్తిడి పెంచడం కోసమే ఆయన ఈ విధంగా ప్రకటించారని విశ్లేషకులు చెప్తున్నారు. ఈ కూటమిలో ఆర్జేడీ, కాంగ్రెస్, వామపక్షాలు, వీఐపీ, జేఎంఎం, ఎల్‌జేపీ (పరాస్ వర్గం) ఉన్నాయి. కాంగ్రెస్ ఎక్కువ స్థానాలను ఆశిస్తున్నట్లు సమాచారం.

హిందూ మతంలో సమానత్వం ఉంటే
ఎందుకు మారుతారు?

సీఎం సిద్ధరామయ్య వివాదాస్పద వ్యాఖ్యలు

బెంగళూరు: 'హిందూ మతంలో సమానత్వం, సమాన అవకాశాలు ఉంటే ఎవరైనా ఎందుకు మతం మారతారు? అంటరానితనాన్ని మేమేమన్నా తెచ్చామా?' అని కర్ణాటక ముఖ్యమంత్రి సిద్ధరామయ్య శనివారం వివాదాస్పద వ్యాఖ్యలు చేశారు. కుల గణనపై మీడియాతో మాట్లాడుతూ ఆయన ఈ వ్యాఖ్యలు చేశారు. ఇతర మతాల్లోనూ అసమానతలు ఉండొచ్చని.. తామైనా, బీజేపీ అయినా మతం మారమని ప్రజలను అడగమని.. కానీ అది వారి హక్కు అని ఆయన అన్నారు. దీనిపై బీజేపీ స్పందిస్తూ ఇస్లాంను ప్రశ్నించే ధైర్యం కర్ణాటక సీఎం సిద్ధరామయ్యకు ఉందా? అని ప్రశ్నించింది. 'ఇస్లాంలో కనుక సమానత్వం ఉన్నట్టయితే మహిళలను మసీదుల్లోకి ఎందుకు అనుమతించడం లేదు? ట్రిపుల్ తలాక్‌ను నిషేధించడాన్ని ఎందుకు వ్యతిరేకించారు? ముస్లిమేతరులు, హిందువులను ఖురాన్‌లో కాఫిర్లుగా ఎందుకు పిలుస్తున్నారు? ఇవన్నీ అడిగే ధైర్యం మీకుందా? అని బీజేపీ నేత ఆర్ అశోక ఎక్స్‌లో ప్రశ్నించారు.

ఇష్టపూర్వక శారీరక సంబంధం నేరం కాదు

- పెండ్లికి నిరాకరణ తప్పు కాదు
- అలహాబాద్ హైకోర్టు తీర్పు

ప్రయాగ్‌రాజ్, సెప్టెంబర్ 14: నాలుగేండ్ల పాటు ఇష్టపూర్వక శారీరక సంబంధం కొనసాగిన తర్వాత పెండ్లికి నిరాకరించడం విచారణకు అర్హమైన కేసు కాదని అలహాబాద్ హైకోర్టు పేర్కొంది. తనపై లైంగిక దాడి చేశాడంటూ ఆరోపిస్తూ ఒక మహిళ తన సహజీవన భాగస్వామిపై దాఖలు చేసిన పిటిషన్‌ను తిరస్కరించింది. 'మా దృష్టిలో ఇద్దరు తెలివైన వయోజనులు రెండేండ్లకు పైగా సహజీవనం చేస్తూ ఉన్నారంటే, దాని పరిణామాల పట్ల వారికి పూర్తిగా అవగాహన ఉన్నట్టే మేము భావిస్తున్నాం' అని జస్టిస్ అరుణ్ కుమార్ సింగ్ దేశ్‌వాల్ తెలిపారు. అందువల్ల వివాహం చేసుకుంటానని హామీ ఇవ్వడం వల్లే అలాంటి సంబంధం ఏర్పడిందనే ఆరోపణ ప్రస్తుత పరిస్థితులలో అంగీకారానికి అనర్హమైనదని, ప్రత్యేకించి వివాహం చేసుకుంటానని హామీ ఇవ్వకపోతే అలాంటి సంబంధం ఏర్పడేది కాదని అనడం సహేతుకంగా లేదని పేర్కొన్నారు. కాగా, తన ఫిర్యాదును 2024, ఆగస్టులో కొట్టివేస్తూ అడిషనల్ జిల్లా సెషన్స్ జడ్జి ఇచ్చిన తీర్పును సవాల్ చేస్తూ ఒక మహిళ హైకోర్టును ఆశ్రయించగా, కింది కోర్టు తీర్పును హైకోర్టు సమర్థించింది.

జీవన సామర్థ్యం ఆధారంగా
పిండానికి హక్కులు

- గర్భ విచ్ఛిత్తి కేసులపై ప్రభుత్వానికి ఢిల్లీ హైకోర్టు సూచన



న్యూఢిల్లీ: తల్లి కడుపులోని పిండానికి దాని జీవన సామర్థ్యం ఆధారంగా హక్కులు ఉండాలని ఢిల్లీ హైకోర్ట్ ప్రభుత్వానికి సూచించింది. చట్టబద్ధ పరిమితిని దాటిపోయిన తర్వాత గర్భ విచ్ఛిత్తి కోసం దాఖలవుతున్న పిటిషన్ల సంఖ్య పెరుగుతున్న వేళ ప్రభుత్వం ఈ అంశంపై దృష్టి సారించాలని చెప్పింది. గర్భస్రావానికి సంబంధించిన న్యాయంలో పిండం జీవన సామర్థ్యానికి తగిన ప్రాధాన్యం వచ్చిందని కోర్టు పేర్కొంది. తల్లి స్వాతంత్ర్యానికి, పిండం హక్కులకు మధ్య సమతుల్యతను సాధించాలని కోరింది. శాసనపరమైన స్పష్టత లేనందువల్ల కేసును బట్టి తీర్పులు ఇస్తూ, ఆసక్తులు- సంఘర్షణల మధ్య సమతుల్యతను సాధించేందుకు రాజ్యాంగ న్యాయస్థానాలు ప్రయత్నిస్తున్నాయని తెలిపింది. స్పష్టమైన శాసన నియమావళి లేనందువల్ల ఈ అంశం అపరిష్కృతంగా మిగిలిపోతున్నదని పేర్కొంది. 15 ఏండ్ల బాలికపై లైంగిక దాడి జరగడంతో గర్భవతి అయిన కేసులో ఈ వ్యాఖ్యలు చేసింది. 27 వారాల గర్భాన్ని వైద్యపరంగా సమాప్తి చేసేందుకు హైకోర్టు అనుమతి ఇచ్చింది. ప్రస్తుత కేసులో బాధితురాలు నిందితుని చేతుల్లో క్రూరత్వాన్ని అనుభవించిందని కోర్టు తెలిపింది. పిండం సజీవంగా జన్మించే అవకాశాలు ఉండటం కన్నా ఆమె మానసిక, శారీరక సంక్షేమానికి ప్రాధాన్యం ఇవ్వాలని పేర్కొంది.

బిచ్చగాళ్ల గృహాల్లో సదుపాయాలు కల్పించండి

- కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలకు సుప్రీంకోర్టు ఆదేశం

న్యూఢిల్లీ: ప్రభుత్వాలు బిచ్చగాళ్ల కోసం సత్రాలను నిర్వహించడం దాతృత్వం కాదని, వాటి నిర్వహణలో రాజ్యాంగ విలువలు ప్రతిబింబించాలని సుప్రీంకోర్టు తెలిపింది. ఇటువంటి కేంద్రాల్లో నిరంతరం హుందాతనంతో కూడిన జీవన పరిస్థితులు ఉండేలా చూడాలని కేంద్ర, రాష్ట్రాల ప్రభుత్వాలను ఆదేశించింది. రాజ్యాంగం కల్పించిన గౌరవప్రదంగా జీవించే హక్కు సమాజంలో అత్యంత బలహీన వర్గాలైన బిచ్చగాళ్ల విషయంలో అమలు చేయాలని పేర్కొంది. ప్రభుత్వాలు నిర్వహించే యాచక గృహాలు, అటువంటి ఇతర సంస్థల్లో మానవీయ పరిస్థితులను కల్పించడంలో విఫలమవడం అసమర్థ, నిర్లక్ష్య పరిపాలన అవుతుందని వివరించింది.

బాల్కనీ గుండా ఫ్లై ఓవర్

- నాగ్‌పూర్‌లో వెలుగు చూసిన వింత నిర్మాణం
- అనుమతి లేకుండా ఇల్లు నిర్మించారంటున్న అధికారులు
- 150 ఏండ్ల నుంచి అక్కడే ఇల్లుందన్న యజమాని



ముంబై, సెప్టెంబర్ 14 (నమస్తే తెలంగాణ): భోపాల్‌లో 90 డిగ్రీల మలుపు వంతెన సోషల్ మీడియాలో ఎంతగానో ట్రోల్ అయ్యింది. తాజాగా నాగ్‌పూర్‌లో ఇలాంటి వింత నిర్మాణం వెలుగులోకి వచ్చింది. దిఘోరి-ఇండోరా మార్గంలో రూ.998 కోట్ల వ్యయంతో ఎన్‌హెచ్‌ఎంఐ నిర్మిస్తున్న ఫ్లై ఓవర్ వంతెన ప్రవీణ్ పాత్రె అనే వ్యక్తికి చెందిన రెండంతస్తుల ఇంట్లోని బాల్కనీలోకి చొచ్చుకుపోయింది. ఈ వంతెన ఫొటోలు సోషల్ మీడియాలో వైరల్ అయిన తర్వాత, ప్రజలు నాగ్‌పూర్ మున్సిపల్ కార్పొరేషన్‌ను సోషల్ మీడియా వేదికగా ప్రశ్నించారు. దీనిపై మున్సిపల్ కార్పొరేషన్ స్పందిస్తూ ఆ ఇంటి యజమాని తన ప్లాట్ సరిహద్దులు దాటి బాల్కనీని నిర్మించాడని, అతి త్వరలో బాల్కనీని కూల్చివేస్తామని తెలిపింది. ఆమోదించిన డిజైన్ ప్రకారం ఫ్లై ఓవర్ నిర్మాణం జరుగుతున్నదని అధికారులు పేర్కొన్నారు. ఆ ఇంటిని అనుమతి లేకుండా నిర్మించారని మున్సిపల్ కమిషనర్ నరేంద్ర బవాంకర్ తెలిపారు.

శంఖం ఊదితే నిద్రకు మంచిది!

శ్వాస ఆగిపోయే సమస్యకు ఉపశమనం ▪ జైపూర్ వైద్యుల అధ్యయనం వెల్లడి



జైపూర్, సెప్టెంబర్ 14: భారతీయ ప్రాచీన సంస్కృతిలోని ఆచారాలలో ఆరోగ్య రహస్యాలు ఎన్నో దాగి ఉన్నాయి. అలాంటి ఆరోగ్య రహస్యాన్ని తాజాగా వైద్య నిపుణులు గుర్తించారు. పూజలు నిర్వహించినప్పుడు శంఖం ఊదటం అనాదిగా ఆచారంగా వస్తున్నది. ఈ ఆచారంలో ఓ ఆరోగ్య సూత్రం దాగి ఉన్నట్టు నిపుణులు చెప్తున్నారు. కొందరికి నిద్రపోయినప్పుడు మధ్యలో కొన్ని సెకన్లపాటు హఠాత్తుగా శ్వాస ఆగిపోతుంది. దీంతో ఊపిరాడనట్టయి నిద్రలో మెలకువ వస్తుంది. దీనినే వైద్య పరిభాషలో స్లీప్ అప్నియా అంటారు. రోజూ శంఖం ఊదటం వల్ల మంచి నిద్ర పట్టడంతో పాటు స్లీప్ అప్నియా సమస్య నుంచి ఉపశమనం కలుగుతుందని వైద్యనిపుణులు చెప్తున్నారు. ఈ మేరకు జైపూర్‌కు చెందిన వైద్య నిపుణులు రాసిన పరిశోధన పత్రం యూరోపియన్ రెస్పిరేటరీ జర్నల్, న్యూస్ మెడికల్ లైఫ్ సైన్సెస్‌లో ప్రచురితమైంది. 19 నుంచి 65 ఏండ్ల వయసు గల వ్యక్తులపై జరిపిన అధ్యయనంలో కీలక విషయాలు కనుగొన్నట్టు వివరించారు. నిద్రలో అంతరాయాల సంఖ్య తగ్గడాన్ని గమనించినట్టు వైద్య నిపుణులు పేర్కొన్నారు. స్లీప్ అప్నియా సమస్యతో బాధపడేవారు ఆక్సీజన్, మెడిసిన్ సపోర్ట్ తీసుకుంటారు. కానీ శంఖం ఊదడం వల్ల సహజసిద్ధంగానే వాటి అవసరం తగ్గడాన్ని గమనించినట్టు వెల్లడించారు.

వలసలపై హోరెత్తిన లండన్

- ఒకే రోజు వ్యతిరేక, అనుకూల నిరసనలు
- పోరాడకపోతే చనిపోతారని వలస వ్యతిరేక ర్యాలీకి ఎలాన్ మస్క్ మద్దతు



లండన్: బ్రిటన్‌లోని వలసదారులకు వ్యతిరేకంగా, అనుకూలంగా శనివారం లండన్‌లో జరిగిన రెండు ర్యాలీలు ఉద్రిక్తంగా మారాయి. 'వలస వ్యతిరేక ర్యాలీ'లో లక్ష మందికిపైగా పాల్గొన్నారు. ఈ ర్యాలీకి ప్రపంచ కుబేరుడు ఎలాన్ మస్క్ మద్దతు తెలిపారు. ప్రధాని కీర్ స్టార్మర్ నేతృత్వంలోని ప్రభుత్వం వెంటనే దిగిపోవాలని డిమాండ్ చేశారు. 'బ్రిటన్ ఇప్పుడు అక్రమ వలసలతో నిండిపోయింది. హింసను కోరుకోకపోయినా..విధ్వంసం మీ వరకు వస్తుంది. ఇప్పుడు మీ వద్ద ఉన్నవి రెండే మార్గాలు. తిరిగి పోరాడండి. లేదంటే చనిపోతారు' అని మస్క్ అన్నారు. మరోవైపు వలసదారులకు మద్దతుగా 'స్టాండ్ అప్ టు రేసిజమ్' పేరుతో మరొక గ్రూప్ నిరసనలు చేపట్టింది. ఈ రెండు నిరసనలు అదుపు తప్పడంతో హింసాత్మకంగా మారాయి. ఆందోళనకారులకు, పోలీసులకు మధ్య ఘర్షణకు దారితీసింది. ఈ ఘటనల్లో 26 మంది పోలీసులు గాయపడ్డారు. ప్రదర్శన చివరి దశలో కొంతమంది అదుపు తప్పారు.

అభ్యర్థుల జీవితాలతో ఆటలొద్దు

టీజీపీఎస్సీ విశ్వసనీయతను కాపాడండి • సింగిల్ బెంచ్ తీర్పును అమలుచేయాలి • డివిజన్ బెంచ్, సుప్రీంకోర్టుకు వెళ్లొద్దు • టీజీపీఎస్సీకి మాజీ సభ్యుడు విఠల్ సూచన

హైదరాబాద్, సెప్టెంబర్ 14 (నమస్తే తెలంగాణ): గ్రూప్-1 విషయంలో భేషజాలకు పోవద్దని పబ్లిక్ సర్వీస్ కమిషన్ మాజీ సభ్యుడు, తెలంగాణ ఉద్యమకారుడు సీ విఠల్ ప్రభుత్వానికి, టీజీపీఎస్సీకి సూచించారు. పైకోర్టులకు వెళ్లి అభ్యర్థుల జీవితాలతో చెలగాటమాడొద్దని హితవు పలికారు. గ్రూప్-1పై హైకోర్టు తీర్పు నేపథ్యంలో ఆదివారం 'నమస్తే తెలంగాణ'కు విఠల్ ఇంటర్వ్యూ ఇచ్చారు. గ్రూప్-1 విషయంలో టీజీపీఎస్సీ అభాసుపాలైందని, అప్రతిష్ఠను మూటగట్టుకున్నదని విమర్శించారు. రాజ్యాంగబద్ధ సంస్థ అయిన కమిషన్‌కు ఇది మాయనిమచ్చని, విశ్వసనీయతను కోల్పోయిందని చెప్పారు. ఉద్యోగులను రిక్రూట్ చేయాల్సిన కమిషన్‌లోనే ఉద్యోగులు లేకపోవడం విచారకరమని ఆవేదన వ్యక్తంచేశారు. కమిషన్‌ను సిబ్బంది కొరత సమస్య వేధిస్తున్నదని, అనుభవం గల వారంతా రిటైర్మెంట్ అవుతున్నారని పేర్కొన్నారు. ఈ 20 నెలల్లో ఉద్యోగులను ఎందుకు రిక్రూట్ చేయలేదని ప్రశ్నించారు.

మేం ఆదర్శంగా నిలబెట్టినం

''తెలంగాణ ఏర్పాటు తర్వాత కొత్తగా పబ్లిక్ సర్వీస్ కమిషన్ ఏర్పాటైంది. అనేక సమస్యలు, సవాళ్లు పీడించినా మేం లెక్కచేయలేదు. ఉద్యోగాల భర్తీ విషయంలో మేం పబ్లిక్ సర్వీస్ కమిషన్‌ను ఆదర్శంగా నిలబెట్టినం. దేశంలోనే మొదటిసారి 40 వేల మందికి ఒకేసారి ఆన్‌లైన్ ఎగ్జామ్ నిర్వహించినం. తెలంగాణ ఏర్పాటు తర్వాత 160 పోస్టుల భర్తీకి గ్రూప్-1 మెయిన్స్ ఎగ్జామ్ నిర్వహించి, పకడ్బందీగా ఇంటర్వ్యూలు నిర్వహించాం. అవినీతికి తావులేకుండా ఉద్యోగాలు భర్తీచేశాం. ఇంటర్వ్యూ విధానంలో పేరు, కులం, మతం, రిజర్వేషన్ వ్యక్తిగత వివరాలను అడగొద్దని నిషేధించాం. 36 వేల పైచిలుకు ఉద్యోగాలను భర్తీ చేశాం. గ్రూప్-2, 3, 4, టీఆర్టీ రిక్రూట్‌మెంట్‌ను విజయవంతంగా పూర్తిచేశాం. జీవోలు, అర్హతలపై చిన్న చిన్న కోర్టుకేసులు, కొందరు కోర్టుకెళ్లడంతో ఆలస్యమయ్యిందే తప్ప ఇంత పెద్ద తప్పిదాలు మా హయాంలో జరగలేదు'' అని విఠల్ వివరించారు.

మూల్యాంకనం లోపాలపుట్ట

''గ్రూప్-1 మూల్యాంకనం విషయంలో రూల్స్, నిబంధనలున్నాయి. సుప్రీంకోర్టు తీర్పులున్నాయి. కానీ ఈ నిబంధనలను పట్టించుకోలేదు. దీంతో అనేక తప్పులు జరిగాయి. మాడరేషన్ మెథడ్‌ను అనుసరించలేదు. సీనియర్ మోస్ట్ ప్రొఫెసర్, ప్రొఫెసర్ల చేత మూల్యాంకనం చేయించాల్సి ఉండే. కానీ కాంట్రాక్ట్, తాత్కాలిక సిబ్బంది, ప్రైవేట్ లెక్చరర్లతో మూల్యాంకనం చేయించినట్టు అభ్యర్థులు ఆరోపిస్తున్నారు. ఫలితాలు త్వరగా ఇవ్వాలన్న ఆత్రుతలో మెయిన్స్ పరీక్షలు ముగిసిన మూడో రోజు నుంచే మూల్యాంకనం ప్రారంభించారని, త్వరగా మూల్యాంకనం పూర్తిచేయాలని ఒత్తిడి తెచ్చారని నిరుద్యోగులంటున్నారు. రోజుకు 20 పేపర్లు దిద్దాల్సి ఉండగా, రోజుకు 80-100 దిద్దించారని చెప్తున్నారు. మాడరేషన్‌ను అనుసరించలేదని హైకోర్టు కూడా చెప్పింది'' అని విఠల్ తెలిపారు.



పై కోర్టులకెళ్తే నష్టమే

గ్రూప్ -1 విషయంలో టీజీపీఎస్సీ, ప్రభుత్వం భేషజాలకు పోకూడదని విఠల్ పేర్కొన్నారు. తప్పిదాలను గ్రహించి నష్ట నివారణ చర్యలు చేపట్టాలే తప్ప పైకోర్టుకెళితే మరింత నష్టం జరిగే అవకాశాలున్నాయని తెలిపారు. 'గ్రూప్-1లో పారదర్శకత లోపించిందని సింగిల్ బెంచ్ తీర్పునిచ్చింది. టీజీపీఎస్సీ అసమర్థతను తప్పుబట్టింది. సింగిల్ బెంచ్ ఇచ్చిన తీర్పును పై కోర్టులు కొట్టివేస్తాయని అనుకోవడం లేదు. ఈ విపత్కర పరిస్థితుల్లో అప్పీల్‌కెళ్లినా, సుప్రీంకోర్టుకెళ్లినా ఉపశమనం దొరకడం కష్టమే. సుప్రీంకోర్టుకు వెళ్తే ఏడాది, ఆరునెలలు పట్టొచ్చు. కోర్టులకు వెళ్లడం కన్నా రీనోటిఫికేషన్ జారీచేయడమే ఉత్తమం' అని వివరించారు.

శ్వేతపత్రం విడుదల చేయాలి

ఎన్నికలకు ముందు రెండు లక్షల ఉద్యోగాలిస్తామని కాంగ్రెస్ హామీ ఇచ్చిందని, జాబ్ క్యాలెండర్‌ను కూడా విడుదల చేసిందని విఠల్ తెలిపారు. కాంగ్రెస్ హామీలను నిరుద్యోగులు నమ్మారని, కానీ ప్రభుత్వం ఉద్యోగాల భర్తీ విషయంలో అబద్ధాలాడుతున్నదని ఆగ్రహం వ్యక్తంచేశారు. విద్యుత్తు రంగం, ఆర్థికరంగంపై సర్కారు శ్వేతపత్రాలు విడుదల చేసి అసెంబ్లీలో చర్చకు పెట్టిందని, ఇదే తరహాలో ఉద్యోగాల భర్తీ విషయంలోను శ్వేతపత్రం విడుదల చేయాలని కోరారు. ఎన్ని నోటిఫికేషన్లు విడుదల చేశారు? ఎన్ని ఉద్యోగాలను భర్తీచేశారో బహిరంగంగా వెల్లడించాలని విఠల్ డిమాండ్ చేశారు.



'కుక్కల దాడి'తో ఇల్లెక్కిన ఎద్దు

తాళ్ల సాయంతో కిందికి దింపిన గ్రామస్థులు

జైనథ్, సెప్టెంబర్ 14 : కుక్కలు దాడి చేయడానికి రావడంతో ఓ ఎద్దు ఇల్లెక్కిన ఘటన ఆదిలాబాద్ జిల్లా భోరజ్ మండల పరిధిలోని నిరాలలో ఆదివారం చోటుచేసుకున్నది. గ్రామస్థుల కథనం ప్రకారం.. రైతు షేక్ గఫూర్ తన ఇంటి ఆరు బయట గూటానికి ఎద్దును కట్టేశాడు. ఆదివారం ఉదయం కుక్కల మంద ఎద్దుపై దాడి చేయడానికి రావడంతో భయంతో తాడును తెంపేసుకొని పక్కనే ఉన్న రాళ్ల కట్టపై నుంచి ఇంటిపైకి చేరింది. గ్రామానికి చెందిన విఠల్ మాస్టర్ ఇల్లు కొంత భాగం దెబ్బతిన్నది. స్థానికులు తాళ్ల సాయంతో ఎద్దును కిందికి దింపారు. ఈ దృశ్యాన్ని గ్రామస్థులు తమ సెల్‌ఫోన్లలో బంధించారు.

జీతాల్లేక.. జీవితాలు సమాధి!

- 'పంచాయతీరాజ్' వేతన వెతలు
- ఐదు నెలలుగా వేతనాల పెండింగ్
- ఆర్థిక ఇబ్బందుల్లో చిరుద్యోగులు
- ఇద్దరు ఉద్యోగుల బలవన్మరణం
- కుటుంబం గడవడంలేదని ఆవేదన
- ఆందోళన తప్పదంటూ హెచ్చరిక

హైదరాబాద్, సెప్టెంబర్ 14 (నమస్తే తెలంగాణ): పంచాయతీరాజ్, గ్రామీణాభివృద్ధిశాఖలో చిరుద్యోగుల వరుస ఆత్మహత్యలు కలకలం సృష్టిస్తున్నాయి. చేసిన పనికి ప్రభుత్వం సకాలంలో వేతనాలు చెల్లించకపోవడంతో తీవ్ర ఆర్థిక ఇబ్బందులతో కాంట్రాక్టు, ఔట్‌సోర్సింగ్ ఉద్యోగులు బలవన్మరణాలకు పాల్పడటం ఉద్యోగుల్లో గుబులు కలిగిస్తున్నది. ఈ ఘటనలు ప్రభుత్వ విధానాల్లో తప్పిదాలను, సిబ్బంది మానసిక స్థితిని ప్రశ్నిస్తున్నాయి. ఇటీవల మల్టీపర్పస్ ఉద్యోగి, మొన్న కంప్యూటర్ ఆపరేటర్ ప్రాణాలు తీసుకున్నారు. ఇప్పటికే ఐదు నెలల వేతనాలు పెండింగ్‌లో ఉన్నాయి. దసరా నాటికైనా వేతనాలు అందుతాయా? అంటూ ఉద్యోగులు ఆశగా ఎదురుచూస్తున్నారు. ప్రభుత్వం ఈ సమస్యకు శాశ్వత పరిష్కారం చూపకపోతే, మరిన్ని దారుణ ఘటనలు జరిగే అవకాశముందని ఉద్యోగ సంఘాల నాయకులు ఆవేదన వ్యక్తంచేస్తున్నారు.

గ్రీన్‌చానల్ విధానం ఏమైనట్టు?

పంచాయతీరాజ్, గ్రామీణాభివృద్ధిశాఖ పరిధిలోని 16 విభాగాల్లో 92,175 మంది చిరుద్యోగులు పనిచేస్తున్నారు. ఇందులో అత్యధిక సంఖ్యలో మల్టీపర్పస్ ఉద్యోగులు 52,473 మంది, సెర్ప్‌లో 22,011 వేల మంది, సొసైటీ ఫర్ రూరల్ డెలవప్‌మెంట్ సర్వీసెస్ (ఎస్ఆర్‌డీఎస్)లో 12,586 మంది విధులు నిర్వర్తిస్తున్నారు. వీరి జీతాలకు నెలకు రూ.115 కోట్ల పైచిలుకు అవుతుందని, వీరికి గ్రీన్‌చానెల్ ద్వారా వేతనాలు ఇస్తామని ఆ శాఖ మంత్రి సీతక్క చెప్పారు. కానీ ఆ విధానం అమలు కావడంలేదు. గ్రామ పంచాయతీల్లో పనిచేస్తున్న మల్టీపర్పస్ ఉద్యోగులకు, కంప్యూటర్ ఆపరేటర్లకు కూడా జూలై నుంచి వేతనాలు అందలేదు. కొన్ని జిల్లాల్లో మూడు నెలల వేతనాలు పెండింగ్‌లో ఉన్నాయి. మిషన్ భగీరథలో పనిచేస్తున్న సుమారు 18 వేల మంది ఔట్ సోర్సింగ్ ఉద్యోగుల బాధలు కూడా వర్ణనాతీతంగా మారాయి. కొందరికి 12 నెలలు, మరికొందరికి ఆరు నెలలు, ఇంకొందరికి నాలుగు నెలలుగా జీతాలు రావడంలేదు. ఎన్నిసార్లు వినతిపత్రాలు ఇచ్చినా ఇచ్చినా చెత్తబుట్టపాలు అవుతున్నాయని, శాశ్వత పరిష్కారం లభించడంలేదని ఉద్యోగులు చెప్తున్నారు.



వరుసగా ఇద్దరు మృత్యువాత

సూర్యాపేట జిల్లా తుంగతుర్తి ఎంపీడీవో కార్యాలయంలో సోమిరెడ్డి కంప్యూటర్ ఆపరేటర్‌గా పనిచేసేవాడు. రెండు నెలలుగా జీతాలు లేక కుటుంబ ఆర్థిక ఇబ్బందుల వల్ల శుక్రవారం నల్లగొండలో రైలు కింద పడి ఆత్మహత్య చేసుకున్నాడు. ఒక పక్క కాంట్రాక్టు ఏజెన్సీల దోపిడీ, మరోవైపు సరైన సమయానికి జీతాలు రాక ఔట్‌సోర్సింగ్ ఉద్యోగుల కుటుంబాలు పస్తులు ఉండాల్సిన పరిస్థితి నెలకొన్నది. ప్రతి నెలా జీతాలు రాకపోవడం, ఆర్థిక సమస్యలు వెంటాడటం.. గత్యంతరం లేని పరిస్థితుల్లో సోమిరెడ్డి ప్రాణాలు తీసుకున్నట్టు బాధితుడి కుటుంబ సభ్యులు తెలిపారు. ఇటీవలే సీతక్క ప్రాతినిధ్యం వహిస్తున్న ములుగు మున్సిపాలిటీలో పారిశుధ్య కార్మికుడు మైదం మహేశ్ వేతనం అందక ప్రాణాలు తీసుకున్నాడు. ఆ ఘటన మర్చిపోకముందే.. అదే శాఖలో మరో ఉద్యోగి చనిపోవడంతో ఉద్యోగులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

కుటుంబాలతో ఆందోళనకు దిగుతాం

'పిల్లలకు స్కూల్ ఫీజు, ఇంటి కిరాయి కూడా కట్టలేకపోతున్నాం. పూట గడవడం కోసం అప్పులు చేయాల్సి వస్తున్నది. ఇలాంటి దుస్థితిలో కొట్టుమిట్టాడుతున్నాం. జీతాల సమస్యపై ప్రభుత్వం స్పందించకపోతే మా పరిస్థితి మరింత అగమ్యగోచరంగా మారుతుంది. కుటుంబాలతో కలిసి ఆందోళన బాట పడుతాం. సర్కారు తీవ్రమైన నిరసన ఎదుర్కోవాల్సి వస్తుంది' అని మల్టీపర్పస్ ఉద్యోగుల సంఘం నేత తెలిపారు.



అటకెక్కిన టూరిజం పాలసీ

- అమలుపై లోపించిన చిత్తశుద్ధి
- రూ.15 వేల కోట్లు పెట్టుబడులు తెస్తామని చెప్పి కనీసం రూ.10 కోట్లు కూడా తీసుకురాని వైనం
- రాష్ట్ర పర్యాటక రంగాన్ని గాలికొదిలేసిన ప్రభుత్వ పెద్దలు

హైదరాబాద్, సెప్టెంబర్ 14 (నమస్తే తెలంగాణ): రాష్ట్రంలో 'టూరిజం పాలసీ 2025-30' అటకెక్కింది. పర్యాటక రంగం అభివృద్ధికి వచ్చే ఐదేండ్లలో రూ.15 వేల కోట్ల పెట్టుబడులు సేకరించాలని లక్ష్యంగా పెట్టుకున్నట్టు రాష్ట్ర బడ్జెట్ సమావేశాల సందర్భంగా అసెంబ్లీలో ఆర్భాటంగా ప్రకటించిన రేవంత్ ప్రభుత్వం.. పాలసీ అమలులో చిత్తశుద్ధిని ప్రదర్శించడంలేదు. కొత్త టూరిజం పాలసీ తీసుకొచ్చి 8 నెలలు కావస్తున్నా ఇంతవరకు రూ.10 కోట్ల పెట్టుబడులు కూడా తీసుకురాలేదు. ఒక్కరికి కూడా ఉద్యోగం కల్పించలేకపోయింది. రాష్టంలో టూరిజం పాలసీ అమలవుతున్నదా? లేదా? అన్న అనుమానాలు వ్యక్తమవుతున్నాయి.


ప్రైవేటు పెట్టుబడులు ఏవీ?

టూరిజం పాలసీ ద్వారా ప్రైవేటు సంస్థల నుంచి రాష్ట్రానికి పెట్టుబడులు ఆకర్షించాలని ప్రభుత్వం భావించింది. పెట్టుబడులతో టెంపుల్, ఎకో, మెడికల్ అండ్ వెల్‌నెస్ , స్పిర్చువల్ టూరిజం, స్పోర్ట్స్ టూరిజం రంగాలను అభివృద్ధి చేస్తామని రేవంత్‌రెడ్డి సర్కారు ఎంతో ఆర్భాటంగా చెప్పింది. కానీ, వాటిపై ఇంతవరకు కనీస దృష్టి పెట్టకపోవడం విడ్డూరంగా ఉన్నది.

3 లక్షల ఉద్యోగాలు ఏమయ్యాయి?

టూరిజం పాలసీ ద్వారా 2030 నాటికి మొత్తం రూ.15 వేల కోట్ల పెట్టుబడులు ఆకర్షించడంతోపాటు 3 లక్షల మంది యువతకు ఉద్యోగాలు కల్పించడమే లక్ష్యమని చెప్పిన రేవంత్‌రెడ్డి ప్రభుత్వం.. ఇప్పటివరకు కనీసం ఒక్కరికి కూడా ఉద్యోగం కల్పించలేకపోయింది. రాష్ట్రంలో కాంగ్రెస్ అధికారంలోకి వచ్చినప్పటి నుంచి పర్యాటక రంగం పూర్తిగా పడకేసింది. సీఎం రేవంత్‌రెడ్డితోపాటు ప్రభుత్వ పెద్దలెవరూ ఆ శాఖను పట్టించుకోకపోవడమే ఇందుకు కారణంగా కనిపిస్తున్నది.

రాబడి



మీకిది తెలుసా..?

ఎస్ఎఫ్‌టీ రిటర్నుల ద్వారా ఐటీ శాఖకు లావాదేవీల వివరాలు

అన్ని బ్యాంకులు, మ్యూచువల్ ఫండ్స్, వివిధ బ్యాంకింగేతర ఆర్థిక సంస్థలు, రిజిస్ట్రార్స్, పోస్టాఫీస్ వర్గాలు, క్రెడిట్ కార్డు జారీ చేసే సంస్థల వంటివి ఆదాయ పన్ను (ఐటీ) శాఖకు రిటర్నులు దాఖలు చేయాల్సి ఉంటుంది. దీన్నే 'స్టేట్‌మెంట్ ఆఫ్ ఫైనాన్షియల్ ట్రాన్జాక్షన్ (ఎస్ఎఫ్‌టీ)' అంటారు. ఇందులో ట్యాక్స్‌పేయర్ ద్వారా జరిగిన ఆర్థిక లావాదేవీలన్నింటి వివరాలనూ ఆయా సంస్థలు పేర్కొంటాయి. ఇక పాన్ ఆధారిత సమాచారం.. మీరు చేసే ఆర్థిక కార్యకలాపాలు ఏవైనా పన్ను ఎగవేతలకు దారితీస్తున్నాయా? అన్న కోణంలో ఐటీ శాఖ అధికారులకు నిఘా పెట్టేందుకు వీలు కల్పిస్తుంది. పరిమితికి మించి మీరు చేసే ప్రతీ లావాదేవీకి పాన్‌ను వినియోగించాల్సిందేనన్నది తెలిసిందే. దీంతో ఐటీ శాఖ పరిశీలిస్తున్నప్పుడు ఎస్ఎఫ్‌టీలో అవకతవకలు కనిపిస్తే.. సదరు ట్యాక్స్‌పేయర్స్‌కు తాఖీదులు తప్పవు.

ఉదాహరణకు.. ఐటీ రిటర్న్‌లో ఓ వ్యక్తి వార్షిక ఆదాయం రూ.2 లక్షలుగా చూపుతున్నప్పుడు, అదే వ్యక్తి రూ.14 లక్షల విలువైన బంగారాన్ని కొనుగోలు చేసినట్టు ఐటీ శాఖ స్క్రూటినీలో గుర్తిస్తే అది ఆందోళనకరమే. బంగారం కొనేందుకు నగదు ఎక్కడి నుంచి వచ్చిందనేదానికి సమాధానం చెప్పాల్సి ఉంటుంది.

ఆదాయాలు దాస్తే..

ట్యాక్స్‌పేయర్ తన ఐటీ రిటర్నుల్లో పేర్కొన్న ఆదాయానికి, ఎస్ఎఫ్‌టీ ద్వారా నివేదించబడిన లావాదేవీలు, ఆన్యువల్ ఇన్ఫర్మేషన్ స్టేట్‌మెంట్ (ఏఐఎస్)లో ఉన్న సమాచారాలకు పొంతన కుదరకపోవడాన్ని ఐటీ శాఖ గుర్తిస్తే నోటీసులు వస్తాయి. దీనిపై సరైన సమాధానం ఇవ్వకపోతే జరిమానాలు, జైలుశిక్షలు ఖాయం. మీరు ఉద్దేశపూర్వకంగానే రూ.25 లక్షలకు మించి పన్ను ఎగవేతలకు పాల్పడినట్టు రుజువైతే కనిష్ఠంగా 6 నెలలు, గరిష్ఠంగా 7 ఏండ్ల కఠిన కారాగారం తప్పదు. జరిమానా కూడా ఉంటుంది. తప్పుడు సమాచారం ఇచ్చారని తేలితే కనిష్ఠంగా 3 నెలలు, గరిష్ఠంగా 2 ఏండ్ల జైలుశిక్ష, జరిమానాలను ఎదుర్కోవాల్సి ఉంటుంది. జరిమానాలను 50 శాతం నుంచి 200 శాతం వరకు విధించే వీలున్నది.

ఎస్ఎఫ్‌టీల్లో ఈ లావాదేవీలు..


- బ్యాంక్ డ్రాఫ్ట్స్ లేదా పే ఆర్డర్స్ లేదా బ్యాంక్ చెక్కులకు సంబంధించి జరిగే నగదు లావాదేవీలు
- ఆర్బీఐ జారీచేసే ప్రీ-పెయిడ్ ఇన్‌స్ట్రుమెంట్స్ కొనుగోళ్లు
- ఒకటి లేదా అంతకన్నా ఎక్కువగా వ్యక్తిగత కరెంట్ ఖాతాల్లో నగదు డిపాజిట్లు
- నగదు ఉపసంహరణలు
- బంగారం తదితర క్రయవిక్రయాలు
- క్రెడిట్ కార్డుల చెల్లింపులు
- ఒకటి లేదా అంతకంటే ఎక్కువగా టైమ్ డిపాజిట్లు
- కంపెనీల బాండ్లు, డిబెంచర్ల లావాదేవీలు
- షేర్ల కొనుగోళ్లు
- మ్యూచువల్ ఫండ్స్, ఇతరత్రా పెట్టుబడులు
- స్థిరాస్తి లావాదేవీలు
- విదేశీ కరెన్సీ లావాదేవీలు

లాంజ్‌ల్లో లగ్జరీ ఆతిథ్యం

దేశీయ విమానాశ్రయాల్లో దొరికేవి ఉచితాలేనా?

భారతీయ ప్రయాణీకులకు ఎయిర్‌పోర్ట్ లాంజ్‌లు ఎంతో సౌకర్యవంతంగా మారుతున్నాయి. ఉచితంగా ఆహారం, పానీయాలు, వైఫై, రిక్లైనర్స్, చార్జింగ్ పాయింట్లేగాక.. కొన్నిసార్లు స్పా లేదా స్లీపింగ్ పాడ్స్ సదుపాయాలూ ఉంటున్నాయి మరి. దీంతో ప్యాసింజర్లకు లాంజ్‌లు అత్యంత ఆకర్షణీయంగా మారాయిప్పుడు. అయితే ఇవన్నీ నిజంగా విమాన ప్రయాణీకులకు ఉచితంగానే లభిస్తున్నాయా? లేదా పరోక్షంగా ఏమైనా చెల్లిస్తున్నామా? మరి ఎక్కడ్నుంచి.. ఎవరి దగ్గర్నుంచి వసూలు చేస్తున్నారు?





దేశంలోని విమానాశ్రయాల్లోగల లాంజ్‌ల్లోకి వెళ్తే.. ప్రయాణీకులెవరూ తమ జేబుల్లో నుంచి ఒక్క పైసా కూడా తీయనక్కర్లేదు. మీ క్రెడిట్ కార్డ్ లేదా డెబిట్ కార్డులనూ స్వైప్ చేయాల్సిన పని అంతకన్నా ఉండదు. అన్నీ ఉచితమే. అయితే హెచ్‌డీఎఫ్‌సీ, ఐసీఐసీఐ, యాక్సిస్, ఎస్బీఐ లేదా రూపే తదితర కార్డులను వినియోగిస్తూ మీరు లాంజ్‌లోకి వెళ్లిన ప్రతిసారీ మీ తరపున మీ కోసం సదరు బ్యాంక్ లేదా వీసా/మాస్టర్‌కార్డ్/అమెక్స్ వంటివి లాంజ్ నిర్వాహకులకు బిల్లులు చెల్లిస్తాయి. ఇవన్నీ కూడా మీ క్రెడిట్ కార్డ్ బెనిఫిట్ ప్యాకేజ్‌లో భాగమే. లాయల్టీగా ఈ ఖర్చులను అవన్నీ భరిస్తాయి. ఇక సాధారణంగా దేశంలో లాంజ్ ఖర్చు ఒక్కో ప్రయాణీకునికి ఒకసారికి రూ.600-1,200 మధ్య ఉంటుంది. విదేశీ లాంజ్‌లకు ఇది 25 డాలర్ల నుంచి 35 డాలర్లదాకా ఉంటుంది. ప్రయార్టీ పాస్ లేదా లాంజ్‌కీ వంటి నెట్‌వర్క్‌ల ద్వారా ఈ సౌకర్యాలను అందుకోవచ్చు. అప్పుడు క్విక్ సాండ్‌విచ్, కాఫీ ఖర్చులనూ ప్రయాణీకులు పెట్టుకోనవసరం లేదు.

ఇదీ సంగతి..

ఎక్కడైనాసరే లాంజ్‌ల్లోకి ప్రవేశించేందుకు సాధారణంగా ఎవరికైనా 4 దారులుంటాయి. క్రెడిట్ లేదా డెబిట్ కార్డ్ టై-అప్స్, ప్రయార్టీ పాస్ లేదా డ్రీమ్‌ఫోక్స్ వంటి ఇంటర్నేషనల్ నెట్‌వర్క్స్, ఎంట్రీ ఫీజు నేరుగా చెల్లించడం (సాధారణంగా రూ.1,500-3,000 ఉంటుంది), గరిష్ఠ శ్రేణి తరగతుల్లో ప్రయాణించేందుకు కొన్న విమాన టిక్కెట్ల ద్వారా లాంజ్‌ల్లోకి వెళ్లవచ్చు. అయితే భారత్‌లో మొదటిదే ఎక్కువగా వాడుకలో ఉంటుంది. కస్టమర్లను ఆకర్షించడానికి బ్యాంకులే ఆ సదుపాయాల్ని కల్పిస్తాయి. అయితే ఇదేదో దయాగుణంతోనే, దాతృత్వంతోనో బ్యాంకులు చేయవు. లాంజ్ యాక్సెస్ అనేది ఓ శక్తివంతమైన మార్కెటింగ్ సాధనం. దీనివల్ల కార్డుదారులు తమ కార్డులను తరచూ వినియోగిస్తూ ఉంటారు. దానివల్ల బ్యాంకులకు లావాదేవీ ఫీజుల రూపంలో ఆదాయం సమకూరుతుంది. కస్టమర్లు కూడా ప్రీమియం కార్డులకు అప్‌గ్రేడ్ కావాలని చూస్తూ ఉంటారు. దీంతో వ్యాపారం కూడా పెరుగుతుంది. ఇక అంతర్జాతీయ విమానాశ్రయాల్లో లాంజ్ సేవల విషయానికొస్తే.. లాంజ్‌కీ, ప్రయార్టీ పాస్ మరో రకంగా ఈ మొత్తం ప్రక్రియను చక్కబెడ్తాయి. వీటికి సొంతంగా లాంజ్‌లేమీ ఉండవు. అయినప్పటికీ మధ్యవర్తిత్వంగా వ్యవహరిస్తూ బ్యాంకులకు బల్క్‌గా లాంజ్ ప్రవేశ హక్కులను అమ్మేస్తాయి. లాంజ్ ఆపరేటర్లతో నేరుగా చెల్లింపు లావాదేవీలకు వీలు కల్పిస్తాయి.

గుర్తుంచుకోండి..

దేశీయ విమానాశ్రయాల్లో లాంజ్‌ల వినియోగం ఇటీవలికాలంలో విపరీతంగా పెరిగిపోతున్నది. ఢిల్లీ, ముంబై, బెంగళూరు, హైదరాబాద్, చెన్నై వంటి ప్రధాన రద్దీ విమానాశ్రయాల్లోనైతే ఇక చెప్పనే అక్కర్లేదు. దీంతో బ్యాంకులు సైతం ఆంక్షలు పెడుతున్నాయి. 3 నెలలకు 4సార్లు మాత్రమే ఉచిత ప్రవేశానికి అనుమతినిస్తున్నాయి. దేశీయ ఎయిర్‌పోర్టులకే పరిమితం చేస్తున్నాయి. సప్లిమెంటరీ కార్డుదారులకు మినహాయింపులనివ్వడం లేదు. గెస్ట్ యాక్సెస్ ఉండట్లేదు. కార్డ్ యాక్టివ్‌గా ఉండకపోతే లాంజ్ వినియోగం రద్దు. అయితే హెచ్‌డీఎఫ్‌సీ ఇన్ఫినియా, యాక్సిస్ రిజర్వ్, అమెక్స్ ప్లాటినమ్, ఐసీఐసీఐ ఎమరాల్డ్ వంటి ప్రీమియం కార్డులు అపరిమితంగా లేదా అంతర్జాతీయ లాంజ్ ప్రవేశాలను కల్పిస్తున్నాయి. మొత్తానికి ఎయిర్‌పోర్ట్ రెస్టారెంట్లతో పోల్చితే ఆహారం, పానీయాలపై రూ.500-1,000దాకా ఎయిర్ ప్యాసింజర్లు ఆదా చేసుకోవచ్చు. పైగా ఉచిత వైఫై, ఏసీ, చార్జింగ్ స్టేషన్లు, శుభ్రమైన టాయిలెట్ల విలువ చెప్పలేనిదే.



ఫెడ్ ద్రవ్యసమీక్షపై ఆధారం!

అమెరికా సుంకాలు, విదేశీ మదుపరుల పెట్టుబడుల ఉపసంహరణల మధ్య త్రైమాసిక జీడీపీ వృద్ధి, జీఎస్టీ సంస్కరణలతో దేశీయ స్టాక్ మార్కెట్లు అమ్మకాల ఒత్తిడి నుంచి తేరుకున్నాయి. ఈ క్రమంలోనే గతవారం సెన్సెక్స్ 1,193.94 పాయింట్లు బలపడి 81,904.70 వద్ద ముగిసింది. నిఫ్టీ సైతం 373 పాయింట్లు కోలుకుని 25,114 దగ్గర నిలిచింది. అయితే ఈ వారం మార్కెట్లపై అమెరికా ఫెడ్ రిజర్వ్ ద్రవ్యసమీక్ష నిర్ణయాల ప్రభావం ఎక్కువగా కనిపించే వీలున్నది. ఇక జీఎస్టీ కోతలతో ఎఫ్ఎంసీజీ, కన్జ్యూమర్ డ్యూరబుల్స్ షేర్లు ఆకర్షణీయమన్న విశ్లేషణలు వినిపిస్తున్నాయి. ఆటో షేర్లకూ గిరాకీ ఉండొచ్చని అభిప్రాయపడుతున్నారు. అయితే ఆల్‌టైమ్ కనిష్ఠ స్థాయిల్లో కదలాడుతున్న రూపాయి మారకం విలువ.. ట్రేడింగ్‌పై ప్రభావం చూపవచ్చన్న అంచనాలూ కనిపిస్తున్నాయి. ఇదే జరిగితే నష్టాలకు ఆస్కారం ఉన్నది. కాగా, అమ్మకాల ఒత్తిడి కనిపిస్తే నిఫ్టీకి 24,800 పాయింట్ల స్థాయి కీలకమైనదనుకోవచ్చు. దీనికి దిగువన ముగిస్తే 24,600 పాయింట్ల స్థాయిని మద్దతుగా చెప్పుకోవచ్చని అత్యధిక నిపుణుల మాట. అయితే సూచీలు పరుగందుకుంటే ఈ వారం నిఫ్టీ 25,400-25,600 స్థాయికి వెళ్లవచ్చని కూడా చెప్తున్నారు.

గమనిక..: స్టాక్ మార్కెట్ పెట్టుబడులు రిస్క్‌తో కూడుకున్నవి. పెట్టుబడులు పెట్టే ముందు ఆర్థిక నిపుణుల సలహా తీసుకోవడం, ఆయా సాధనాల డాక్యుమెంట్లను క్షుణ్ణంగా చదువుకోవడం ఉత్తమం. అలాగే పైన పేర్కొన్న సూచనలు విశ్లేషకుల అభిప్రాయం మాత్రమే. దీనికి మా పత్రిక ఎటువంటి బాధ్యత వహించదు.

లోక్ అదాలత్‌తో 1.65 లక్షల కేసుల పరిష్కారం

- వివరాలు వెల్లడించిన సీఐడీ డీజీ చారుసిన్హా

హైదరాబాద్, సెప్టెంబర్ 14 (నమస్తే తెలంగాణ) : ఈ నెల 2 నుంచి 13 వరకు రాష్ట్రవ్యాప్తంగా నిర్వహించిన జాతీయ లోక్ అదాలత్ ద్వారా 1.65 లక్షల కేసులను పరిష్కరించినట్టు సీఐడీ డీజీ చారుసిన్హా వెల్లడించారు. ఈ మేరకు ఆమె ఆదివారం ఒక ప్రకటన విడుదల చేశారు. సుప్రీంకోర్టు సూచనల మేరకు ఇరుపక్షాల మధ్య సయోధ్య కుదిర్చి.. 1,65,522 కేసులు పరిష్కరించినట్టు తెలిపారు. మొత్తం 4,539 మంది బాధితులకు ఒకేరోజు రూ.12.94 కోట్ల రీఫండ్ అందించినట్టు వెల్లడించారు. అంతకుముందు 2,501 మంది బాధితులకు రూ.27.91 కోట్ల రీఫండ్ అందించడంతో మొత్తం రూ.40.86 కోట్ల రీఫండ్‌ను 7,040 మంది బాధితులకు అందించినట్టు చెప్పారు. ఈ ఏడాది అన్ని అదాలత్‌లతో కలిపి మొత్తం రూ.138.04 కోట్ల సైబర్ నేరాల ఫ్రీజింగ్ అమౌంట్‌ను 18,872 మందికి అందజేసినట్టు ఆమె వివరించారు. రూ.40.86 కోట్ల రీఫండ్‌లో అత్యధికంగా సైబరాబాద్ కమిషనరేట్ పరిధిలో రూ.11.51 కోట్లు, హైదరాబాద్ కమిషరేట్‌లో రూ. 9.29 కోట్లు, రాచకొండ పరిధిలో రూ.6.41 కోట్లు, సీఎస్‌బీ హెడ్ క్వార్ట్స్ పరిధిలో రూ.4.21 కోట్లు, సంగారెడ్డి జిల్లా నుంచి రూ.1.04 కోట్లు టాప్-5లో ఉన్నట్టు తెలిపారు. 2024 మార్చి నుంచి 2025 సెప్టెబర్ వరకు 36,786 మంది బాధితులకు రూ.321 కోట్లు రీఫండ్ చేసినట్టు స్పష్టంచేశారు.

అత్యధికంగా ఈ-పెట్టీ కేసులు

జాతీయ లోక్ అదాలత్‌లో సయోధ్యతో ముగిసిన ఎఫ్ఐఆర్ కేసులు 20,964 ఉన్నట్టు చారుసిన్హా తెలిపారు. విపత్తు నిర్వహణ చట్టం కేసులు 883, ఈ-పెట్టీ కేసులు 75,430, మోటారు వాహన చట్టం కేసులు 61,205, సైబర్ నేరాల కేసులు 7,040 ఉన్నట్టు వివరించారు. వీటిలో హైదరాబాద్ కమిషనరేట్ పరిధిలో 29,023 కేసులు, రాచకొండ పరిధిలో 22,278, నల్లగొండ జిల్లాలో 14,002, వరంగల్‌లో 10,309, రామగుండం పరిధిలో 8,358 కేసులు పరిష్కరించిన ట్టు వెల్లడించారు. పోలీస్ యూనిట్లు సమన్వయంతో పనిచేసి ఈ విజయాన్ని సాధించినట్టు చెప్పారు.

నేటి నుంచి ఐసెట్ తుది విడత కౌన్సెలింగ్

హైదరాబాద్, సెప్టెంబర్ 14 (నమస్తే తెలంగాణ) : ఎంబీఏ, ఎంసీఏ కోర్సుల్లో సీట్ల భర్తీకి ఐసెట్ తుది విడత కౌన్సెలింగ్ సోమవారం నుంచి ప్రారంభంకానున్నది. 16న సర్టిఫికెట్ వెరిఫికేషన్ నిర్వహిస్తారు. 16 నుంచి17 వరకు వెబ్ ఆప్షన్లు ఎంచుకోవచ్చు. 20న సీట్లు కేటాయిస్తారు. వివరాల కోసం https://tgicet.nic.in వెబ్‌సైట్‌ను సంప్రదించాలని అడ్మిషన్స్ కమిటీ కన్వీనర్ శ్రీదేవసేన సూచించారు.

బీఈడీలో మరో 7,441 సీట్లు భర్తీ

హైదరాబాద్, సెప్టెంబర్ 14 (నమస్తే తెలంగాణ) : రెండేండ్ల బీఈడీ కోర్సులో సీట్ల భర్తీకి నిర్వహించిన టీజీ ఎడ్‌సెట్ రెండో విడత కౌన్సెలింగ్‌లో మరో 7,441 సీట్లు భర్తీ అయ్యాయి. రెండో విడతలో 12,076 మంది వెబ్ ఆప్షన్లు ఎంచుకోగా, 7,441 మంది సీట్లు దక్కించుకున్నట్టు ప్రవేశాల కమిటీ కన్వీనర్ పాండు రంగారెడ్డి తెలిపారు. 18లోపు కాలేజీల్లో రిపోర్ట్‌చేయాలని సూచించారు.

విద్యాహక్కు చట్టాన్ని సవరించాలి : యూటీఎఫ్

హైదరాబాద్, సెప్టెంబర్ 14 (నమస్తే తెలంగాణ): టెట్ నుంచి టీచర్లకు రక్షణ కల్పించాలంటే విద్యాహక్కు చట్టం సెక్షన్ 23ని సవరించాలని స్కూల్ టీచర్స్ ఫెడరేషన్ ఆఫ్ ఇండియా(ఎస్టీఎఫ్ఐ) జాతీయ ప్రధాన కార్యదర్శి, టీఎస్ యూటీఎఫ్ రాష్ట్ర అధ్యక్షుడు చావ రవి డిమాండ్ చేశారు. ఆదివారం నిర్వహించిన టీఎస్ యూటీఎఫ్ రాష్ట్ర కమిటీ సమావేశంలో ఆయన మాట్లాడారు. సెప్టెంబర్ 1న సుప్రీంకోర్టు ఇచ్చిన తీర్పుతో ఇన్ సర్వీస్ టీచర్లంతా రెండేండ్లల్లో టెట్ పాస్ కావాల్సి ఉందని, లేదంటే టీచర్ ఉద్యోగం కోల్పోయే ప్రమాదం పొంచి ఉందని వాపోయారు.

పాత పింఛన్ అమలు చేసే పార్టీలకే ఓటు: స్థితప్రజ్ఞ

హైదరాబాద్, సెప్టెంబర్ 14 (నమస్తే తెలంగాణ): పాత పింఛన్ అమలు చేసే పార్టీలకే ఓటు వేయాలని నేషనల్ మూవ్‌మెంట్ ఫర్ ఓల్డ్ పెన్షన్ స్కీం(ఎంవోపీఎస్) సెక్రటరీ జనరల్ స్థితప్రజ్ఞ పిలుపునిచ్చారు. సీపీఎస్‌ను రద్దు చేసే పార్టీలకే పట్టంకట్టాలని సూచించారు. ఆదివారం బీహార్‌లోని పాట్నాలో నిర్వహించిన ర్యాలీలో ప్రసంగించారు. ఉద్యోగి పెన్షన్ రాష్ట్ర ప్రభుత్వ పరిధిలోనిదని వెల్లడించారు. సీపీఎస్‌ను రద్దు చేస్తామని హామీ ఇచ్చి తెలంగాణ, కర్ణాటకల్లో కాంగ్రెస్ అధికారంలోకి వచ్చిందని మండిపడ్డారు. రెండు దశాబ్దాల తర్వాత ఎన్‌పీఎస్ నిష్ప్రయోజనకరంగా మారిందని తెలిపారు. ర్యాలీలో తెలంగాణ సీపీఎస్ ఎంప్లాయిస్ యూనియన్ ప్రధాన కార్యదర్శి కల్వల్ శ్రీకాంత్, పలు రాష్ట్రాల నేతలు పాల్గొన్నారు.

ఉద్యాన పంటలపై 18,19న జాతీయ సదస్సు

- ఉద్యానవన వర్సిటీ వీసీ డాక్టర్ దండ రాజిరెడ్డి

హైదరాబాద్, సెప్టెంబర్ 14 (నమస్తే తెలంగాణ): ఉద్యానవన పంటలపై వాతావరణ మార్పుల ప్రభావం అనే అంశంపై శ్రీ కొండా లక్ష్మణ్ తెలంగాణ ఉద్యానవన వర్సిటీ, తెలంగాణ ఉద్యానవనశాఖలు సంయుక్తంగా ఈనెల 18,19తేదీల్లో జాతీయ సదస్సు నిర్వహించనున్నట్టు ఉద్యానవన వర్సిటీ వీసీ డాక్టర్ దండ రాజిరెడ్డి ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. ములుగులోని ఉద్యానవనవర్సిటీ క్యాంపస్‌లో నిర్వహించే ఈ జాతీయ సదస్సులో 'వాతావరణ మార్పులు - ఉద్యానవన పంటలపై ప్రభావం, నివారణ చర్యలు' అనే అంశంపై చర్చలు జరుపనున్నట్టు పేర్కొన్నారు.

'జూబ్లీ'లో నవీన్‌యాదవ్ వైపే మొగ్గు!

- అంజన్ కుమార్ ఔట్.. బొంతు రామ్మోహన్‌కు మొండిచెయ్యి
- అసదుద్దీన్ సూచనలే ప్రామాణికంగా కాంగ్రెస్ అభ్యర్థి ఖరారు!
- టీపీసీసీ చీఫ్, ఇన్‌చార్జి మంత్రులతో రేవంత్‌రెడ్డి భేటీ

హైదరాబాద్, సెప్టెంబర్ 14 (నమస్తే తెలంగాణ) : జూబ్లీహిల్స్ ఉప ఎన్నికల్లో కాంగ్రెస్ అభ్యర్థి దాదాపు ఖరారైనట్టు తెలిసింది. మొదటి నుంచీ ఊహించినట్టుగా ఎంఐఎం ఆశీస్సులు పుష్కలంగా ఉన్న చిన్న శ్రీశైలం యాదవ్ కుమారుడు నవీన్ కుమార్ యాదవ్ వైపే సీఎం రేవంత్ రెడ్డి మొగ్గుచూపినట్టు తెలిసింది. ఇక్కడి నుంచి టికెట్ కోసం తీవ్ర ప్రయత్నాలు చేసిన పార్టీ సీనియర్ నేత అంజన్ కుమార్ యాదవ్, బొంతు రామ్మోహన్‌కు మొండిచెయ్యి చూపినట్టు అత్యంత విశ్వసనీయ సమాచారం. జూబ్లీహిల్స్ నియోజకవర్గంలో ముస్లిం ఓటర్ల తర్వాత యాదవ సామాజికవర్గం ఓట్లే ఎక్కువ ఉండటం, ముస్లిం మైనార్టీయేతర అభ్యర్థిని నిలబెడితేనే తమ పార్టీ మద్దతు కాంగ్రెస్‌కు ఉంటుందని ఎంపీ అసదుద్దీన్ ఒవైసీ చేసిన సూచనలకు అనుగుణంగానే కాంగ్రెస్ ఈ నిర్ణయం తీసుకున్నట్టు తెలిసింది. జూబ్లీహిల్స్ ఉప ఎన్నికపై సీఎం రేవంత్‌రెడ్డి నివాసంలో శనివారం సాయంత్రం కీలక సమావేశం జరిగింది. ఈ భేటీకి పీసీసీ చీఫ్ మహేశ్ కుమార్ గౌడ్, మంత్రి పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డి, జూబ్లీహిల్స్ ఉప ఎన్నికల ఇన్‌చార్జి మంత్రులు పొన్నం ప్రభాకర్, తుమ్మల నాగేశ్వర్‌రావు, గడ్డం వివేక్, ఎంపీ అనిల్‌కుమార్ యాదవ్, జీహెచ్‌ఎంసీ మేయర్ విజయలక్ష్మి, ఏఐసీసీ కార్యదర్శి విశ్వనాథన్, జూబ్లీహిల్స్ నియోజకవర్గ పరిధి కార్పొరేటర్లు హాజరయ్యారు. అభ్యర్థి విషయంలో కాంగ్రెస్ నేతలు కసరత్తు చేసి పార్టీ తరపున టీపీసీసీ అధ్యక్షుడు మహేశ్‌కుమార్ గౌడ్ చేయించిన రహస్య సర్వేను సీఎం, మంత్రుల ముందు పెట్టినట్టు తెలిసింది.

చక్రం తిప్పిన మజ్లిస్.. నవీన్‌కే టికెట్

జూబ్లీహిల్స్ నియోజకవర్గంలో సుమారు 70 వేల మంది మైనార్టీ ఓటర్లున్నారు. ఆ తర్వాత యాదవ సామాజికవర్గ ఓటర్లే ఎక్కువ సంఖ్యలో ఉన్నారు. ఈ నేపథ్యంలో ఉప ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీ ఎంఐఎం సహకారం కోరింది. అయితే మైనార్టీ లీడర్‌కు కాకుండా ఇతరులెవరికి టికెట్ ఇచ్చినా తమకు అభ్యంతరం లేదని, కాంగ్రెస్‌కు మద్దతిస్తామని , తమ పార్టీ అభ్యర్థిని బరిలో దించబోమని ఎంపీ అసదుద్దీన్ ప్రకటించారు. ఆయన ప్రకటనకు అనుగుణంగానే ఈ రోజు భేటీలో కాంగ్రెస్ నిర్ణయం తీసుకున్నట్టు తెలిసింది. సీక్రెట్ సర్వేలు చేయించిన టీపీసీసీ, ఆశావాహుల లిస్టును వడగట్టి సీఎం రేవంత్‌రెడ్డి ముందు పెట్టినట్టు తెలిసింది. చిన్నశ్రీశైలం యాదవ్ కుమారుడు నవీన్ యాదవ్, అంజన్‌కుమార్ యాదవ్, అనిల్ కుమార్ యాదవ్, బొంతు రామ్మోహన్ తదితరుల పేర్లతో ఫైనల్ లిస్టు తయారు చేసి సమర్పించగా అంతిమంగా నవీన్‌కుమార్ యాదవ్ వైపే రేవంత్‌రెడ్డి మొగ్గు చూపినట్టు తెలిసింది.

ముగ్గురు మంత్రులకు సూచనలు

ఇప్పటికే కాంగ్రెస్ పార్టీ జూబ్లీహిల్స్ నియోజకవర్గ బాధ్యతలను ముగ్గురు మంత్రులకు అప్పగించింది. నియోజకవర్గాన్ని మూడు భాగాలుగా విభజించింది. ఒక్కో మంత్రికి రెండు డివిజన్ల చొప్పున కేటాయించింది. మంత్రులు పొన్నం ప్రభాకర్‌గౌడ్, తుమ్మల నాగేశ్వర్‌రావు, గడ్డం వివేక్‌కు బాధ్యతలు అప్పగించింది. ప్రతి మంత్రికి ఆరుగురు కార్పొరేటర్ల చొప్పున మొత్తం 18 మందిని సహాయకులుగా పెట్టింది. డివిజన్ల వారీగా మంత్రులు తెచ్చిన సమాచారంపై సమావేశంలో ప్రాథమికంగా చర్చ జరిగినట్టు తెలిసింది. డబ్బుకు వెనుకాడకుండా గల్లీ స్థాయి నేతలను పార్టీలోకి లాగాలని వారికి రేవంత్ రెడ్డి సూచించినట్టు తెలిసింది.

మరిన్ని వార్తలు ntnews.com లో చూడగలరు

జిందగీ
చింతన
నమస్తే తెలంగాణ హైదరాబాద్
సోమవారం 15 సెప్టెంబర్ 2025
www.ntnews.com

రుణ విముక్తికి మార్గం ఉత్తమ గతికి సోపానం

సనాతన ధర్మం ప్రకారం, మనం ఈ లోకంలోకి రాగానే అనేకమందికి రుణపడి ఉంటామని శ్రీమద్భాగవతం వివరిస్తుంది. దేవతలు, రుషులు, ఇతర జీవులు, మానవ సమాజంతో పాటు, మన జీవితాలను, కుటుంబ సంప్రదాయాలను పరిరక్షించిన పూర్వీకులకు కూడా మనం రుణపడి ఉంటాం. ఈ పితృ రుణాన్ని తీర్చకపోతే పాపులమై, పర్యవసానాలను అనుభవించాల్సి వస్తుందని శాస్త్రాలు చెబుతున్నాయి. ఈ రుణాలు తీర్చుకోవడానికి యజ్ఞాలను నిర్వహించడం, కృతజ్ఞతను వ్యక్తం చేయడం



మార్గాలు. పితృదేవతలకు జల తర్పణం ఇచ్చే పితృయజ్ఞం మొదలైనవి వేదాలు సూచించాయి. దేవతలు, రుషులు, పితృదేవతలు, జీవులు, సామాన్య మానవులకు ఉన్న ఐదు రకాల రుణాలను ఈ యజ్ఞాలు తీరుస్తాయి. పితృపక్షంలో ఈ కర్మలను ఆచరించడం.. పూర్వీకుల పట్ల మన బాధ్యతను నెరవేర్చడమే.

శ్రాద్ధ కర్మలో గోవిందుని కటాక్షం

శ్రాద్ధ కర్మలో శ్రీగోవిందుని (విష్ణువు) దివ్యకటాక్షం అత్యవసరం. అన్ని యజ్ఞాల అంతిమ లక్ష్యం శ్రీవిష్ణువును సంతృప్తి పరచడమే. శ్రీవిష్ణువుకు సమర్పించిన ప్రసాదాన్ని పితృదేవతలకు అర్పించడం వల్ల వాళ్లకు ఉత్తమగతులు ప్రాప్తిస్తాయి. శ్రాద్ధ కర్మ ఉద్దేశం శ్రీకృష్ణుడిని ప్రసన్నం చేసుకోవడం. తద్వారా ఆ ప్రసాదాన్ని పూర్వీకులకు సమర్పించి వారిని సంతోషపరచడమే. పితృలోక నివాసులు పుణ్యకార్యాలు చేసినవారై ఉంటారు, వారి వారసులు విష్ణు ప్రసాదాన్ని సమర్పించినంత కాలం వాళ్లు అక్కడ ఉండగలుగుతారు. అయితే, వారి పుణ్యఫలాలు క్షీణించినప్పుడు తిరిగి భూలోకానికి రావాలి. కనుక, పితృదేవతల ఉత్తమ గతికి శ్రీగోవిందుని కృప కీలకం.

వైకుంఠప్రాప్తి కల్పించే మార్గాలు

పితృదేవతలకు ఉత్తమ గతిని, విముక్తిని కల్పించడానికి కొన్ని మార్గాలు:

- శ్రీకృష్ణునికి నివేదించిన ప్రసాదాన్ని పూర్వీకుల పేరున సమర్పించడం వారి విముక్తికి తోడ్పడుతుంది.
- పూర్వీకుల పేరున ఇంట్లో సంకీర్తన యజ్ఞాన్ని (హరేకృష్ణ మహామంత్ర జపం) నిర్వహించవచ్చు.
- ప్రసాద సేవ, భాగవతులకు భోజనం, గోసేవ కోసం పూర్వీకుల పేరున విరాళాలు ఇవ్వడం శుభకరం.
- నియమితంగా భగవంతుడి పవిత్ర నామాలను జపించడం వల్ల పూర్వీకులకు మేలు జరుగుతుంది. శ్రీకృష్ణుడికి శరణాగతి పొంది, భక్తి సేవను నిజాయతీగా ఆచరించేవారు పితృ రుణం సహా అన్ని రుణాల నుంచి విముక్తులు అవుతారని శ్రీమద్భాగవతం చెబుతున్నది.

మహామంత్ర జపం

ఈ కలియుగంలో యజ్ఞాలు నిర్వహించడం కష్టం, ఖర్చుతో కూడుకున్నది. శ్రీకృష్ణుడికి శరణాగతి పొంది, సంకీర్తన యజ్ఞాన్ని (హరేకృష్ణ మహామంత్ర జపం) నిర్వహించడమే అత్యంత సులభమైన, ప్రభావవంతమైన ఆధ్యాత్మిక మార్గమని బోధిస్తుంది శ్రీమద్భాగవతం. 'హరే కృష్ణ హరే కృష్ణ కృష్ణ కృష్ణ హరే హరే / హరే రామ హరే రామ రామ రామ హరే హరే' అనే మహామంత్రాన్ని బిగ్గరగా జపించడం ద్వారా సంకీర్తన యజ్ఞం చేయవచ్చు. ఈ భక్తి సేవ ద్వారా, శ్రీకృష్ణుడికి సంపూర్ణంగా శరణాగతి పొందిన వ్యక్తి అన్ని రుణాల నుంచి విముక్తుడవుతాడన్నది నిస్సందేహం.

...✍ శ్రీమాన్ సత్యగౌర చంద్రదాస ప్రభూజీ, 96400 86664

జాంబవతీ సత్యభామల స్వీకరణ





శుకుడు పరీక్షిత్తుతో... వసుమతీశా! (రాజా!) ద్వారకాపతి హరి జాంబవతీదేవిని సతి– సహధర్మచారిణిగా పరిగ్రహించాడు. దరిమిల– పిమ్మట, సత్రాజిత్తును రాజసభకు రప్పించి, జరిగినదంతా ఎరిగించి– చెప్పి మణిని అతనికి అప్పగించాడు. సత్రాజిత్తు సిగ్గుపడి మణిని పుచ్చుకొని పశ్చాత్తాపం చెందాడు. బలవంతునితో విరోధం కలిగినందుకు కలవరపడ్డాడు. ఇంటికి చేరి..

కం॥ 'పాపాత్ముల పాపములం
బాపంగా నోపు నట్టి పద్మాక్షునిపై
బాపము గలదని నొడివిన
పాపాత్ముని పాపమునకు బారము గలదే?'

'పాపాత్ములైన వారి పాపాలన్నీ పోకార్చ– నశింపజేయగల పద్మాక్షునిపై మణిని అపహరించాడనే అపనింద వేసిన పాపిని నేను. ఏపారు– అతిశయించిన ఈ నా పాపానికి పారం– అంతం ఉందా? మితభాషిగా ఉండక ఎందుకిలా మందమతినై నందనందనునిపై అమంద– లేనిపోని పెద్దనింద వేశాను? నేను ధనాశాపరుణ్ని, దుష్టుణ్ని, మత్తుణ్ని. ఈ నా మేను– దేహం కాల్చనా? నా ఖలం– పాపం ఎలా తొలగుతుంది? ఏ చందాన– రీతిగా ముకుందుడు నందాత్మజుడు ప్రీతుడై నన్ను కనికరించి కాపాడతాడు?' అని సత్రాజిత్తు పరితపించాడు.

ఆ॥ 'మణిని గూతు నిచ్చి మాధవు పదములు
పట్టుకొంటినేని బ్రదుకు గలదు
సంతసించు నతడు సదుపాయమగునిది
సత్య మితరవృత్తి జక్కబడదు'

స్యమంతక మణిని, దానితోపాటుగా నా కన్యకామణి సత్యభామను, సౌజన్య సంశోభితుడు, ధన్యుడు అయిన మాధవునికిచ్చి, ఆయన పాదాములు పట్టుకుంటాను. శ్రీకాంతుడు కృష్ణుడు సంతసిస్తాడు. అప్పుడే నాకు జీవన వసంతం. అంతకన్నా మరేవిధంగానూ నా దురితం– పాపం అంతం కాదు. ఇది సత్యం.

శుకయోగి– రాజా! ఇలా అనేక రీతుల తన ఇంట్లో ఏకాంతంగా ఆలోచించి సత్రాజిత్తు నీతి కని– విచారించి సుమతియై, ఆపదలనే సముద్రాలను తరింపజేసేవాడు, కాంతల స్వాంతా– మనసులను హరించేవాడు, దానవేశ్వరులను దునుమాడే– సంహరించేవాడు అయిన రమాకాంతుడు, రత్నగర్భుడు కృష్ణునికి తన కాంతారత్నాన్నీ, స్యమంతక రత్నాన్నీ సమర్పించాడు. తామరసాక్షుడు– పద్మనేత్రుడు, ఉదార యశోనిధి అయిన ద్వారకాధిపతి, అఖిల భూపతు (రాజు)లచే సకల సద్గుణవతిగా నుతింపబడినదీ, గొప్ప పాతివ్రత్యము, నీతి, ధర్మ విచక్షణత్వం, దయ, ఖ్యాతి– వీనియందు మహాప్రీతి (కాంక్ష) కలిగిన రామను, సోముని (చంద్రుని) మించిన ముఖకాంతి కలిగిన సత్యభామను భార్యగా గ్రహించాడు.

క॥ 'మణి యిచ్చినాడు వాసర
మణి, నీకును మాకు గలవు మణులు, కుమారీ
మణి చాలు నంచు గృష్ణుడు
మణి సత్రాజిత్తునకును మరలగనిచ్చెన్'

'ఈ స్యమంతకమణిని నీకు వాసరమణి– సూర్యభగవానుడు ప్రసాదించాడు. మాకూ ఇంతకు మించిన అణిమాది సిద్ధులనే మణులకు కొరత లేదు. ఈ కన్యకామణి చాలు. సత్రాజిత్తు అపుత్రుడు కాన ఈ మణిని ఈనే హేమా– బంగారానికి మేమే వారసులం' అని పలుకుతూ ఆమాని, విశ్వయోని యైన రుక్మిణీ



జాని హరి– కృష్ణుడు స్యమంతకమణిని తిరిగి సత్రాజిత్తుకు ఇచ్చివేశాడు. ప్రాస స్థానంలో మణి చతుష్టయంతో భాసించే పై 'మణి కందం'– మణి వంటి కంద పద్యం భక్త కవి శిరోమణి కవితా చేతనా ఖని– గని నుంచి జనియించిన అనేక పద్య గద్య మణి మాణిక్యాలలో ఒకటి!

ఇదిలా ఉండగా పాండవులు కుంతీ సమేతంగా లక్క ఇంటిలో చిక్కి కాలిపోయారని విన్నాడు వ్యాల– కాళియ మర్దనుడు కృష్ణుడు. సర్వమూ ఎరిగిన 'విన్నాణి– విజ్ఞాని' అయిన హరి బలరామ సమేతంగా కరి నగరానికి– హస్తినకు చేరి కృప, విదుర, గాంధారీ, భీష్మ, ద్రోణులను (పాండవులు మరణిస్తే బాధపడేవారు వీరే కనుక) ఊరడించాడు.

శుకుడు– పరీక్షిద్రాజా! అక్రూరుడు, కృతవర్మ కృష్ణ భక్తులు. వీరిద్దరూ– 'దుర్మార్గుడైన సత్రాజిత్తు సత్యభామని మనకిస్తానని చెప్పి మాధవునికిచ్చి మనువు– పెండ్లి చేసి మాట తప్పాడు. ఎలాగైనా నవ్వు ఆ స్యమంతక మణిని వశపరచుకో' అని శతధన్వుని ఉసిగొల్పారు. శతధన్వుడు నిద్రిస్తున్న సత్రాజిత్తుని కసిగా, కసాయివాడు పశువును కొట్టి చంపినట్లుగా బలవంతంగా అంతమొందించాడు. చెంతనున్న కాంతలు రోదిస్తూ ఎంతగా మొరపెట్టినా కనికరించక ఆ క్షుద్రుడు లోభంతో మణిని అపహరించుకుపోయాడు. సత్రాజిత్తు మరణానికి వంత–బాధపడుతూ సాత్రాజితి– సత్యభామ అతని శరీరాన్ని తైలద్రోణి– నూనె తొట్టిలో భద్రపరచి, హస్తినకు వెళ్లి ఆర్త శరణ్యుడైన తన భర్తకు కన్నతండ్రి మరణవార్తను విన్నవించింది. బలరామకృష్ణులు ఇలలో అవతరించిన ఈశ్వర స్వరూపులైనా లీలగా మనుష్య భావంతో విలపించారు. భామా బలరాములతో ద్వారకకు తిరిగి వచ్చిన రామానుజుడు ఘనశ్యాముడు కృష్ణుడు తనను కడతేర్చడానికే కడగట్టా– నిశ్చయించాడని గ్రహించి శతధన్వుడు ప్రాణభయంతో కృతవర్మ ఇంటికి వెళ్లి తనకు త్రాణ– రక్షణ కోరాడు.

కృతవర్మ ఇలా అన్నాడు... 'అక్కట!– అయ్యో! శతధన్వా! ఎంత పని చేశావయ్యా! మహానుభావులైన రామకృష్ణులను ఉక్కడగించగల– నశింపజేయగల సమర్థులు ఇక్కడ ఎవరున్నారు? వారి అపరిమిత పరాక్రమం మనకు అవిదితం– తెలియంది కాదు. కంసుడు సపరివారంగా ఖలవిదారి హరిచే సంహరింపబడలేదా? దురాధర్షుడు– దైత్యాదులకు కూడా దుర్దముడు, సురాధ్యక్షుడు– లోకపాలాది దేవతలకు కూడా అధ్యక్షుడు, జన్మ జరామరణాలను అతిక్రమించినవాడు అయిన మధురాపతి చేతిలో ఖ్యాతి గడించిన జరాసంధుడు పదిహేడు పర్యాయాలు పరాజితుడు కాలేదా?' ములుకుల వంటి కృతవర్మ పలుకులు విని నిరాశ చెందిన శతధన్వుడు 'హత విధీ!' అనుకుంటూ అక్రూరుని ఆశ్రయించాడు. చక్రాయుధునితో విక్రమించడానికి తనతో ఉపక్రమించమని అర్థించాడు. అక్రూరుడు శ్రీహరి బలపరాక్రమాలను పరిపరి విధాల వివరిస్తూ ఇలా పలికాడు..



తంగిరాల రాజేంద్రప్రసాద శర్మ
98668 36006

సీ॥ 'ఎవ్వడు విశ్వంబునెల్ల సలీలుడై
పుట్టించు రక్షించుబొలియ జేయు
నెవ్వని చేష్టలు నెరుగరు బ్రహ్మాదు
లెవ్వని మాయ మోహించు భువన
మేడేండ్ల పాపడై యే విభుడొక చేత
గోరక్షణమునకై కొండనెత్తె
నెవ్వడు కూటస్థు డీశ్వరుడద్భుత
కర్ముడనంతుండు కర్మసాక్షి'
తే॥ 'యట్టి ఘనునకు శౌరికి ననవరతము
మ్రొక్కెదము గాక విద్వేషమునకు నేము
వెఱతు మొల్లము నీవొండువెంట బొమ్ము
చాలు పదివేలు వచ్చె నీ సఖ్యమునను'

'ఎవడు ఈ విశ్వాన్ని అవలీలగా పుట్టించి, పెంచి పోషించి, ఆపై తుంచివేస్తాడో, ఎవని కృత్యాలు– పోకడలు బ్రహ్మాది వేలుపు– దేవతలకు కూడా పాలుపోక– డెందానికి అందకుండా ఉంటాయో, ఎవని అనిర్వచనీయ మాయ ఈ లోకాలన్నిటినీ శోక మోహ పరవశం చేస్తోందో, ఎవడు ఏడేండ్ల ప్రాయంలోనే ఏక హస్తాన గోవర్ధన గిరినెత్తి అమేయ– అమితమైన సాయం అందించి గోవులను, గోపాలురను వేల్పురాయని– ఇంద్రుని వలని అపాయం నుండి కాపాడాడో, ఎవడు కూటస్థుడో (ఏ పరమాత్మ ఏ కాలంలోనూ ఏ వికారాలూ– మార్పులు లేక నిశ్చలంగా– అవినాశిగా ఉంటాడో), పరమేశ్వరుడో, అద్భుత– ఆశ్చర్యకరమైన కర్మలు కలవాడో, అనంతుడో– దేశకాల వస్తువులచే పరిచ్ఛిన్నుడు– పరిమితుడు కానివాడో, ఎవడు సర్వజీవుల కర్మలకు సాక్షియో అట్టి ఘనుడైన ఫణిరాజ శయనునికి మేము అనవరతం– ఎల్లప్పుడూ కల్ల లేక ఉల్లములో వినయంతో నమస్కరించడానికి ఆరాటపడు వారమే కాని, ఆయనతో వైరం పెట్టుకొని పోరాట పడటానికి మనస్కరించే వారం కాము. నీ దారి నీవే చూసుకో. 'చాలు పదివేలు వచ్చె'– నీతోటి చెలిమికి ఒనగూరిన– ఒరగిన (లాభించిన) కలిమికి నమస్కారం. మాకు జరిగింది చాలు'. వ్యంగ్యం– వెటకారంతో కూడిన పటువైన (సమర్థమైన) తెనుగు నుడికారపు సొంపుతో ఇంపైన తేటగీతిలోని చివరి రెండు పాదాలు (అమూలకాలు) పోతన మహాకవి మెండైన స్వారస్యం గల పెంపుదల.

(సశేషం)

సూక్ష్మంలో మోక్షం

కథాసుధ

ఒక ఊర్లో ఓ వస్త్ర వ్యాపారి ఉండేవాడు. ఒకరోజు అతడు అద్దంలో తల దువ్వుకుంటూ ఉండగా తెల్ల వెంట్రుకలు కనిపించాయి. వయసు పైబడుతున్నదనే బాధ అతనిలో మొదలైంది. ఒలికిన పాలు, పగిలిన అద్దం తిరిగిరావన్న విషయం గుర్తుకొచ్చింది. ఉన్నంతలో ఆరోగ్యాన్ని కాపాడుకోవాలనుకున్నాడు. ప్రయత్నాలు ప్రారంభించాడు. అయితే అంగడి వదిలి బయటికి రాలేని పరిస్థితి. 'ఏం చేయాలా' అని ఆలోచించాడు. ఊరి పెద్దలను అడిగితే పరిష్కారం దొరుకుతుందని భావించాడు. 'ఖర్చు, శారీరక శ్రమ లేకుండా, అనుకున్నప్పుడు, కూర్చున్న చోటే, చేయగలిగే ఆరోగ్య రహస్యం ఏదైనా చెప్పమ'ని కనబడిన వారందరినీ అడిగాడు. అది సాధ్యమయ్యేపని కాదని చాలామంది తేల్చి చెప్పారు. కొందరు నవ్వి ఊరకున్నారు. మరికొందరు తిండి తగ్గించమని సలహా ఇచ్చారు. 'తింటే కదలలేను, తినకపోతే మెదలలేను కదా నేను' అని ఆ సలహాని అతను విననట్లే గమ్మున ఉండిపోయాడు. ఒకరోజు ఊర్లోని రాములవారి గుడి దగ్గర ప్రవచనాలు చెబుతూ ఉంటే అక్కడికి వెళ్లాడు. ఆ ప్రవచనకర్త ఉపన్యాసం అయ్యేంత వరకు అక్కడే ఉండి చిన్నగా తన బాధ చెప్పుకొన్నాడు. ఆయన వ్యాపారి భుజం తట్టి 'నీకోసం నువ్వు రోజూ ఓ గంట సేపు వెచ్చించగలవా?' అని అడిగాడు. కచ్చితంగా చేస్తానని బదులిచ్చాడు వ్యాపారి. ప్రవచనకర్త పక్కనే ఉన్న పూల తోటలోకి వ్యాపారిని తీసుకెళ్లి సులభమైన నాలుగు ముద్రలు నేర్పాడు. 'అంగడిలో ఉన్నప్పుడు ఖాళీ సమయాల్లో ముద్రలో ఉండు. చేతిలోని ఒక్కో వేలు పంచభూతాలలో ఒక్కో దానిని సూచిస్తుంది. వాటిని కలపడం ద్వారా శరీరంలోని మూలకాలు సమతుల్యం అవుతాయి. అలాగే ఉదయం అర గంట, సాయంత్రం అర గంట ప్రశాంత వాతావరణంలో కూర్చుని ఓం కారం పలుకు. ఇలా చేయడం ద్వారా శారీరక, మానసిక, ఆధ్యాత్మిక ఆరోగ్యం మెరుగుపడుతుంది' అని వివరించాడు. 'ఇన్నాళ్లూ ఇలాంటివి తెలియక, చేయక చాలా నష్టపోయాను కదా! మన భారత సంస్కృతి, సంప్రదాయాలు ఎంతో గొప్పవి. సూక్ష్మంలో మోక్షంగా మనకు ఎన్నో మంచి విషయాలు తెలియజేశాయి' అని తలుస్తూ అక్కడి నుంచి కదిలాడు.

...✍ ఆర్సీ కృష్ణస్వామి రాజు
93936 62821



అక్కడితో వచ్చేయాలా?


ధర్మ సందేహం

తిరుమల యాత్రకు వెళ్లినప్పుడు చివరిగా శ్రీకాళహస్తికి వెళ్లాలనీ, ఆ తర్వాత మరే క్షేత్రాలు దర్శించకుండా తిరుగు ప్రయాణం కావాలని నియమం ఏమైనా ఉందా. వివరించగలరు?

● **శ్రీనివాస్,** కామారెడ్డి

తిరుమల తిరుపతి మొదలైన పుణ్య క్షేత్రాలు వరుసగా సందర్శించేటప్పుడు శ్రీకాళహస్తి క్షేత్రాన్ని చివరి క్షేత్రంగా చేసుకోవాలన్న విశ్వాసం లోకంలో ఉన్నది. అక్కడితో యాత్ర ముగించి ఇంటికి రావాలని అంటారు. కానీ, ఈ విషయానికి సంబంధించి శాస్త్రీయమైన ఆధారాలు కనిపించవు. ఇది లోకాచారం మాత్రమే! శ్రీకాళహస్తి క్షేత్రం యోగ సంబంధమైన జ్ఞానం ప్రసాదించే దివ్యధామం. దీనికి తగ్గట్టే అక్కడ కొలువుదీరిన అమ్మవారికి జ్ఞానప్రసూనాంబ అన్న పేరు గమనించవచ్చు. యోగ సంబంధమైన జ్ఞానం సిద్ధించిన తర్వాత ఇక తీర్థయాత్రలతో పనిలేదనే అభిప్రాయంగా ఈ ఆచారం వ్యవహారంలోకి వచ్చింది.

...✍ శ్రీ



మహా సామ్రాజ్ఞిగా ఓ సామాన్య

ఆమె చూస్తే ఓ సామాన్య ఇజ్రాయేలీయ యూదా మహిళ! కానీ ఆశ్చర్యం, పర్షియా దేశాధినేత అయింది. కేవలం ప్రార్థనా బలమే ఆమెను ఆ స్థాయికి తీసుకెళ్లింది! ఆమె మహా అందగత్తె. అందానికి మించిన వినయం కలిగి ఉండేది. పెద్దల పట్ల గౌరవం ప్రదర్శించేది. అందరితో చనువుగా దూసుకు పోయే సేవాతత్వం కలిగి ఉండేది. వెరసి ఇవన్నీ ఆమెను ఓ మహారాజ్ఞి స్థానంలో నిలబెట్టిన అంశాలు! ఆమె పేరు ఎస్తేరు. బాల్యంలోనే తలిదండ్రుల్ని పోగొట్టుకున్న అభాగ్యురాలు. తన దాయాది, మొర్దెకై సాయంతో పర్షియా దేశపు రాచకోటలో అడుగుపెట్టింది. ఆ దేశ రాజైన అహర్ష్యా రోషు ఇష్టపడేంతటి మహద్భాగ్యం సంపాదించుకొంది.

'కోటలోకి ప్రవేశించేముందు వివరాలు చెప్పొద్దు. చెబితే లోపలకి రానీయరు. కక్ష పెంచుకొంటరు' అని చెప్పిన అన్న గారి సూచన పాటించి జాగ్రత్త పడింది ఎస్తేరు. ఓ రోజు రాత్రి.. బహు భార్యలు గల ఆ రాజు, పట్టపు రాణి అయిన తన భార్యామణిని చెంతకు రమ్మని దూతికల ద్వారా కబురంపుతాడు. అయితే ఆమె రాజు దగ్గరికి వెళ్లడానికి నిరాకరించింది. రాజు కోపగించుకున్నాడు. అందుకే తన రాచకోటలోని కన్యకామణుల్ని అందరినీ రప్పించుకొన్నాడు. అప్పుడు ఆ రోజు రాత్రి ఎస్తేరుకు రాజును కలవడానికి అవకాశం కలిగింది. ఆమె రాజును సేవించింది. ముగ్ధుడైన రాజు ఎస్తేరును చెంతకు చేర్చుకున్నాడు. ఆమె సౌందర్యానికి దాసుడైపోయాడు రాజు. ఆమెలోని వినయానికి, ఉపచార మర్యాదల సేవా భావాలకి సమ్మోహితుడయ్యాడు. ఆమెను విడిచి ఒక్క క్షణం విడవలేని పరిస్థితికి చేరుకున్నాడు. ఆమెను ఏకంగా ఓ మహా రాణిగా అభిషేకించేశాడు. క్రీస్తు ఇంకా 480 సంవత్సరాలకు పుడతాడనగా ఈ కథ జరిగింది.

యూదులు ఆత్మాభిమానులు. కానీ పర్షియన్ల ఏలుబడిలో ఉన్నారు. అభిమానాన్ని అహంకారమని భావించిన పర్షియన్లు యూదుల్ని హింసించడం మొదలుపెట్టారు. ఎస్తేరు యూదా మహిళ. తన ఆభిజాత్యం చెప్పకుండా రహస్యంగా రాచరికం ముందు వచ్చి వాలింది. తన వారిని తనముందే హింసిస్తున్నందుకు బాధ పడింది. భయపడింది. ఎలాగైనా తన వారిని రక్షించాలనుకొంది. దేవుడ్ని ప్రార్థించింది. తనకు కలిగే అవకా



శాలన్నిటినీ తన వారిని రక్షించడానికే ఉపయోగించింది. జాతి విమోచన ప్రధానం అనుకొంది. ఓ రాత్రి సుఖ శయనంపై ఉన్నప్పుడు కోటలో కొందరు చేసే కుట్రలు వివరించి, తన వారిని ఎన్నోసార్లు కాపాడింది. రాజు అసలు దోషులపై కోపోద్రిక్తుడౌతాడు. ఎస్తేరును రాణి హోదాలో సత్కరిస్తాడు. అలా ఆ యూదా మహిళామణి ఆ పర్షియా దేశానికే మహారాణి అవుతుంది. బహుధా ప్రజా ప్రశంసలు అందుకుంటూ పాలన సాగిస్తుంది.

..✍ ప్రొ॥బెర్నార్డ్ రాజు, 98667 55024

అన్నం మధ్యలో శుభాలు

ఇస్లాం బోధ

ఇస్లాం ప్రకారం అల్లాహ్‌ను స్మరిస్తూ భోజనం తినడం శుభాన్ని కలిగించే పుణ్య కార్యం. భోజనం చేసేటప్పుడు పాటించాల్సిన నియమాలు, పద్ధతులను ఇస్లాం వివరంగా ఖురాన్‌లో, వివిధ హదీసుల్లో పేర్కొంది. 'భోజనం చేసే ముందు దైవ నామాన్ని పఠించు. కుడి చేత్తో తిను. నీకు దగ్గరలో ఉన్నవాటిని తీసుకొని తిను' అని దైవ ప్రవక్త (సల్లం) ఉపదేశించారు. 'శుభాలు అన్నం మధ్యలో అవతరిస్తాయి. కనుక మీరు దాన్ని రెండు పక్కల్లోనూ మధ్య భాగం నుంచి తినండి. మధ్యలో నుంచి తినకండి' అని ఆయన సూచించారు. ఆయన తన దగ్గరున్న గర్రా అనే పళ్లెం చుట్టూ ప్రజలను కూర్చోబెట్టుకొని భోజనం చేసేవారు. ఇతరులతో కలిసి భోజనం చేయడం, మోకాళ్ల ఆధారంగా కూర్చొని తినడం పుణ్యప్రదమని ఆయన బోధనలు ఉపదేశిస్తాయి. కాళ్లు మోకాళ్ల వరకు మడచి అరికాళ్ల మీద కూర్చొని భోజనం చేయడం అభిలషణీయమైన పద్ధతి. కుడి కాలు ఎత్తి ఎడమ కాలి ఆధారంగా కూర్చోవాలి (ఫత్వాల్ బారీ). అన్నాన్ని వృథా చేయకుండా



తినాలి. తిన్న తర్వాత చేతిని శుభ్రంగా నాకి ఆ తర్వాత నీళ్లతో శుభ్రం చేసుకోవాలి. అలాగే నీళ్లు కూర్చొని తాగాలి. కుడి చేతితో నీటి పాత్రను పట్టుకోవాలి. కొద్ది కొద్దిగా కనీసం మూడు గుక్కల్లో నీళ్లు తాగాలి. నీళ్లు తాగే ముందు 'బిస్మిల్లా హిర్రహ్‌మా నిర్రహీమ్' అని పఠించాలి. తాగిన తర్వాత 'అల్‌హమ్‌దులిల్లాహ్' అని పలకాలి. నీళ్ల పాత్రలో శ్వాస విడవకూడదు, ఊదకూడదు. దైవప్రవక్త(స) ఆరోగ్యానికి మేలు చేసే, రోగాల్ని తగ్గించే అనేక ఆహార పదార్థాల గురించి తెలియజేశారు. ఆవు పాలను, నెయ్యిని తప్పనిసరిగా తీసుకోవాలని, వాటిలో ఔషధ గుణాలున్నాయని చెప్పారు. దాహం, వేడి, మంట, రక్తపోటును దోసకాయ దూరం చేస్తుందని తెలిపారు. పైత్యానికి, సెగ రోగానికి, కామెర్లకు తర్బూజా హితకారిగా పని చేస్తుందని పేర్కొన్నారు.

...✍ ముహమ్మద్ ముజాహిద్, 96406 22076

అంధకారంలో పురపాలికలు!

- భారంగా మారిన వీధిలైట్ల నిర్వహణ
- టోల్ ఫ్రీ నంబర్లకు ఫిర్యాదుల వెల్లువ
- 70 మున్సిపాలిటీలలో ముగిసిన ఈఈఎస్‌ఎల్ ఒప్పందం
- ప్రభుత్వ పరిశీలనలో కొత్త ప్రతిపాదన
- ఐదు నెలలైనా తేల్చని రేవంత్‌రెడ్డి సర్కారు



వరంగల్ నగరంలోని ఓ వీధిలో వెలగని వీధిదీపాలు

హైదరాబాద్, సెప్టెంబర్ 14 (నమస్తే తెలంగాణ): రాష్ట్రంలోని పురపాలికలు అంధకారంలో మగ్గుతున్నాయి. హైదరాబాద్ మహానగరంతోపాటు అనేక మున్సిపాలిటీల్లో చీకట్లు కమ్ముకుంటున్నాయి. వీధిలైట్ల నిర్వహణకు ప్రభుత్వం ఎలాంటి ప్రత్యేక నిధులు కేటాయించకపోవడం, ఈఈఎస్‌ఎల్ సంస్థతో చేసుకున్న ఒప్పందం ముగిసిపోవడంతో నగరాలు, పట్టణాల్లో అంధకారం నెలకొంటున్నది. రాష్ట్రవ్యాప్తంగా ఎల్‌ఈడీ లైట్ల ఏర్పాటు, నిర్వహణ కోసం ఎనర్జీ ఎఫిషియన్సీ సర్వీసెస్ లిమిటెడ్ (ఈఈఎస్‌ఎల్)తో ఏడేండ్ల క్రితం బీఆర్‌ఎస్ ప్రభుత్వం ఒప్పందం చేసుకున్నది. గత ఏప్రిల్‌తో జీహెచ్‌ఎంసీతోపాటు 70 పురపాలికల్లో ఈ ఒప్పందం ముగిసింది. మరో 69 పురపాలికల్లో ఈఈఎస్‌ఎల్ వీధిలైట్ల నిర్వహణ బాధ్యతలను చూస్తున్నది. సర్కారు నుంచి రూ.300 కోట్ల వరకు పెండింగ్ బిల్లులు రావాల్సి ఉండటంతో లైట్ల నిర్వహణను ఆ సంస్థ అంతగా పట్టించుకోవడం లేదనే ఆరోపణలు ఉన్నాయి. మరోవైపు ఈఈఎస్‌ఎల్‌తో ఒప్పందం ముగిసిన మున్సిపాలిటీల్లో కొత్త ఏజెన్సీని రాష్ట్ర ప్రభుత్వం నియమించలేదు. ఒప్పందం పొడిగించాలని ఈఈఎస్‌ఎల్ చేసిన ప్రతిపాదనపై కూడా ఎలాంటి నిర్ణయం ప్రకటించలేదు. ఆర్థిక పరిమితులు, ప్రభుత్వం నుంచి తగిన మద్దతు లేకపోవడంతో కార్పొరేషన్లు, మున్సిపాలిటీలు తమ పరిధిలోని ఎల్‌ఈడీ స్ట్రీట్‌లైట్ల నిర్వహణలో తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నాయి.

ఏటా 193 మెగావాట్ల విద్యుత్తు ఆదా

జీహెచ్‌ఎంసీ సహా రాష్ట్రంలోని మున్సిపాలిటీలు, మున్సిపల్ కార్పొరేషన్‌లు ఎల్‌ఈడీ స్ట్రీట్‌లైట్ల ఏర్పాటు, నిర్వహణ కోసం ఈఈఎస్‌ఎల్‌తో ఒప్పందం కుదుర్చుకున్నాయి. ఆ మేరకు రాష్ట్రవ్యాప్తంగా 141 యూఎల్‌బీల్లో సుమారు 17 లక్షల ఎల్‌ఈడీ స్ట్రీట్‌లైట్లను ఏర్పాటుచేశారు. ఈ ప్రాజెక్ట్ ద్వారా ఏటా సుమారు 193 మెగావాట్ల విద్యుత్తు ఆదా అవుతున్నది. 0.81 మిలియన్ టన్నుల కార్బన్ ఉద్గారాలు తగ్గాయి. జీహెచ్‌ఎంసీ ఒక్కటే విద్యుత్తు బిల్లులపై సంవత్సరానికి దాదాపు రూ.80 కోట్లు ఆదా చేసింది. ఈఈఎస్‌ఎల్‌తో కుదుర్చుకున్న ఏడేండ్ల ఒప్పందం ప్రకారం.. స్థాపించిన స్ట్రీట్‌లైట్లకు ఉచిత నిర్వహణతోపాటు హామీ ఇచ్చిన విద్యుత్తు ఆదా కూడా ఉన్నది. జీహెచ్‌ఎంసీతో ఒప్పందం ఈ ఏడాది ఏప్రిల్‌తో ముగిసింది. అప్పటినుంచి కార్పొరేషన్ తన పరిధిలోని 5.5 లక్షల ఎల్‌ఈడీ స్ట్రీట్‌లైట్ల నిర్వహణ కోసం ఇతర ఏజెన్సీలను నియమించాలని నిర్ణయించింది. ఇతర పురపాలికల్లో కూడా ఈఈఎస్‌ఎల్ ఒప్పందాలు ఏప్రిల్‌తో ముగిశాయి. అప్పటినుంచి, సంబంధిత పురపాలికల్లోని ప్రత్యేక అధికారులే తాత్కాలిక ఏర్పాట్లతో నిర్వహణను కొనసాగిస్తున్నారు. కానీ, పరిమిత నిధులు, మానవ వనరుల లేమి, ప్రభుత్వం నుంచి తగిన మద్దతు లేకపోవడంతో ఎల్‌ఈడీ లైట్ల నిర్వహణ అంధకారంగా మారింది. అనేక ప్రాంతాల్లో వీధిలైట్లు సక్రమంగా వెలుగడం లేదు. అర్ధరాత్రి 12 గంటల తర్వాత అనేక ప్రాంతాల్లో లైట్లు వెలుగక అంధకారం అలుముకుంటున్నది.

కొత్త ఏజెన్సీలకు ఐదేండ్ల బాధ్యతలు

ఈఈఎస్‌ఎల్‌తో జీహెచ్‌ఎంసీ ఒప్పందం ముగిసిన నేపథ్యంలో కొత్త ఏజెన్సీకి నిర్వహణ బాధ్యతలు అప్పగించేందుకు, తిరిగి ఐదేండ్లపాటు పోల్స్‌తో సహా రూ.897 కోట్ల టెండర్ పిలిచేందుకు గత వారం జరిగిన స్టాండింగ్ కమిటీ ఆమోదం తెలిపింది. ఈ నెలలో జోనుకు రూ.4 కోట్ల చొప్పున రూ.24 కోట్లు కేటాయించినా, అమలు లోపాలతో ఎలాంటి మార్పు లేదు. కార్వాన్, షేక్‌పేట్ తదితర ప్రాంతాల్లో మూడు నెలలుగా లైట్లు పనిచేయకపోవడంతో నివాసితులు ఫిర్యాదులు చేస్తున్నా, స్పందన లేదు. కొత్త ఏజెన్సీని నియమించే వరకు ప్రజలు అంధకారంలోనే మగ్గే పరిస్థితి తయారైంది. ఇండివిజ్యువల్ లూమినర్ కంట్రోల్ (ఐఎల్‌సీ) లేదా ఇంటిగ్రేటెడ్ మినార్ మానిటరింగ్ (ఐఎంఎం) సిస్టంను అందుబాటులోకి తెచ్చేందుకు ప్లాన్ చేస్తున్నారు. ఐఎల్‌సీ ద్వారా ఒక్కో స్ట్రీట్‌లైట్‌ను నేరుగా నిర్వహించే అవకాశం ఉంటుంది. ఈ టెక్నాలజీ ద్వారా ఒకే చోట నుంచి ఎక్కడ స్ట్రీట్‌లైట్ వెలగకపోయినా తెలుసుకోవచ్చు. అదే ఐఎంఎంతో అయితే ఒక ఏరియా లేదా కొన్ని లైట్లను కలిపి మెయింటెయిన్ చేయవచ్చు. ఈ రెండింటిల్లో ఏదో ఒక సిస్టం అమల్లోకి తీసుకురావాలని భావిస్తున్నారు. కొత్తగా వచ్చే ఏజెన్సీలకు ఐదేండ్ల నిర్వహణ బాధ్యతలు అప్పగించనున్నారు. పనితీరు బాగుంటే మరో రెండేండ్లు పొడిగిస్తారు.

రాష్ట్రంలో వీధి లైట్ల నిర్వహణకు సంబంధించిన ముఖ్యాంశాలు

- జీహెచ్‌ఎంసీసహా అన్ని మున్సిపాలిటీలలో ఎల్‌ఈడీ లైట్ల ఏర్పాటు, నిర్వహణకు ఈఈఎస్‌ఎల్‌తో 2017లో ఒప్పందం జరిగింది.
- ఆ ఒప్పందం ప్రకారం 139 మున్సిపాలిటీల్లో 9.5 లక్షల ఎల్‌ఈడీ స్ట్రీట్‌లైట్లు ఏర్పాటుచేశారు.
- ఈఈఎస్‌ఎల్‌తో 70 పురపాలికలు చేసుకున్న ఒప్పందం గత ఏప్రిల్‌తో ముగిసింది.
- మిలిగిన 69 మున్సిపాలిటీల ఒప్పందం 2028 వరకు వివిధ దఫాల్లో ముగియనున్నది.
- 5 నెలలైనా వీధిలైట్ల నిర్వహణ బాధ్యతను పురపాలకశాఖ ఇతర ఏజెన్సీలకు అప్పగించలేదు.
- మళ్లీ పొడిగించాలనే ఈఈఎస్‌ఎల్ ప్రతిపాదనపై కాంగ్రెస్ సర్కారు ఎలాంటి నిర్ణయం తీసుకోలేదు.
- వీధిలైట్ల నిర్వహణ కోసం మున్సిపాలిటీలకు ప్రత్యేకంగా నిధులు కేటాయించడం లేదు.
- ఫలితంగా జీహెచ్‌ఎంసీ సహా అనేక మున్సిపాలిటీల్లో వీధిలైట్లు వెలుగక అంధకారం నెలకొంటున్నది.

ఒక్క నెలలో 9 వేల ఫిర్యాదులు



గ్రేటర్ హైదరాబాద్ మున్సిపల్ కార్పొరేషన్ (జీహెచ్‌ఎంసీ)లోనే సమస్య తీవ్రంగా ఉన్నది. 5 లక్షలకుపైగా వీధిదీపాల్లో దాదాపు 35 శాతానికి మించి వెలగడం లేదు. ఇది 50,000 నుంచి 60,000 మధ్య మాల్ ఫంక్షనింగ్ లైట్లుగా అంచనా వేస్తున్నారు. ఈఈఎస్‌ఎల్‌తో ఒప్పందం ముగిసిన తర్వాత జీహెచ్‌ఎంసీ స్వయంగా నిర్వహణ చేపట్టినా, ఉన్నతాధికారుల పర్యవేక్షణ లేకపోవడంతో సమస్యలు పెరిగాయి. ఈ ఏడాది ఒక్క మే నెలలోనే టోల్‌ఫ్రీ నంబర్‌కు 9,000కి పైగా ఫిర్యాదులు నమోదయ్యాయి. వీటిలో 5,800 మాత్రమే పరిష్కరించారు. ఇది కేవలం హైదరాబాద్‌కే పరిమితమైన సమస్య కాదు. రాష్ట్రంలోని మిగిలిన పురపాలక సంస్థల్లో కూడా ఇదే పరిస్థితి. ప్రజలు ఫిర్యాదులు చేస్తున్నా, కౌన్సిలర్లు, కార్పొరేటర్లు విమర్శలు గుప్పిస్తున్నా పురపాలక సంస్థలు పట్టించుకోవడం లేదనే ఆరోపణలు ఉన్నాయి.



సికింద్రాబాద్‌లో రోడ్లు జలమయమై ప్రయాణికుల అవస్థలు



ముషీరాబాద్‌లో గల్లంతైన యువకుడి కోసం గాలిస్తున్న హైడ్రా సిబ్బంది

హైదరాబాద్‌లో దంచికొట్టిన వాన

- నాలాలో పడి ముగ్గురు గల్లంతు
- లోతట్టు ప్రాంతాలు జలమయం
- రాజధాని నగరంలో ట్రాఫిక్‌జాం
- ముందస్తు చర్యలపై బల్దియా, హైడ్రా సిబ్బంది అలసత్వం

హైదరాబాద్ సిటీబ్యూరో, సెప్టెంబర్ 14(నమస్తే తెలంగాణ): హైదరాబాద్ నగరాన్ని వర్షం అతలాకుతలం చేసింది. ఆదివారం సాయంత్రం కురిసిన వర్షానికి నగరం తడిసిముద్దయింది. లోతట్టు ప్రాంతాలు జలమయమయ్యాయి. చాలాచోట్ల రోడ్లు చెరువుల్ని తలపించాయి. పలు కాలనీలకు నీరు చేరి, ప్రజలు తీవ్ర అవస్థలు పడ్డారు. ఇండ్లల్లోని సామగ్రి నీటిలో తడిసిపోయింది. ఖాజాగూడలోని హరిజన్ బస్తీ నీట మునిగింది. మణికొండ, గచ్చిబౌలి, నానక్‌రామ్‌గూడ, మెహదీపట్నం, జూబ్లీహిల్స్, ఖైరతాబాద్, నాంపల్లి, కోఠి వర్షం కుదిపేసింది. ముషీరాబాద్, ఉప్పల్, ఎల్బీనగర్, హయత్‌నగర్, జవహర్‌నగర్ రహదారులు జలమయమయ్యాయి. ముషీరాబాద్‌లో అత్యధికంగా 12.1 సెంటీమీటర్లు, జవహర్‌నగర్‌లో 11.28 సెంటీమీటర్ల వర్షం కురిసిందని వాతావరణశాఖ వెల్లడించింది. ప్రధాన రహదారుల్లో మోకాలులోతు నీరు నిలిచింది. వాహనాలు ఎక్కడికక్కడ నిలిచిపోయాయి. వాహనదారులు గంటల తరబడి రోడ్లపైనే నిరీక్షించారు. ఉప్పల్ రింగ్‌రోడ్డు నుంచి మేడిపల్లి వరకు వరంగల్ జాతీయ రహదారిపై ట్రాఫిక్ జామ్‌తో జనం అవస్థలు పడ్డారు. భారీ వర్ష సూచనలు ఉన్నప్పటికీ ముందస్తు ముంపు నివారణ చర్యలు చేపట్టడంలో జీహెచ్‌ఎంసీ, హైడ్రా అలసత్వం స్పష్టంగా కనిపించిందని నగరవాసులు మండిపడ్డారు. ఎక్కువగా నీరు నిలిచే ప్రాంతాలో గతంలో డీఆర్‌ఎఫ్ బలగాలు మోహరించేవని గుర్తుచేసుకున్నారు. వర్షం పడగానే డ్రెయిన్‌లోకి నీరు సాఫీగా వెళ్లేలా చర్యలు తీసుకునేవారని, ట్రాఫిక్ పోలీసులను కూడా భాగస్వాములు చేసుకుంటూ సమన్వయంతో పనిచేసేవారని తెలిపారు. కానీ ప్రస్తుత ప్రభుత్వం, జీహెచ్‌ఎంసీ వద్ద వర్షాకాల సన్నహాక ప్రణాళిక లేకపోవడంతో వర్షం వచ్చిన ప్రతీసారి నగరవాసులు నరకం చూస్తున్నారని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. సోమవారం కూడా రాష్ట్రంలోని పలుచోట్ల మోస్తరు నుంచి భారీ వర్షాలు కురుస్తాయని హైదరాబాద్ వాతావరణ కేంద్రం వెల్లడించింది.

వరదలో ముగ్గురు గల్లంతు



ఆదివారం రాత్రి కురిసిన భారీ వర్షానికి నాలాలు పొంగి ప్రవహించాయి. ముషీరాబాద్‌లోని వినోభానగర్‌కు చెందిన దినేశ్(23) మోటార్ సైకిల్‌తో పాటు కొట్టుకుపోయాడు. ప్రైవేటు ఉద్యోగం చేస్తున్న దినేశ్‌కు భార్య, కుమారుడు ఉన్నాడు. జీహెచ్‌ఎంసీ, హైడ్రా బృందాలు గాలింపు చర్యలు చేపట్టాయి. హబీబ్‌నగర్ నాలాలో మరో ఇద్దరు గల్లంతయ్యారని తెలిసింది.

18వరకు భారీవర్షాలు

వాతావరణ కేంద్రం వెల్లడి

హైదరాబాద్, సెప్టెంబర్ 14 (నమస్తే తెలంగాణ): నైరుతి రుతుపవనాలు సాధారణ తిరోగమన సమయం కంటే మూడ్రోజుల ముందుగానే ఉపసంహరించాయని హైదరాబాద్ వాతావరణ కేంద్రం ఆదివారం ఒక ప్రకటనలో వెల్లడించింది. ఈ ప్రభావంతో ఈనెల 18వరకు పలు జిల్లాల్లో భారీ వర్షాలు కురిసే అవకాశం ఉన్నదని పేర్కొన్నది. బంగాళాఖాతం మరో అల్పపీడనం ఏర్పడే అవకాశం ఉన్నదని అంచనా వేసింది. ఆదివారం భద్రాద్రి-కొత్తగూడెం, పెద్దపల్లి, ములుగు, మహబూబాబాద్ జిల్లాల్లో భారీ వర్షాలు కురిసినట్టు వెల్లడించింది. సోమవారం పలు జిల్లాల్లో భారీ వర్షాలు కురుస్తాయని తెలిపింది.

ఈ సారి చలికి గడగడలాడాల్సిందే!

అక్టోబర్, డిసెంబర్‌లో తీవ్రత అధికం

హైదరాబాద్, సెప్టెంబర్ 14 (నమస్తే తెలంగాణ): పర్యావరణంలో వస్తున్న తీవ్రమైన వాతావరణ మార్పుల వల్ల ఈ సారి సగటు ఉష్ణోగ్రతలు అధికంగా పెరిగాయి. ఈ రుతుపవన సీజన్‌లో దేశంలోని అనేక ప్రాంతాల్లో భారీ వర్షాలు కురిశాయి. దీంతో ఈ ఏడాది శీతాకాలంలో తీవ్రమైన చలి ఉండవచ్చని వాతావరణ శాస్త్రవేత్తలు హెచ్చరిస్తున్నారు. లా-నినా ప్రభావం కారణంగా ఈసారి ఎముకలు కొరికేంత చలి ఉండవచ్చునని అంచనా వేస్తున్నారు. ఈ నేపథ్యంలోనే అక్టోబర్, డిసెంబర్ మధ్య 71శాతం వరకు చలితీవ్రత ఎక్కువగా ఉండే అవకాశం ఉంటుందని అంచనా వేస్తున్నారు. దీనివల్ల ఈ ఏడు శీతాకాలం ఇబ్బందికరంగా ఉంటుందని యుఎస్ నేషనల్ వెదర్ సర్వీస్ క్లైమెట్ ప్రిడిక్షన్ సెంటర్ (సీపీపీ) వెల్లడించింది.

లా-నినా అంటే.?

లా-నినా అనేది ఎల్‌నినో-దక్షిణ ఆసిలేషన్ (ఈఎన్‌ఎస్‌వో) చల్లని దశ. దీనిలో, పసిఫిక్ మహాసముద్రం, భూమధ్యరేఖ ప్రాంతం ఉపరితల ఉష్ణోగ్రత సాధారణం కంటే తక్కువగా ఉంటుంది. దీని ప్రభావం పసిఫిక్ మహాసముద్రానికే పరిమితం కాదు. కానీ, మొత్తం ప్రపంచ వాతావరణాన్ని ప్రభావితం చేస్తుంది. ఈ సంవత్సరం స్వల్పకాలిక లా-నినా వచ్చే అవకాశం ఉన్నదని, పసిఫిక్ మహాసముద్రం సాధారణం కంటే చల్లగా ఉన్నదని స్కైమెట్ వెదర్ అధ్యక్షుడు శర్మ వెల్లడించారు.

తెలుగులో ధనుష్ ‘ఇడ్లీ కొట్టు’



తమిళ అగ్ర హీరో ధనుష్ స్వీయ దర్శకత్వంలో నటించి, ఆకాష్ భాస్కరన్‌తో కలిసి నిర్మించిన తమిళ సినిమా ‘ఇడ్లీ కడై’. ఈ సినిమా.. ‘ఇడ్లీ కొట్టు’ పేరుతో అక్టోబర్ 1న తెలుగులో విడుదల కానుంది. శ్రీ వేదక్షర మూవీస్ పతాకంపై నిర్మాత రామారావు చింతపల్లి ఈ చిత్రాన్ని తెలుగు ప్రేక్షకులకు అందిస్తున్నారు. దర్శకుడిగా ధనుష్ నాలుగో సినిమా ఇది. ఈ సినిమా గురించి నిర్మాత రామారావు చింతపల్లి మాట్లాడుతూ ‘తెలుగు రైట్స్ మాకిచ్చినందుకు ధనుష్‌గారికీ, ఆయన టీమ్‌కు కృతజ్ఞతలు. తెలుగు నేలపై ధనుష్ కెరీర్‌లోనే హైయ్యెస్ట్ థియేటర్లలో ఈ సినిమాను విడుదల చేయబోతున్నాం.’ అని తెలిపారు. నిత్యామీనన్ కథానాయికగా నటించిన ఈ చిత్రంలో అరుణ్ విజయ్, షాలిని పాండే, సత్యరాజ్, రాజ్‌కిరణ్ కీలక పాత్రధారులు. ఈ చిత్రానికి కెమెరా: కిరణ్ కౌశిక్, సంగీతం: జి.వి.ప్రకాశ్‌కుమార్, నిర్మాణం: డాన్ పిక్చర్స్, వండర్‌బార్ ఫిల్మ్స్ ప్రై.లిమిటెడ్.



లిటిల్ హార్ట్స్ విజయానందం

మౌళి తనూజ్, శివానీ నాగరం జంటగా నటించిన యూత్‌ఫుల్ ఎంటర్టైనర్ ‘లిటిల్ హార్ట్స్’. సాయిమార్తాండ్ దర్శకత్వంలో ఆదిత్యహాసన్ నిర్మించిన ఈచిత్రం ఇటీవల విడుదలై విజవంతంగా ప్రదర్శితమవుతున్నది. ఈ సినిమా సక్సెస్ సెలబ్రేషన్స్ హైదరాబాద్‌లో ఘనంగా జరిగాయి. హీరో అడవిశేష్, దర్శకులు మారుతి, రాహుల్ రవీంద్రన్, కేవీ అనుదీప్, నిర్మాత ఎస్‌కేఎన్ ఈ కార్యక్రమానికి అతిథులుగా విచ్చేసి చిత్ర యూనిట్‌కు అభినందనలు అందించారు. ఇంకా ఈ కార్యక్రమంలో యూనిట్ సభ్యులతోపాటు చిత్రాన్ని విడుదల చేసిన బన్నీవాస్, వంశీ నందిపాటి, రచయిత బీవీఎస్ రవి కూడా పాల్గొన్నారు.

చిత్రం

ఇది నా జీవితకాల జ్ఞాపకం

సినిమా అప్‌డేట్‌లు దర్శక, నిర్మాతలు ఇవ్వడం పరిపాటి. కానీ ఈ మధ్య కథానాయికలు తొందరపడిపోతున్నారు. దర్శక, నిర్మాతల కంటే ముందుగానే తమ సోషల్ మీడియా ద్వారా అప్‌డేట్లు ఇచ్చేస్తున్నారు. కథానాయిక రాశీఖన్నా తన ఇన్‌స్టాలో పోస్ట్ చేసిన తాజా ఫొటో ఇప్పుడు అలాంటి దుమారమే రేపింది. పవన్‌కల్యాణ్ స్వయంగా ‘ఉస్తాద్ భగత్‌సింగ్’ లొకేషన్‌లో తీసిన సెల్ఫీ ఇది. ఇందులో ఆయన చెంతనే రాశీఖన్నా నవ్వులు చిందిస్తూ ఉన్నారు. వెనుక నిర్మాతలు చిత్ర బృందం కనిపిస్తున్నారు. ఈ ఫొటోతో పాటు ‘ఈ క్షణాలను లైఫ్ టైమ్ మెమొరీగా గుర్తుంచుకుంటా’ అంటూ ఓ కామెంట్‌ను కూడా జత చేసింది రాశీఖన్నా. ‘ఉస్తాద్ భగత్‌సింగ్’ షూటింగ్‌ను పవన్ ఓ వారంలో ముగించేయనున్నారంటూ గతంలో వార్తలొచ్చాయి. రాశీ షేర్ చేసిన ఫొటో ఇప్పుడు ఆ వార్తలకు బలాన్నిచ్చేలా ఉందని పలువురు అభిప్రాయపడుతున్నారు. కొందరైతే ‘ఉస్తాద్ భగత్‌సింగ్’ షూటింగ్‌ను పవన్ పూర్తిచేసేశారంటూ ఈ ఫొటో ఆధారంగా వార్తలు రాసేస్తున్నారు.





అక్టోబర్ నుంచి అబుదాబిలో యాక్షన్



అల్లు అర్జున్ కథానాయకుడిగా అట్లీ దర్శకత్వంలో సైన్స్ ఫిక్షన్‌తో కూడిన ఓ భారీ యాక్షన్ మూవీ తెరకెక్కుతున్న విషయం తెలిసిందే. ‘AA22xA6’ వర్కింగ్ టైటిల్‌తో రూపొందుతున్న ఈ ప్రతిష్టాత్మక పానిండియా చిత్రం ఇప్పటికే 50రోజుల షూటింగ్ పూర్తి చేసుకున్నది. ఇప్పుడు ఈ సినిమా షూటింగ్‌కు సంబంధించిన తాజా అప్డేట్ ఏంటంటే.. ఈ చిత్రబృందం వీఎఫ్‌ఎక్స్ పనుల నిమిత్తం అమెరికాకు బయలుదేరింది. కథరీత్యా ఇందులో భారీ వీఎఫ్‌ఎక్స్ అవసరం. దీని కోసం హాలీవుడ్ నిపుణులు పనిచేయనున్నారు. ఈ సినిమా నెక్స్ట్ షెడ్యూల్ అక్టోబర్ నుంచి మొదలు కానున్నదని, అబుదాబిలోని లివా ఒయాసిస్‌లో జరిగే ఈ షెడ్యూల్‌లో భారీ యాక్షన్ సన్నివేశాలను చిత్రీకరిస్తారని, ఈ షెడ్యూల్‌లో కథానాయిక దీపిక పదుకొణ్ కూడా జాయిన్ అవుతారని సమాచారం. 600కోట్ల భారీ బడ్జెట్‌తో తెరకెక్కుతున్న ఈ పాన్ ఇండియాలో సినిమాలో రష్మిక మందన్నా, మృణాళ్ ఠాకూర్, జాన్వీ కపూర్ కూడా కీలక పాత్రల్లో కనిపిస్తారట. సన్ నెట్‌వర్క్స్ పతాకంపై కళానిధి మారన్ ఈ చిత్రాన్ని నిర్మిస్తున్న విషయం తెలిసిందే.

దక్ష.. ఓ ఘోరమైన కుట్ర



‘ఈ సినిమాకు పనిచేసిన ప్రతి ఒక్కరూ ప్రాణం పెట్టి పనిచేశారు. ఈ కథలో నాన్నగారి ఇమేజ్‌కు తగినట్టు పర్‌ఫెక్ట్ క్యారెక్టర్ ఉంది. అందుకే ఆయన్ను అడిగాం. సముద్రఖని, సిద్ధిక్, విశ్వంత్, చిత్రాశుక్లా ఇలా పాన్ ఇండియా వైజ్‌లో ప్రతి భాషకూ చెందిన నటులు ఇందులో ఉన్నారు. ఈ సినిమా విషయంలో తమ్ముడు మనోజ్ సహకారం మరిచిపోలేను. అందరికీ నచ్చేలా ‘దక్ష’ సినిమా ఉంటుంది. అమితాబ్ ‘పీకూ’ లాంటి సినిమాను నాన్నగారితో చేయాలని ఉంది. త్వరలోనే ఆ కోరిక తీర్చుకుంటా.’ అన్నారు మంచు లక్ష్మీ ప్రసన్న. ఆమె ప్రధాన పాత్రలో నటించిన చిత్రం ‘దక్ష - ది డెడ్‌లీ కాన్‌స్పిరసీ’. డా.మోహన్‌బాబు కీలక పాత్ర పోషించారు. తండ్రీకూతుళ్లు మోహన్‌బాబు, మంచు లక్ష్మి కలిసి నటించిన తొలి సినిమా ఇదే కావడం విశేషం. వంశీకృష్ణ మల్లా దర్శకుడు. శ్రీలక్ష్మి ప్రసన్న పిక్చర్స్, మంచు ఎంటర్టైన్మెంట్స్ కలిసి నిర్మించిన ఈ చిత్రం ఈ నెల 19న ప్రపంచవ్యాప్తంగా విడుదల కానుంది. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన ప్రీరిలీజ్ ప్రెస్‌మీట్‌లో మంచు లక్ష్మి మాట్లాడారు. అతిథిగా విచ్చేసిన మంచు మనోజ్ చిత్ర బృందానికి శుభాకాంక్షలు అందించారు. ఇదొక డిఫరెంట్ థ్రిల్లర్ అనీ, మైత్రీ మూవీమేకర్స్ ఈ చిత్రాన్ని విడుదల చేస్తున్నదని, ‘దక్ష’ అందరికీ నచ్చుతుందని దర్శకుడు వంశీకృష్ణ నమ్మకం వెలిబుచ్చారు. ఇంకా రంగస్థలం మహేశ్, జెమినీ సురేశ్ కూడా మాట్లాడారు. ఈ చిత్రానికి కెమెరా: గోకుల్ భారతి, సంగీతం: అచు రాజమణి.

‘బ్యూటీ’ ఎవర్నీ నిరాశపరచదు



అంకిత్ కొయ్య, నీలఖి జంటగా నటించిన యూత్‌ఫుల్ లవ్ డ్రామా ‘బ్యూటీ’. జె.ఎస్.ఎస్.వర్ధన్ దర్శకుడు. విజయ్‌పాల్‌రెడ్డి అడిదల, ఉమేష్ కుమార్ భన్సల్ నిర్మాతలు. ఈ నెల 19న సినిమా విడుదల కానుంది. ఈ సందర్భంగా ఆదివారం హైదరాబాద్‌లో ఈ సినిమా ప్రీ రిలీజ్ ఈవెంట్ నిర్వహించారు. అగ్ర దర్శకుడు మారుతి, నిర్మాత ఎస్‌కేఎన్ ఈ కార్యక్రమానికి అతిథులుగా విచ్చేసి చిత్ర యూనిట్‌కు శుభాకాంక్షలు అందించారు. ‘బ్యూటీ సినిమా ఏ ఒక్కరినీ నిరాశపరచదు. సినిమా చూసి నచ్చకపోతే సున్నా రేటింగ్ ఇవ్వండి. నచ్చితే మాత్రం ప్రమోట్ చేయండి.’ అని హీరో అంకిత్ అన్నారు. దర్శకుడు మాట్లాడుతూ ‘ప్రతి ఒక్కరినీ సీట్ ఎడ్జ్‌లో కూర్చోబెట్టే సినిమా ‘బ్యూటీ’. స్క్రిప్ట్ ఈ సినిమాకు ప్రధాన బలం. ఓ హీరో ఓ మూవీని భుజానికి ఎత్తుకుని చేస్తే ఎలా ఉంటుందో ‘బ్యూటీ’ మూవీ అలా ఉంటుంది. హీరో అంకిత్ ఈ సినిమాకోసం చాలా కష్టపడ్డాడు. విజయ్ బుల్గానిన్ సంగీతం సినిమాను మరోస్థాయిలో నిలబెట్టింది.’ అని పేర్కొన్నారు. ఇంకా నిర్మాత విజయ్‌పాల్‌రెడ్డి అడిదల, కథానాయిక నీలఖి, సీనియర్ నటుడు వీకే నరేష్, నటి వాసుకి, నిమ్మకాయల ప్రసాద్, రైటర్ ఆర్.వి.సుబ్రహ్మణ్యం, ఎగ్జిక్యూటివ్ ప్రొడ్యూసర్ బి.ఎస్.రావు తదితరులు మాట్లాడారు.

వాస్తవ సంఘటనల ఆధారంగా ‘భద్రకాళి’



‘ఈ సినిమాలో మంచి ఎంటర్టైన్మెంట్ ఉంటుంది. అలాగే ఆలోచింపజేసే అంశాలుంటాయ్. అద్భుతమైన కథ రాసుకొని, దాన్ని జనం మెచ్చేలా తెరకెక్కించారు దర్శకుడు అరుణ్ ప్రభు. మంచి బడ్జెట్, అద్భుతమైన కంటెంట్‌తో వస్తున్న సినిమా ఇది’ అన్నారు నిర్మాత రామాంజనేయులు జవ్వాజి. సర్వంత్ రామ్ క్రియేషన్స్ పతాకంపై ఆయన నిర్మించిన చిత్రం ‘భద్రకాళి’. హీరోగా విజయ్ ఆంటోని 25వ సినిమా ఇది. అరుణ్‌ప్రభు దర్శకుడు. విజయ్ ఆంటోని ఫిల్మ్ కార్పొరేషన్, మీరా విజయ్ ఆంటోని కలిసి ఈ చిత్రాన్ని సమర్పిస్తున్నారు. ఈ నెల 19న సినిమా విడుదల కానుంది. ఈ సందర్భంగా ఆదివారం హైదరాబాద్‌లో నిర్మాత రామాంజనేయులు విలేకరులతో ముచ్చటించారు. ‘ఇప్పటివరకూ ఎవరూ చేయని పాత్రను ఇందులో విజయ్ ఆంటోని చేశారు. ఇందులో ఆయన పొలిటికల్ బ్రోకర్‌గా కనిపిస్తారు. చాలా డిఫరెంట్ క్యారెక్టర్. సమాజంలో జరుగుతున్న విషయాల ఆధారంగా చేసుకుని తీసిన సినిమా ఇది. ఫస్ట్ కాపీ చూశా. ఊహించిన దానికంటే బాగా వచ్చింది. సినిమా మొదలైన రెండు నిమిషాల్లోనే ప్రేక్షకులు కథలో లీనమైపోతారు.’ అని రామాంజనేయులు చెప్పారు. కథ డిమాండ్ మేరకు ఖర్చు చేశామని, దర్శకుడికి క్రియేటివ్ ఫ్రీడమ్ ఇచ్చామని, సినిమా బాగా రావడానికి కారణం అదేనని రామాంజనేయులు అభిప్రాయపడ్డారు. ‘ప్రారంభం నుంచి ముగింపు వరకూ ఎక్కడా బోర్ లేకుండా తెరకెక్కించిన చిత్రం ‘భద్రకాళి’. విజయ్ ఆంటోని అద్భుతంగా నటించడమే కాదు, చక్కని మ్యూజిక్‌ని కూడా అందించారు. ముఖ్యంగా నేపథ్య సంగీతం గొప్పగా ఉంటుంది. తెలుగులో సత్యదేవ్ హీరోగా మేం చేసిన ‘ఫుల్ బాటిల్’ సినిమా నవంబర్‌లో విడుదల కానుంది. ఇటీవలే ‘బూకీ’ సినిమాను మొదలుపెట్టాం. ‘బిచ్చగాడు’ దర్శకుడు శశి, విజయ్ ఆంటోని కాంబినేషన్‌లో ‘వంద దేవుళ్లు’ సినిమా చేయబోతున్నాం.’ అని తెలిపారు రామాంజనేయులు జవ్వాజి.

ప్రేమతో దెయ్యం



బి.గణేశ్, బద్దెల శ్రీనివాస్, నవ్యశ్రీ లీడ్ రోల్స్ చేసిన చిత్రం ‘ప్రేమతో దెయ్యం’. బి.కె.ఎస్ దర్శకుడు. బి.కుమారస్వామి నిర్మాత. చిత్ర నిర్మాణం తుదిదశకు చేరుకున్నది. ఈ సందర్భంగా సినీ ప్రముఖుల సమక్షంలో ట్రైలర్‌ని విడుదల చేశారు. అతిథులుగా విచ్చేసిన టి.ప్రసన్న కుమార్, అనుపమారెడ్డి, సముద్ర, శివనాగు, తుమ్మలపల్లి రామసత్యనారాయణ కలిసి ఈ ట్రైలర్‌ని విడుదల చేసి చిత్రబృందానికి శుభాకాంక్షలు అందించారు. అందర్నీ ఆకట్టుకునే కథ, కథనాలతో ఈ చిత్రం రూపొందిందని దర్శకుడు చెప్పారు. మనసుల్ని కదిలించే సన్నివేశాలు ఇందులో ఉంటాయని నిర్మాత తెలిపారు. ఈ చిత్రానికి కెమెరా: శేఖర్, సంగీతం: సి.హెచ్.అమ్మపాండు, నిర్మాణం: శ్రీలక్ష్మీ హనుమ శివపార్వతి.

భారత్ పసిడి పంచ్

జైస్మిన్, మీనాక్షికి స్వర్ణాలు • నుపుర్‌కు రజతం, పూజకు కాంస్యం • ప్రపంచ బాక్సింగ్ చాంపియన్‌షిప్



లివర్‌పూల్: ప్రతిష్ఠాత్మక ప్రపంచ బాక్సింగ్ చాంపియన్‌షిప్‌లో భారత మహిళా బాక్సర్లు తమ పంచ్ పవర్ చూపించారు. ఆదివారం ముగిసిన మెగాటోర్నీలో జైస్మిన్ లంబోరియా, మీనాక్షి హుడా పసిడి పతకాలతో కొత్త చరిత్ర లిఖించగా, నుపుర్ షెరాన్‌కు రజతం, పూజారాణి కాంస్య పతకాలతో మెరిశారు. విదేశీ గడ్డపై భారత మహిళా బాక్సర్లకు ఇదే అత్యుత్తమ ప్రదర్శన కావడం విశేషం. శనివారం అర్ధరాత్రి జరిగిన మహిళల 57కిలోల ఫైనల్ బౌట్‌లో జైస్మిన్ 4-1 తేడాతో జులియా సెజెరెమెటా(పోలాండ్)పై అద్భుత విజయం సాధించింది. మెగాటోర్నీలో ఆది నుంచి ఎదురైన ప్రత్యర్థినల్లా చిత్తు చేసిన జైస్మిన్ ఫైనల్లోనూ అదే జోరు కనబరిచింది. పోలాండ్ బాక్సర్‌కు ఏమాత్రం అవకాశమివ్వకుండా పవర్‌ఫుల్ పంచ్‌లతో చెలరేగుతూ కీలక పాయింట్లు ఖాతాలో వేసుకుంది. మహిళల 48కిలోల తుదిపోరులో మీనాక్షి 4-1 తేడాతో నజిమ్ కిజ్బె(కజకిస్థాన్)పై విజయంతో పసిడి పతకాన్ని ముద్దాడింది. అంచనాల్లేకుండా బరిలోకి దిగిన మీనాక్షి తొలిసారి ప్రపంచ చాంపియన్‌షిప్ స్వర్ణాన్ని ఖాతాలో వేసుకుంది. గత జూలైలో కజికిస్థాన్ బాక్సర్ చేతిలో ఎదురైన ఓటమికి మీనాక్షి తాజాగా ప్రతీకారం తీర్చుకుంది. మెగాటోర్నీలో పసిడి పతకాలు గెలువడం ద్వారా మేరీకోమ్, నిఖత్ జరీన్, సరితాదేవి, జెన్నీ ఆర్‌ఎల్, లేఖా, నీతూ గంగాస్, లవ్లీనా బొర్గోహై సరసన జైస్మిన్, మీనాక్షి నిలిచారు. ఇదిలా ఉంటే 80+కిలోల ఫైనల్ బౌట్‌లో నుపుర్ 2-3 తేడాతో అగాట కాక్‌మార్స్క(పోలాండ్) చేతిలో ఓడి రజతంతో సరిపెట్టుకుంది. మహిళల 80కిలోల సెమీస్‌లో పూజారాణి 1-4 తేడాతో ఎమిలీ అస్కిత్(బ్రిటన్) చేతిలో ఓడి కాంస్యం ఖాతాలో వేసుకుంది. మొత్తంగా పురుషులు నిరాశపరిచిన చోట మహిళలు తమ సత్తా ఏంటో చూపెట్టారు.

పాక్‌ను పడగొట్టి


కుల్దీప్, అక్షర్, బుమ్రా విజృంభణ • 9 వికెట్లకు 127 పరుగులు

రాణించిన సూర్యకుమార్, అభిషేక్ • ఆసియాకప్‌లో భారత్ భారీ విజయం



కుల్దీప్ (3/18)

ఆసియాకప్‌లో దాయాది పాకిస్థాన్‌పై భారత్ బెబ్బులిలా గర్జించింది. పహల్గాం ఉగ్రదాడి తర్వాత జరిగిన తొలి పోరులో పాక్‌ను చీల్చిచెండాడుతూ టీమ్‌ఇండియా విజయబావుటా ఎగురవేసింది. బాయ్‌కాట్ నిరసన మధ్య ఉద్విగ్నంగా సాగిన మ్యాచ్‌లో పాక్‌ను తమ స్పిన్ తంత్రంతో పడగొడుతూ స్వల్ప స్కోరుకే పరిమితం చేసింది. ఆపరేషన్ స్పిన్ త్రయం కుల్దీప్‌యాదవ్, అక్షర్‌పటేల్, వరుణ్ ధాటికి పాక్ చిగురుటాకులా వణికింది. బంతి ముట్టుకుంటే ఔట్ అన్న రీతిలో మన స్పిన్నర్లు పాక్‌పై ముప్పేటా దాడి చేశారు. స్వల్ప లక్ష్యఛేదనలో యంగ్‌డైనమిక్ అభిషేక్ వీరవిహారం చేయగా, సూర్యకుమార్, తిలక్‌వర్మ జట్టును గెలుపు తీరాలకు చేర్చారు. కనీసం కరచాలనం లేకుండానే పాక్‌పై భారత్ భారీ విజయాన్ని ఖాతాలో వేసుకుంది.



తిలక్ (31)

సూర్యకుమార్ (47*)

దుబాయ్: పహల్గాం ఉగ్రదాడికి నిరసనగా 'మ్యాచ్ బాయ్‌కాట్' నేపథ్యంలో పాకిస్థాన్‌తో జరిగిన మ్యాచ్‌లో భారత్‌దే పైచేయి అయ్యింది. ఆదివారం వార్‌వన్‌సైడ్ అన్నట్లు సాగిన మ్యాచ్‌లో టీమ్‌ఇండియా 7 వికెట్ల తేడాతో పాక్‌పై ఘన విజయం సొంతం చేసుకుంది. ఆడిన రెండు మ్యాచ్‌ల్లో రెండు విజయాలతో భారత్ నాలుగు పాయింట్లతో గ్రూపు-ఏలో అగ్రస్థానంలో కొనసాగుతున్నది. కుల్దీప్‌యాదవ్(3/18), అక్షర్ పటేల్ (2/18), బుమ్రా (2/28) ధాటికి పాక్ 20 ఓవర్లలో 127/9 స్కోరుకు కుప్పకూలింది. ఫర్హాన్(40), ఆఫ్రిదీ(33 నాటౌట్) రాణించారు. లక్ష్యఛేదనలో భారత్ 15.5 ఓవర్లలో 131/3 స్కోరు చేసింది. కెప్టెన్ సూర్యకుమార్(47 నాటౌట్), అభిషేక్‌వర్మ(31), తిలక్‌వర్మ(31) విజయంలో కీలకమయ్యారు. ఈనెల 19న ఒమన్‌తో భారత్ తలపడనుంది.

స్పిన్ ఉచ్చులో పాక్: టాస్ గెలిచి బ్యాటింగ్ ఎంచుకున్న పాకిస్థాన్‌కు ఆదిలోనే ఎదురుదెబ్బ తగిలింది. హార్దిక్ పాండ్యా వేసిన ఇన్నింగ్స్ తొలి ఓవర్ మొదటి బంతికే పాక్ ఓపెనర్ సయిమ్ ఆయూబ్(0) డకౌట్‌గా వెనుదిరిగాడు. హార్దిక్ బంతిని షాట్ ఆడే క్రమంలో పాయింట్‌లో బుమ్రాకు క్యాచ్ ఇచ్చి పెవిలియన్ చేరాడు. ఆరు బంతుల తేడాతో మహమ్మద్ హరిస్(3) బుమ్రా ఖాతాలో చేరాడు. ఆయూబ్‌ను అనుసరిస్తూ డీప్ బ్యాక్‌వర్డ్ స్క్వేర్‌లో హార్దిక్ పట్టిన క్యాచ్‌తో హరిస్ రెండో వికెట్‌గా ఔట్ కావడంతో పాక్ 6 పరుగులకే రెండు కీలక వికెట్లు కోల్పోయింది. ఈ క్రమంలో ఫర్హాన్(40), ఫకర్ జమాన్(17) ఇన్నింగ్స్‌ను చక్కదిద్దే బాధ్యతను భుజానేసుకున్నారు. వీరిద్దరు మరో వికెట్ పడకుండా జాగ్రత్తపడుతూ అడపాదడపా బౌండరీలు సాధించడంతో పవర్‌ప్లే ముగిసే సరికి పాక్ 2 వికెట్ల నష్టానికి 42 పరుగులు చేసింది. బౌలింగ్ మార్పుగా వచ్చిన అక్షర్‌పటేల్..ఎనిమిదో ఓవర్‌లో జమాన్‌ను ఔట్ చేసి పాక్ వికెట్ల పతనానికి నాంది పలికాడు. భారీ షాట్ ఆడే క్రమంలో లాంగ్‌ఆన్‌లో తిలక్‌వర్మ పట్టిన క్యాచ్‌తో జమాన్ ఔట్ కావడంతో మూడో వికెట్‌కు 39 పరుగుల భాగస్వామ్యానికి బ్రేక్ పడింది. ఇక్కణ్నుంచి భారత స్పిన్నర్లు పాక్ బ్యాటర్లు లక్ష్యంగా వికెట్ల వేట కొనసాగించారు. ఓవర్ తేడాతో కెప్టెన్ సల్మాన్ అగా(3)ను తన ఖాతాలో వేసుకోవడంతో పాక్ కష్టాలు మరింత రెట్టింపయ్యాయి. ఇదే అదనుగా తమ అమ్ములపొదిలోని కీలక అస్త్రమైన చైనామన్ స్పిన్నర్ కుల్దీప్‌యాదవ్‌ను సూర్యకుమార్ ప్రయోగించడం బాగా కలిసొచ్చింది. కుల్దీప్ 13వ ఓవర్‌లో వరుస బంతుల్లో హసన్ నవాజ్(5), మహమ్మద్ నవాజ్(0) వెంటవెంటనే ఔట్ చేయడంతో పాక్ 65 పరుగులకే 6 వికెట్లు కోల్పోయి పీకల్లోతు కష్టాల్లో కూరుకుపోయింది. ఓవైపు సహచరులు పెవిలియన్‌కు క్యూ కడుతున్నా..ఫర్హాన్ పరిణతి కనబరిచాడు. మరోమారు బౌలింగ్‌కు వచ్చిన కుల్దీప్..ఈసారి ఫర్హాన్‌ను ఔట్ చేయడంతో పాక్ 100 పరుగుల లోపే కుప్పకూలుతుందనుకున్నారు. ఆఖర్లో ఆఫ్రిదీ(16 బంతుల్లో 33 నాటౌట్, 4 సిక్స్‌లు) బ్యాటు ఝుళిపించడంతో పాక్‌కు గౌరవప్రదమైన స్కోరు దక్కింది. మొత్తంగా స్పిన్నర్లు కుల్దీప్, అక్షర్, వరుణ్..పాక్ నడ్డివిరువడంలో కీలకమయ్యారు.

భారత్ ఆడుతూ పాడుతూ: పాక్ నిర్దేశించిన లక్ష్యాన్ని భారత్ ఆడుతూ పాడుతూ ఛేదించింది. పాక్ స్టార్ బౌలర్ ఆఫ్రిదీ వేసిన తొలి రెండు బంతులను కండ్లు చెదిరే రీతిలో అభిషేక్‌శర్మ ఫోర్, సిక్స్‌గా మలిచి ఇన్నింగ్స్ ఎలా ఉండబోతుందో చెప్పకనే చెప్పాడు. మరో ఎండ్‌లో అగ్నికి ఆయువు తోడైనట్లు శుభ్‌మన్‌గిల్ వరుసగా రెండు ఫోర్లు కొట్టి జోరు పెంచాడు. అయితే ఆయూబ్ ఊరించే బంతిని ముందుకొచ్చి ఆడే క్రమంలో గిల్(10) స్టంపౌట్ అయ్యాడు. ఓవైపు గిల్ ఔటైనా..అభిషేక్..ఆఫ్రిదీని బాదడం ఆపలేదు. మళ్లీ ఓ ఫోర్, సిక్స్‌తో గట్టిగా అరుసుకున్నాడు. మరుసటి ఓవర్‌లో ఆయూబ్‌ను వరుసగా రెండు ఫోర్లు బాదిన అభిషేక్..అష్రఫ్‌కు క్యాచ్ ఇచ్చి రెండో వికెట్‌గా వెనుదిరిగాడు. ఈ క్రమంలో తిలక్‌వర్మ, సూర్యకుమార్ ఇన్నింగ్స్ బాధ్యతను తీసుకోగా, పవర్‌ప్లే పూర్తయ్యే సరికి టీమ్‌ఇండియా 64/2 స్కోరు చేసింది. పాక్‌కు ఏమాత్రం అవకాశమివ్వని ఈ ఇద్దరు బౌండరీలతో లక్ష్యాన్ని కరిగించే ప్రయత్నం చేశారు. సాఫీగా సాగుతున్న సమయంలో ఆయూబ్ బౌలింగ్‌లో తిలక్ ఔట్ కావడంతో మూడో వికెట్‌కు 56 పరుగుల పార్ట్‌నర్‌షిప్‌కు బ్రేక్ పడింది. తిలక్ తర్వాత క్రీజులోకి వచ్చిన శివమ్‌దూబే..సూర్యకు జతకలిశాడు. వీరిద్దరు మరో వికెట్ పడకుండా జట్టును గెలుపు తీరాలకు చేర్చారు.

సంక్షిప్త స్కోర్లు

పాకిస్థాన్: 20 ఓవర్లలో 127/9 (ఫర్హాన్ 40, ఆఫ్రిదీ 33 నాటౌట్, కుల్దీప్ 3/18, అక్షర్ 2/18)
భారత్: 15.5 ఓవర్లలో 131/3 (సూర్యకుమార్ 47 నాటౌట్, అభిషేక్ 31, ఆయూబ్ 3/35).



నో షేక్ హ్యాండ్..

భారత్, పాకిస్థాన్ మ్యాచ్‌లో ఒక ఆసక్తికర ఘటన చోటు చేసుకుంది. మ్యాచ్ టాస్ సమయంలో ఇరు జట్ల కెప్టెన్లు సూర్యకుమార్‌యాదవ్, సల్మాన్ ఒకరికొకరు కరచాలనం చేసుకోలేకపోయారు. మామూలుగా టాస్ వేసేటప్పుడు కెప్టెన్లు తమ జట్ల వివరాలను ఒకరికొకరు అందజేసుకుంటూ షేక్ హ్యాండ్‌ఇచ్చుకోవడం ఆనవాయితీ. కానీ పహల్గాం ఉగ్రదాడి తర్వాత ఇరు దేశాల మధ్య తీవ్ర ఉద్రిక్త పరిస్థితులు నెలకొన్న సంగతి తెలిసిందే. ఈ నేపథ్యంలో ఇప్పటికే మ్యాచ్ బాయ్‌కాట్ అంటూ తీవ్ర నిరసన వ్యక్తమవుతున్న క్రమంలో సూర్యకుమార్..పాక్ కెప్టెన్ సల్మాన్ వైపు కనీసం కన్నెత్తి కూడా చూడలేదు. ఇద్దరు కెప్టెన్లు తమ జట్టుకు సంబంధించిన టీమ్ షీట్లను మ్యాచ్ రిఫరీ ఆండీ పైక్రాఫ్ట్‌కు అందించి ఎవరి స్థానాల్లో నిలుచున్నారు. రవిశాస్త్రి వ్యాఖ్యాతగా వ్యవహరించాడు.

సాత్విక్ జోడీకి రన్నరప్



హాంకాంగ్: హాంకాంగ్ బ్యాడ్మింటన్‌లో భారత షట్లర్లకు నిరాశే ఎదురైంది. గెలిచి టైటిళ్లతో మెరుస్తారనుకున్న సాత్విక్, చిరాగ్ జోడీతో పాటు లక్ష్యసేన్ రన్నరప్ టైటిళ్లతో సరిపెట్టుకున్నారు. ఆదివారం జరిగిన పురుషుల సింగిల్స్ ఫైనల్లో సాత్విక్ సాయిరాజ్, చిరాగ్‌శెట్టి జోడీ 21-19, 14-21, 17-21తో చైనా ద్వయం లియాంగ్ వీ కెంగ్, వాంగ్ చాంగ్‌పై ఓటమిపాలైంది. గంట పాటు సాగిన తుదిపోరులో తొలి గేమ్ గెలిచిన సాత్విక్, చిరాగ్ జంటకు ఒలింపిక్ రజత విజేత చైనా షట్లర్లు అద్భుతంగా పుంజుకుని వరుసగా రెండుగేమ్‌లతో మ్యాచ్‌ను తమ వశం చేసుకున్నారు. ముఖాముఖి పోరులో చైనా జోడీపై 7-6 ఆధిక్యంలో ఉన్న సాత్విక్, చిరాగ్ స్థాయికి తగ్గ ప్రదర్శన కనబర్చలేకపోయారు. మరోవైపు పురుషుల సింగిల్స్ ఫైనల్లో యువ షట్లర్ లక్ష్యసేన్ 15-21, 12-21తో ప్రపంచ నంబర్ ఫోర్ షట్లర్ లీ షీ షెంగ్ చేతిలో ఓడి రన్నరప్‌గా నిలిచాడు. తొలి గేమ్‌లో 4-0 ఆధిక్యం కనబరిచిన లక్ష్యసేన్ అదే దూకుడు కొనసాగించలేకపోయాడు. ఇదే అదనుగా లీ షెంగ్ కండ్లు చెదిరే స్మాష్‌లతో వరుస గేముల్లో సేన్‌ను చిత్తుచేశాడు.



అమ్మాయిలకు చుక్కెదురు

• ఆసీస్ చేతిలో భారీ ఓటమి

ముల్లాన్‌పూర్: స్వదేశం వేదికగా త్వరలో మొదలయ్యే ప్రపంచకప్ టోర్నీకి సన్నాహకంగా ఆస్ట్రేలియాతో వన్డే సిరీస్‌లో భారత మహిళల జట్టుకు చుక్కెదురైంది. మెగాటోర్నీ కోసం పూర్తి స్థాయిలో సిద్ధమవుదామనుకున్న టీమ్‌ఇండియాకు ఆసీస్ దిమ్మతిరిగే షాక్ ఇచ్చింది. ఆదివారం ఇక్కడ జరిగిన తొలి వన్డేలో భారత్ 8 వికెట్ల తేడాతో ఆసీస్ చేతిలో భారీ ఓటమి ఎదుర్కొంది. మూడు మ్యాచ్‌ల సిరీస్‌లో ఆసీస్ 1-0తో ఆధిక్యంలోకి వెళ్లింది. తొలుత టాస్ గెలిచిన భారత్ నిర్ణీత 50 ఓవర్లలో 281/7 స్కోరు చేసింది. ప్రతీకా రావల్(64), స్మృతి మంధన(58), హర్లిన్ డియోల్(54) అర్ధసెంచరీలతో రాణించారు. ఓపెనర్లు ప్రతీక, మంధన ఇద్దరు మెరుగైన శుభారంభం అందించారు. ఆసీస్ బౌలర్లను సమర్థంగా ఎదుర్కొంటూ బౌండరీలతో ఆకట్టుకున్నారు. వీరిద్దరు కలిసి తొలి వికెట్‌కు 114 పరుగుల భాగస్వామ్యం నెలకొల్పారు. మేగన్ స్కట్(2/45) రెండు వికెట్లు తీసింది. 282 పరుగుల లక్ష్యాన్ని ఆసీస్ 44.1 ఓవర్లలో 2 వికెట్లు కోల్పోయి ఛేదించింది. లిచ్‌ఫీల్డ్(88), బేత్ మూనీ(77 నాటౌట్), సదర్లాండ్(54 నాటౌట్) అర్ధసెంచరీలతో దుమ్మురేపారు. కెప్టెన్ హీలీ(27) ఒకింత నిరాశపరిచినా ఆ తర్వాత బ్యాటర్లు అలవోకగా పరుగులు సాధించారు. మ్యాచ్‌లో ఆసీస్ బ్యాటర్లు ఇచ్చిన నాలుగు క్యాచ్‌లను నేలపాలు చేసిన టీమ్‌ఇండియా మూల్యం చెల్లించుకుంది. క్రాంతిగౌడ్, స్నేహ్‌రానా ఒక్కో వికెట్ తీశారు. లిచ్‌ఫీల్డ్‌కు ప్లేయర్ ఆఫ్ ద మ్యాచ్ దక్కింది.

భారత్ రన్నరప్‌తో సరి

చైనా చేతిలో ఓటమి • ఆసియా కప్ హాకీ టోర్నీ



హంగ్జౌ(చైనా): మహిళల ఆసియా కప్ హాకీ టోర్నీని భారత్ రెండో స్థానంతో ముగించింది. ఆదివారం జరిగిన టోర్నీ ఫైనల్లో భారత్ 1-4 తేడాతో ఆతిథ్య చైనా చేతిలో ఓటమిపాలైంది. ఆదిలో ఆధిక్యం దక్కించుకున్న మన అమ్మాయిలు చైనా ఎదురుదాడితో ఓటమి వైపు నిలువాల్సి వచ్చింది. నవనీత్‌కౌర్(1ని) భారత్‌కు ఏకైక గోల్ అందించగా, జిజియా యు(21ని), హాంగ్ లీ(41ని), మిరాంగ్ జు(51ని), జైకి జాంగ్(53ని) చైనా విజయంలో కీలకమయ్యారు. మూడోసారి ఆసియా టైటిల్ దక్కించుకున్న చైనా వచ్చే ఏడాది బెల్జియం-నెదర్లాండ్స్ వేదికగా జరిగే హాకీ ప్రపంచకప్ టోర్నీకి నేరుగా అర్హత సాధించింది. మూడు, నాలుగు స్థానాల కోసం వర్గీకరణ మ్యాచ్‌లో జపాన్ 2-1తో కొరియాపై గెలిచింది. భారత్, చైనా మ్యాచ్ విషయానికొస్తే మ్యాచ్ మొదలైన తొలి నిమిషంలో దక్కిన పెనాల్టీ కార్నర్‌ను నవనీత్‌కౌర్ గోల్‌గా మలువడంతో భారత్ 1-0 ఆధిక్యం దక్కించుకుంది. మూడు నిమిషాల తేడాతో చైనాకు వరుసగా వచ్చిన పెనాల్టీ కార్నర్ అవకాశాలను భారత్ దీటుగా తిప్పికొట్టింది. స్కోరు సమం చేసేందుకు చైనా స్ట్రైకర్లు భారత్‌పై నిరవధికంగా దాడులు చేసినా లాభం లేకపోయింది. అయితే రెండో క్వార్టర్ మొదట్లో ఎట్టకేలకు సఫలమైన చైనా తొలి గోల్ కొట్టడంతో స్కోరు 1-1తో సమమైంది. ఇక్కణ్నుంచి చైనా తమ దాడులకు మరింత పదునుపెట్టింది. భారత డిఫెన్స్‌ను ఒత్తిడిలోకి నెడుతూ గోల్ చేసే ప్రయత్నం చేసింది. మూడో క్వార్టర్‌లో టీమ్‌ఇండియా పుంజుకునే ప్రయత్నం చేసినా అది నెరవేరలేదు. ఆఖర్లో రెండు నిమిషాల తేడాతో రెండు గోల్స్ చేసిన చైనా మ్యాచ్‌ను పూర్తిగా తమ ఆధీనంలోకి తీసుకుంది. మరోవైపు పటిష్ఠమైన చైనా డిఫెన్స్‌ను ఛేదించలేకపోయిన భారత్ రన్నరప్‌తో సరిపెట్టుకుంది.

మేఘనకు కాంస్యం

షూటింగ్ ప్రపంచ కప్



నిన్బో(చైనా): ప్రతిష్ఠాత్మక షూటింగ్ ప్రపంచ కప్‌లో భారత షూటర్ల పతక జోరు కొనసాగుతున్నది. ఆదివారం జరిగిన మహిళల 10మీటర్ల ఎయిర్ రైఫిల్ ఫైనల్లో యువ షూటర్ మేఘన సజ్జనార్ కాంస్య పతకంతో మెరిసింది. ఆఖరి వరకు హోరాహోరీగా సాగిన తుదిపోరులో మేఘన 230.0 పాయింట్లతో మూడో స్థానంలో నిలిచింది. గత ఎనిమిదేండ్లలో మేఘనకు ఇది తొలి ప్రపంచకప్ పతకం కావడం విశేషం. ఇదే కేటగిరీలో జిన్లు పెంగ్(255.3, చైనా), డుస్టాట్ డెనెటె(252.6, నార్వే) వరుసగా స్వర్ణ, రజత పతకాలు కైవసం చేసుకున్నారు. తన దేశానికే చెందిన వాంగ్ జీఫి(254.8) స్కోరును అధిగమిస్తూ చైనా యువ సంచలనం పెంగ్ నయా ప్రపంచ రికార్డు నెలకొల్పింది. ఇదిలా ఉంటే భారత్ ఓ స్వర్ణం, కాంస్యంతో ఐదో స్థానంలో కొనసాగుతుంటే.. చైనా (3 స్వర్ణాలు, 4 రజతాలు, కాంస్యం) అగ్రస్థానంలో ఉంది.

హైజంప్ ఫైనల్లో అనిల్

ప్రపంచ అథ్లెటిక్స్ చాంపియన్‌షిప్



టోక్యో: ప్రతిష్ఠాత్మక ప్రపంచ అథ్లెటిక్స్ చాంపియన్‌షిప్‌లో భారత యువ అథ్లెట్ సర్వేశ్ అనిల్‌కుశారె అరుదైన ఘనత సొంతం చేసుకున్నాడు. ఆదివారం జరిగిన పురుషుల హైజంప్ విభాగంలో ఫైనల్‌కు అర్హత సాధించాడు. ఈ ఫీట్ అందుకున్న తొలి భారత అథ్లెట్‌గా అనిల్ నిలిచాడు. అర్హత రౌండ్‌లో గ్రూపు-బీ నుంచి పోటీపడ్డ 30 ఏండ్ల కుశారె 2.25 మీటర్ల ఎత్తు దూకి సంయుక్తంగా ఏడో స్థానంలో నిలిచాడు. ఓవరాల్‌గా రెండు గ్రూపుల నుంచి అనిల్‌కు తొమ్మిదో స్థానం దక్కింది. మంగళవారం హైజంప్ ఫైనల్ జరుగనుంది. ఇందులో 2.30 మీటర్ల క్వాలిఫయింగ్ మార్క్ లేదా 12 అత్యుత్తమ ప్రదర్శనలను పరిగణనలోకి తీసుకుంటారు. 2022లో కుశారె 2.27మీటర్లతో తన వ్యక్తిగత అత్యుత్తమ ప్రదర్శన కనబరిచాడు. మహారాష్ట్రలోని నాసిక్‌లోని సాధారణ రైతు కుటుంబానికి చెందిన అనిల్ చాలా కష్టపడి పైకి వచ్చాడు. పారిస్(2024) ఒలింపిక్స్‌కు అర్హత సాధించిన తొలి భారత హైజంపర్‌గా నిలిచిన ఈ యువ అథ్లెట్ తాజాగా ప్రపంచ అథ్లెటిక్స్‌లోనూ సత్తాచాటుతున్నాడు. మరోవైపు పురుషుల 10వేల మీటర్ల రేసులో గుల్వీర్‌సింగ్ 16వ స్థానంలో నిలిచి నిరాశపరిచాడు.

సౌత్‌జోన్ 426 ఆలౌట్

బెంగళూరు: సౌత్‌జోన్, సెంట్రల్ జోన్ మధ్య దులీప్‌ట్రోఫీ ఫైనల్ రసవత్తరంగా సాగుతున్నది. తొలి ఇన్నింగ్స్‌లో స్వల్ప స్కోరుకు పరిమితమైన సౌత్‌జోన్..రెండో ఇన్నింగ్స్‌లో అదరగొడుతున్నది. ఓవర్‌నైట్ స్కోరు 129/2తో నాలుగో రోజు ఆదివారం రెండో ఇన్నింగ్స్‌కు దిగిన సౌత్‌జోన్ 426 పరుగులకు ఆలౌటైంది. ఓవర్‌నైట్ బ్యాటర్లు రవిచంద్రన్ స్మరణ్(67), రికీ భుయ్(45) జట్టుకు మెరుగైన శుభారంభం అందించారు. వీరిద్దరు సెంట్రల్ జోన్ బౌలింగ్ దాడిని నిలువరిస్తూ సాధికారిక ఇన్నింగ్స్‌తో ఆకట్టుకున్నారు. కెప్టెన్ అజారుద్దీన్(27), నిజార్(12) నిరాశపరిచినా.. అంకిత్‌శర్మ(99), సిద్ధార్థ్(84) అర్ధసెంచరీలతో సౌత్‌జోన్ భారీ స్కోరుకు బాటలు వేశారు. వీరిద్దరు కలిసి ఏడో వికెట్‌కు 192 పరుగుల భాగస్వామ్యం నెలకొల్పారు. కార్తీకేయ(4/110), సారాంశ్(3/130) రాణించారు.

Printed and Published by **Damodar Rao Divakonda**, on behalf of Telangana Publications Pvt Ltd, Printed at Telangana Publications Pvt. Ltd, H.Nos. 9-87/3, 9-87/1, Adj to Jenvi Conventions, Tumkunta, Devera Yanjaal, Shamirpet Mandal, Dist: Medchal - 500 078.
Published At Telangana Publications Pvt Ltd. 8-2-603/1/7,8,9. Krishnapuram, Road No.10, Banjara Hills, Hyderabad, 500 034, Telangana State. Editor: **Thigulla Krishna Murthy.** Ph: +91 40 2329 1999, Fax: +91 40 2333 4242, 040-23291118, Toll Free: 1800 425 3666. RNI No. TELTEL/2011/37693.